
'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 118

శుక్రవారం 19-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పట్టు' కొనసాగించాలి

ఒలింపిక్స్ బరిలో ఆరుగురు భారత రెజ్లర్లు.. వినేశ్, అంతిమ్‌పై ఆశలు - 17లో



81,000 దాటిన సెన్సెక్స్

నాలుగో రోజూ రికార్డుల ర్యాలీ.. 24,800కి నిఫ్టీ.. - 17లో



పట్టాలు తప్పిన రైలు

యూపీలోని గోండా జిల్లాలో చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతిచెందారు.


- వివరాలు 6లో



సెంటర్లవారీగా ఫలితాలు..

పరీక్ష కేంద్రాలు, నగరాలవారీగా నీట్-యూజీ ఫలితాలను ప్రకటించాలని ఎన్‌టీఏను సుప్రీంకోర్టు ఆదేశించింది.


- వివరాలు 6లో



బైడెన్‌కు కరోనా

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కరోనా బారినపడ్డారు. ప్రస్తుతం ఐసొలేషన్‌లో ఉన్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్'లో వెల్లడించారు.

- వివరాలు 6లో



మళ్లీ తెరుచుకున్న రత్న భండార్

ఆభరణాలను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే నిమిత్తం రత్న భండార్ ఖజానా గదిని అధికారులు మళ్లీ తెరిచారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

23 నుంచి అసెంబ్లీ భేటీ



రాష్ట్ర శాసనసభ మూడో విడత సమావేశాలు ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. శాసనమండలి సమావేశాలు మరుసటి రోజు 24న ఉదయం 10 గంటలకు మొదలవుతాయి.

- వివరాలు 18లో

ఈ సమస్య అందరిదీ..



కుక్కల దాడి సమస్య ఒకరిది కాదని, అందరిదీ అని హైకోర్టు అభిప్రాయపడింది. మనుషులపై దాడి చేయకుండా పరిష్కారం కావాలని.. దీనిపై నిపుణులను సంప్రదించి నివేదిక ఇవ్వాలని జంతు జననాల నియంత్రణ కమిటీని ఆదేశించింది.

- వివరాలు 5లో

గురువారం సచివాలయంలో రూ. 6,098 కోట్ల రుణమాఫీ పథకాన్ని రైతులతో కలిసి లాంఛనంగా ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, వ్యవసాయ మంత్రి తుమ్మల. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం, పొంగులేటి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు తదితరులు



మాటకు కట్టుబడి మాఫీ

తొలివిడతలో రూ. లక్ష వరకు రుణమాఫీ పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, వ్యవసాయ మంత్రి తుమ్మల

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి ప్రసంగించిన రేవంత్‌రెడ్డి

11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,098 కోట్లు జమ

- వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ
- కాంగ్రెస్ మాటే శిలా శాసనమని మరోసారి రుజువైంది
- ఆగస్టు పూర్తి కాకముందే మొత్తం మూడు విడతల్లో రూ.2 లక్షలు మాఫీ
- దేశ చరిత్రలో తొలిసారిగా రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తున్నామన్న సీఎం
- 7 నెలల్లో పథకాలకు రూ.29 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్ల నగదు జమ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మాటే శిలాశాసనమని మరోసారి రుజువైందని అన్నారు. రైతుల రుణమాఫీ పథకంలో భాగంగా గురువారం సచివాలయంలో తొలి విడతగా రూ. లక్ష వరకు మాఫీ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద ఉన్న రైతులతో వీడియో మిగతా 2వ పేజీలో ▶

ఇతర బకాయిలకు జమ చేసుకోవద్దు

- రుణమాఫీ నిధులపై బ్యాంకర్లకు భట్టి, తుమ్మల సూచన
- రూ.31 వేల కోట్లు ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర
- రైతులతోపాటు బ్యాంకర్లు కూడా పండుగ జరుపుకోవాలి

2 లో

వరంగల్‌కు రాహుల్ గాంధీ!

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో ఈ నెలాఖరున 'కృతజ్ఞత సభ'.. ఇదే వేదికపై 2022 మే 6న 'మాఫీ' హామీ
- హామీ అమలు దేశానికి తెలిపేలా భారీ సభ

3 లో

ఏపీలో ఆటవిక పాలన

ప్రధాని మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ

- అధికార యంత్రాంగాన్ని రాజకీయమయం చేసిన టీడీపీ కూటమి సర్కార్
- హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పాలన
- గత నెల రోజుల్లో 31 మంది హత్య.. 300 మందిపై హత్యాయత్నాలు.. టీడీపీ నేతల వేధింపులు తాళలేక 35 మంది ఆత్మహత్య
- అరాచకాలు భరించలేక ఊళ్లు విడిచివెళ్లిన 2,700 కుటుంబాలు..
- వైఎస్సార్‌సీపీని అణగదొక్కడానికి పథకం ప్రకారం చేసిన దుర్మార్గాలే ఇవన్నీ
- ఓ మంత్రి రెడ్ బుక్ పేరిట హోర్డింగ్‌లతో దాడులకు పురిగొల్పారు
- వినుకొండలో నడిరోడ్డుపై నరమేథం..
- పుంగనూరులో పార్టీ లోక్‌సభ పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకల దాడి

12 లో



- ఈ అరాచకాలను అంతమొందించి తక్షణమే శాంతి స్థాపనకు చొరవ చూపండి
- 45 రోజులుగా జరిగిన ఘటనలపై కేంద్ర సంస్థలతో విచారణ జరపాలని విన్నపం
- ఈ దురాగతాలను నివేదించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని వినతి

వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌పై దాడి

- పుంగనూరులో రోజంతా టీడీపీ గూండాల విధ్వంసకాండ.. రాజంపేట ఎంపీని కొట్టి చంపేందుకు పక్కా పథకం

12 లో

మాకెందుకు కాలేదు మాఫీ?

లక్షలాది మంది రైతుల గగ్గోలు

అనేకచోట్ల లక్ష వరకు రుణాలున్న వారి పేర్లు గల్లంతు..

2 లో

- ఒక్క ఖమ్మం డీసీసీబీ పరిధిలోనే లక్ష మందికి నిలిచిన రుణమాఫీ
- రేషన్‌కార్డు లేకపోవడం వల్లనేనన్న అనుమానాలు
- బంగారం, పాస్‌బుక్‌పై రుణాలకూ వర్తించని వైనం.. కారణాలు చెప్పలేకపోతున్న బ్యాంకు అధికారులు



స్థానిక ఎన్నికల్లో లబ్ధికే రుణమాఫీ డ్రామా: బండి



సాక్షి, హైదరాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రుణమాఫీ డ్రామా ఆడుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. బ్యాంకులో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ వడ్డీతోసహా బకాయిలు చెల్లించి 'నో డ్యూస్ సర్టిఫికెట్' ఇప్పించే బాధ్యత సర్కార్‌దేనని స్పష్టం చేశారు. ఎన్నికల హామీ మేరకు రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. 'ఏం సాధించారని సంబురాలు చేసుకుంటున్నారు? పంట నష్టపరిహారం ఇవ్వకుండా అన్నదాతలను గోస పెట్టినందుకా?'అంటూ కాంగ్రెస్ సర్కార్‌కు బండి ప్రశ్నలు సంధించారు. రైతుభరోసా పేరుతో రబీ, ఖరీఫ్ సీజన్‌లో రైతు లు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు చొప్పున ఎందుకివ్వలేదని హైదరాబాద్‌లో గురువారం ఓ ప్రకటనలో నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తుంటే, వారిలో 11 లక్షల మందికే రుణమాఫీ వర్తింపజేస్తుండటం అన్యాయమన్నారు.

నేను రాజీనామాకు సిద్ధం.. నీ సంగతేంటి: హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులందరికీ ఆగస్టు 15 వరకు రూ.2లక్షల రుణమాఫీతోపాటు ఆరు గ్యారంటీల్లో భాగమైన 13 హామీలను సంపూర్ణంగా అమలు చేసి చూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. హామీలు అమలు చేయని పక్షంలో మీరు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారా అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం తనపై చేసిన వ్యాఖ్యలపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 'ఎక్స్'వేదికగా మండిపడ్డారు. 'ప్రజలకు, నా వల్ల మంచి జరుగుతుందంటే నేను పదవులకు రాజీనా మా చేయడానికైనా వెనుకాడను. ఉద్యమ సమయంలో పదవికి రాజీనామా చేయకుండా వెన్నుచూపింది మీరు . కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యా సం చేస్తానని ప్రకటించి, వెన్నుచూపి పారిపోయింది కూడా మీరే. పారిపోయిన చరిత్ర నీది.. నిత్యం ప్రజల పక్షాన నిలిచిన చరిత్ర నాది. మంత్రి, ఎమ్మెల్యే పదవులను కూడా తృణప్రాయంగా భావించి రాజీనామా చేసిన చరిత్ర నాది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

గ్రూప్-2 వాయిదాకు ప్రభుత్వం సానుకూలం

- ఎంపీ చామల, ఎమ్మెల్సీ బల్మూరి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల డిమాండ్‌కు అనుగుణంగా గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వెల్లడించారు. ఉద్యోగ నియామకాల అర్హత పరీక్షలపై కొంత కాలంగా నెలకొన్న గందరగోళ పరిస్థితులను సర్దుబాటు చేసేక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి వారు గురువారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో నిరుద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి నిరుద్యోగుల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షను వాయిదా వేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని, వాయిదాకు సానుకూలంగా ఉందని తెలిపారు. నిరుద్యోగులు వెల్లడించిన అన్ని అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ దాదాపు మూడు వారాలు ఉందని, అయితే గ్రూప్-2 పరీక్షలు రెండ్రోజులే ఉండటంతో వాటిని వాయిదా వేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని వివరించారు. అక్టోబర్‌లో గ్రూప్-1 ప్రిలిమ్స్, నవంబర్‌లో గ్రూప్-3 పరీక్షలు ఉండటంతో డిసెంబర్‌లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.మానవతారాయ్, చెనగాని దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



డోంట్‌వర్రీ సార్! ఆయనకు నిజాలేంటో, అబద్ధాలేంటో అస్సలు గుర్తుండటం లేదు!

రుణమాఫీ పేరుతో ఫేక్ లింకులు.. మెసేజ్‌లు

- ఆ లింకులపై క్లిక్ చేయకండి
- అలా చేస్తే మీ బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయి
- ఎవరు ఫోన్ చేసినా ఓటీపీలు, వివరాలు చెప్పవద్దు..
- రాష్ట్ర పోలీస్ శాఖ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ ప్రక్రియ మొదలు కావటంతో సైబర్ మోసగాళ్లు సరికొత్త మోసానికి తెరతీసినట్టు తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. వివిధ బ్యాంకుల పేరుతో, వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోలో బ్యాంకు గుర్తు (లోగో), పేరు.. బ్యాంకు అధికారుల ఫొటోలతో నకిలీ వాట్సాప్ అకౌంట్‌ని సృష్టించి వాటి నుంచి మోసపూరితమైన లింకులు (ఏపీకే ఫైల్స్) పంపుతున్నారని అప్రమత్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసులు గురువారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. బ్యాంకుల పేరిట వాట్సాప్‌లలో వచ్చే అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వాటిని డౌన్‌లోడ్ చేస్తే మన మొబైల్‌ఫోన్ సైబర్ నేరగాళ్ల నియంత్రణలోకి వెళుతుందని తెలిపారు. అదేవిధంగా మన ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లకు సైతం మనం పంపినట్టుగా ఈ మోసపూరితమైన లింకులు వెళతాయని హెచ్చరించారు. దీనివల్ల మీ పేరుతో సైబర్ నేరగాళ్లు డబ్బులు కొల్లగొట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాట్సాప్‌కు గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే బ్లూ కలర్ లింకులను గానీ, ఏపీకే ఫైళ్లనుకానీ డౌన్‌లోడ్ చేసుకుంటే, సైబర్ నేరగాళ్లు మీ గూగుల్ పే, ఫోన్‌పే నంబర్ల నుంచి డబ్బులు కొట్టేసే ప్రమాదం ఉందని తెలిపారు. ఎవరు ఫోన్ చేసినా ఓటీపీలు, ఇతర వివరాలు చెప్పవద్దని సూచించారు. ఒకవేళ ఇలాంటి ఆన్‌లైన్ మోసానికి గురయితే వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మాకెందుకు కాలేదు మాఫీ?

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సొంత జిల్లా ఖమ్మం డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం ఉన్నవారు 1,43,327 మంది (పీఏసీఎస్ ఖాతాలు) ఉన్నారు. వీరికి గురువారం రూ.526 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ కేవలం 37,625 మంది రైతులకు రూ.121 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగిలిన 1.05 లక్షల మందికి రుణమాఫీ ఎందుకు జరగలేదన్నది అంతు చిక్కడం లేదు.

మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి సహకార బ్యాంకు పరిధిలో 756 మంది లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్నారు. వీరిలో కేవలం 388 మంది రైతుల పేర్లు మాత్రమే గురువారం నాటి రుణమాఫీ జాబితాలో వచ్చాయి. మిగతా వారికి ఎందుకు రుణమాఫీ జరగలేదో కారణాలు తెలియవని బ్యాంకు అధికారులు అంటున్నారు.

లక్షలాది మంది రైతుల గగ్గోలు

- అనేకచోట్ల లక్ష వరకు రుణాలున్న వారి పేర్లు గల్లంతు
- ఒక్క ఖమ్మం డీసీసీబీ పరిధిలోనే లక్ష మందికి నిలిచిన రుణమాఫీ
- రేషన్‌కార్డు లేకపోవడం వల్లేనన్న అనుమానాలు
- బంగారం, పాస్‌బుక్ పెట్టి తీసుకున్న రుణాలకూ వర్తించని వైనం

సాక్షి, హైదరాబాద్: రూ.లక్ష వరకు రైతుల రుణాలు మాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిధులు బ్యాంకుల్లో జమ చేశామని పేర్కొంది. కానీ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు, ప్రభుత్వం చెప్పినట్టుగా లక్ష రూపాయల రుణమాఫీ జరగలేదని క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తమకు అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డు సహా పీఎం కిసాన్ నిబంధనల కారణంగానే లక్షలాది మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందలేక పోయారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్‌కార్డుతో సంబంధం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నా.. గురువారం నాటి రుణమాఫీని పరిశీలిస్తే, కుటుంబాన్ని గుర్తించేందుకు దాన్ని ప్రామాణికంగా తీసుకోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో వందలాది మంది అర్హులైన రైతులు ఉన్నా, ఒక్కరికి కూడా రుణమాఫీ కాకపోవడం విస్తుగొలుపుతోంది. బంగారాన్ని కుదవ పెట్టి పాస్‌బుక్‌తో పంట రుణాలు తీసుకున్న రైతులకు కూడా మాఫీ ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు విలేకరులతో చిట్‌చాట్‌లో స్పష్టం చేశారు. కానీ ఎక్కడా బంగారం రుణాలు మాఫీ కాలేదని రైతులు అంటున్నారు. రేషన్‌కార్డుతో పాటు పీఎం కిసాన్‌లో ఉన్న ఏ నిబంధనలను సర్కారు అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గందరగోళం నెలకొంది. జాబితాల్లో తమ పేర్లు లేవంటూ గ్రామాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ కాకపోవడానికి కారణాలను బ్యాంకు అధికారులు కూడా చెప్పలేకపోతుండటం గమనార్హం. హైదరాబాద్ కేంద్రంగా జాబితాలు వచ్చాయని, ఈ విషయంలో తమకేమీ తెలియదని కొందరంటున్నారు. తొలి విడతలోనే భారీ సంఖ్యలో రైతులకు రుణమాఫీ కాకపోవడంతో.. వచ్చే రెండు విడతల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీ జరగని మరికొన్ని కేసులు

- భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన కోట శైలజ 2023 ఆగస్టు 10వ తేదీన స్థానిక బ్యాంకులో రూ.97 వేలు పంట రుణం తీసుకున్నారు. కానీ ప్రస్తుత రుణమాఫీ జాబితాలో ఆమె పేరు రాలేదు. అయితే ఆమెతో పాటు అదే రోజు రుణం తీసుకున్న మరో రైతు పేరు జాబితాలో ఉంది.
- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదుల బండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం రుణమాఫీ కోసం 865 మందితో జాబితా పంపించింది. వీరు తీసుకున్న రుణం రూ.4.65 కోట్లు. లక్ష రూపాయల వరకు రుణం తీసుకున్న రైతులు 730 మంది కాగా, వారిలో 352 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. భార్యా భర్తలకు ఒకే బ్యాంకులో వేర్వేరు ఖాతాలు ఉండటం, వేర్వేరు బ్యాంకుల్లో ఇద్దరికి ఖాతాలు ఉండటం, సాంకేతిక లోపం లాంటివి కారణంగా అధికారులు చెబుతున్నారు.
- నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలోని పలువురు రైతులు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌ల నుంచి పంట రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పొందే వారి జాబితాలో గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పేర్లు లేవు. బ్యాంక్ అధికారులను అడిగితే తాము జాబితాను పంపించలేదని, హెడ్ ఆఫీస్ నుంచి ప్రభుత్వం జాబితాను తీసుకుందేమోనని సమాధానం చెబుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో లక్ష రూపాయలలోపు రుణాలు తీసుకున్న వారు 1,76,683 మంది ఉండగా, వారు మొత్తం రూ.941.29 కోట్లు తీసుకున్నట్లుగా ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. కానీ రుణమాఫీలో కొంతమంది పేర్లు మిస్ అయ్యాయి.

ఒక్కరికి కూడా కాలేదు..

- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సహకార బ్యాంకులో లక్ష రూపాయలలోపు రుణమాఫీకి అర్హులైన రైతులు 1,407 మంది ఉన్నారు. వీరిలో గురువారం ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సహకార బ్యాంకు అధికారులు చెబుతున్నారు.
- ఇదే జిల్లా కారేపల్లి సహకార సొసైటీలో 3,790 మంది రైతులు రుణమాఫీకి అర్హులు. వీరు తీసుకున్న రుణం 19.27 కోట్లు కాగా అందులో రూ.లక్షలోపు రుణమాఫీ కావాల్సిన రైతుల సంఖ్య 3,153. వారికి ఇవ్వాల్సిన సొమ్ము రూ. 10.30 కోట్లు. కానీ గురువారం రుణమాఫీ అయిన రైతులు 668 మంది మాత్రమే కాగా వారికి సంబంధించి కేవలం రూ. 2.06 కోట్లు మాత్రమే మాఫీ అయ్యింది.
- మెదక్ డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) పాపన్నపేట బ్రాంచి పరిధిలో రూ.లక్ష లోపు పంట రుణాలున్న మొత్తం రైతులు 1,685 మంది కాగా, వీరు తీసుకున్న పంటరుణం రూ.5.99 కోట్లు. ఇందులో కేవలం 845 మంది రైతులకు సంబంధించిన రూ.2.83 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగతా వారివి ఎందుకు మాఫీ కాలేదనే వివరాలు తమకు రావాల్సి ఉందని బ్యాంకు బ్రాంచి మేనేజర్ కిషన్ తెలిపారు.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వాణిజ్య బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వేల మంది రైతుల పేర్లు కూడా రుణమాఫీ జాబితాలో లేకుండా పోయాయి.

నా పంట రుణం మాఫీ కాలే

నేను నేలకొండపల్లి సహకార బ్యాంక్‌లో పట్టాదారు పాస్ పుస్తకం పెట్టి రూ.50 వేలు వ్యవసాయ రుణం తీసుకున్నా. పంట సాగు కోసమే ఈ రుణం పొందా. ప్రభుత్వం రుణమాఫీకి పెట్టిన నిబంధనల ప్రకారం నేను అర్హురాలిని. అందరిలాగే నాకు కూడా రుణమాఫీ అవుతుందని రైతువేదిక వద్దకు వచ్చా. కానీ జాబితాలో నా పేరు లేదు. దీంతో నా రుణం మాఫీ కాలేదు. అధికారులు నాకు రుణమాఫీ అయ్యేలా న్యాయం చేయాలి.

– బాలిక రాంబాయి, మహిళా రైతు, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా

ఇతర బకాయిలకు జమ చేసుకోవద్దు

- రుణమాఫీ నిధులపై బ్యాంకర్లకు భట్టి, తుమ్మల సూచన
- రూ.31 వేల కోట్లు ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర
- రైతులతో పాటు బ్యాంకర్లు కూడా పండుగ జరుపుకోవాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒకే దఫాలో ఇంత భారీ స్థాయిలో రుణమాఫీ చేసిన చరిత్ర లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆగస్టు నెల దాటకముందే మొత్తం రూ.31 వేల కోట్లు బ్యాంకుల్లో జమ చేస్తామని చెప్పారు. రుణమాఫీ కింద విడుదల చేస్తున్న నిధులను రైతులకు సంబంధించిన ఇతర బకాయిల కింద జమ చేసుకోవద్దని బ్యాంకర్లకు స్పష్టం చేశారు. గురువారం ఉదయం సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులతో బ్యాంకర్లు మాట్లాడి బకాయిలు రికవరీ చేసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రభుత్వం ఇచ్చే రూ.2 లక్షలు, బ్యాంకులు రికవరీ చేసే మొత్తం కలుపుకొని రైతులను రుణ విముక్తులను చేయాలని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా తాను రైతు రుణమాఫీ గ్యారెంటీ కార్డుపై సంతకం చేసి ఎన్నికల ప్రచారంలోకి వెళ్లామని గుర్తు చేశారు. ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. 40 లక్షల బ్యాంకు ఖాతాల నుంచి రూ.31 వేల కోట్ల రైతు రుణాలు ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర అని అన్నారు. బ్యాంకర్లను వన్ టైమ్ సెటిల్‌మెంట్ అడగకుండా పూర్తిగా చెల్లిస్తున్నందుకు బ్యాంకర్లు కూడా రైతుల మాదిరి పండుగ చేసుకోవాలని భట్టి అన్నారు. రుణమాఫీ కాగానే రైతులకు అవసరమైన రుణాలు విరివిగా ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు.

దేశం గర్వించదగ్గ రోజు: తుమ్మల

ఇది దేశం గర్వించదగిన రోజు అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రుణమాఫీ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తీవ్రంగా శ్రమించారని తెలిపారు. వర్షాలు మొదలయ్యాయని, రైతు రుణమాఫీ నిధులు సకాలంలో అందితే వ్యవసాయం పండుగలా మారుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాకు ఎక్కువ నిధులు

గురువారం తొలివిడత కింద రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ విడుదల చేసిన నిధుల్లో అత్యధికం నల్లగొండ జిల్లాకు వెళ్లాయి. ఈ జిల్లాకు చెందిన 78,463 కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో రూ.454.49 కోట్లు జమ అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గం వారీగా తీసుకుంటే అత్యధికంగా ఆందోల్ నియోజకవర్గంలో 19,186 కుటుంబాలకు రూ.107.83 కోట్లు విడుదల అయ్యాయి.

రూ.లక్ష వరకు రుణమాఫీ కింద జిల్లాల వారీగా విడుదల అయిన నిధుల వివరాలు..

జిల్లా	రుణ ఖాతాలు	కుటుంబాలు	విడుదలైన నిధులు (రూ. కోట్లలో)
నల్లగొండ	83,124	78,463	454.49
సిద్దిపేట	53,137	50,295	290.24
సూర్యాపేట	56,274	52,418	282.98
సంగారెడ్డి	51,167	48,970	279.62
నాగర్‌కర్నూల్	47,750	45,139	270.04
ఖమ్మం	59,172	52,167	264.23
వికారాబాద్	47,048	44,733	258.33
రంగారెడ్డి	49,961	47,007	258.19
మెదక్	48,864	45,882	241.82
కామారెడ్డి	50,097	45,221	233.41
నిజామాబాద్	44,469	41,474	225.62
మహబూబ్‌నగర్	39,380	37,372	211.15
జగిత్యాల	39,269	37,438	207.99
యాదాద్రి భువనగిరి	38,285	35,501	203.82
కరీంనగర్	37,745	35,686	194.64
నిర్మల్	30,106	28,825	171.77
నారాయణపేట	28,684	27,333	165.45
మహబూబాబాద్	28,585	27,249	159.65
వనపర్తి	29,613	28,010	156.92
మంచిర్యాల	29,421	27,827	154.39
జనగాం	26,496	25,391	149.69
పెద్దపల్లి	29,725	28,080	149.43
హనుమకొండ	26,369	25,161	145.00
జోగుళాంబ గద్వాల	24,398	23,548	144.09
రాజన్న సిరిసిల్ల	23,986	22,963	136.36
వరంగల్	26,396	24,626	134.21
కొత్తగూడెం	28,019	25,101	132.07
కొమురంభీం ఆసిఫాబాద్	22,000	21038	125.20
ఆదిలాబాద్	18,821	18,353	120.79
జయశంకర్ భూపాలపల్లి	17,054	16,266	94.86
ములుగు	12,997	12,350	69.97
మేడ్చల్	2,781	2,667	12.53
	11,50,193	10,83,004	6,098.93

పావు వంతు రైతులే అర్హులా?

- రేవంత్ రుణమాఫీ పేరిట రైతాంగాన్ని మోసగిస్తున్నారు: కేటీఆర్
- 40 లక్షల మంది రైతుల్లో 11 లక్షల మందికే ఇస్తారా?



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మరోమారు మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రైతుబంధు కింద జూన్‌లో రైతులకు ఇవ్వాల్సిన నిధుల్లో నుంచి రూ.7 వేల కోట్లను రుణమాఫీ కోసం దారి మళ్లించిందని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. హక్కుగా రావాల్సిన రైతుబంధు డబ్బు నుంచి కొంత మొత్తాన్ని విదిల్చి రుణమాఫీ చేస్తున్నట్లుగా పోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. 40 లక్షల మంది రైతులు లక్ష రూపాయల రుణం తీసుకుంటే 11 లక్షల మందిని మాత్రమే ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 2014, 2018లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీతో పోలిస్తే పావు వంతు రైతులే అర్హత సాధించారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 2014లోనే రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసేందుకు రూ. 16,144 కోట్లు వెచ్చించి.. సుమారు 35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చిందని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వండి

ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని కేటీఆర్ 'ఎక్స్'లో కోరారు. ఓ వాహనదారుడిని పోలీసులు దుర్భాషలాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడాన్ని ప్రస్తావిస్తూ దీన్ని పోస్ట్ చేశారు. పౌరుడిపై పోలీసులు వాడిన భాషపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, పోలీసు శాఖ, డీజీపీకి ఇది అంగీకారయోగ్యమైన భాషేనా అని ప్రశ్నించారు.

మాటకు కట్టుబడి మాఫీ

▶ మొదటి పేజీ తరువాయి

కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు.

ఇది మరపురాని రోజు

'నాడు కరీంనగర్‌లో సోనియాగాంధీ మాట ఇచ్చారు. అనంతరం పార్టీకి తీరని నష్టం జరుగుతుందని తెలిసినా, మాట తప్పని, మడమ తిప్పని నాయకురాలిగా, రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా గుర్తుపెట్టుకునేలా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. గత పాలకులు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి రెండుసార్లు మాట తప్పారు. మొదటి ఐదేళ్లలో కేసీఆర్ రూ.16 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి రూ.12 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. రెండోసారి ప్రభుత్వంలో రూ.12 వేల కోట్లు మాఫీ చేస్తానని చెప్పి కేవలం రూ.9 వేల కోట్లు మాత్రమే చేశారు. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉన్నా కేసీఆర్ ప్రజలకిచ్చిన మాటను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు. ఈ నేపథ్యంలో 2022 మే 6న వరంగల్‌లో లక్షలాది మంది రైతుల సమక్షంలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారు. రుణమాఫీ చేస్తామన్నారు. 2023 సెప్టెంబర్ 17న తుక్కుగూడాలో సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారు. వారిచ్చిన మాట ప్రకారమే నేడు సచివాలయంలో కూర్చొని ధైర్యంగా తెలంగాణ రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్లను జమ చేస్తున్నాం. నా 16 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఇది మరపురాని రోజు. రుణమాఫీ చేసే భాగ్యం నాకు కలిగింది. కేసీఆర్ కటాఫ్ పెట్టిన తేదీ మరునాటి నుంచే రుణమాఫీ అమలు చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసిన సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9ని రుణమాఫీ కటాఫ్‌గా పెట్టాం. ఏ అవాంతరాలు లేకుండా రుణమాఫీ పూర్తి చేస్తాం. ముందుగా ఈ రోజు రూ.లక్ష వరకు రుణ విముక్తి కల్పించాం. రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర రుణం ఉన్న రైతులకు త్వరలోనే రుణ విముక్తి కలుగుతుంది. ఆగస్టు నెల పూర్తి కాకముందే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసి తీరతాం. ఇది దేశ చరిత్రలోనే తొలిసారి..'అని సీఎం అన్నారు.

రేషన్‌కార్డు ప్రాతిపదిక కాదు

'కొంతమంది రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలనే అపోహ సృష్టిస్తున్నారు. రైతు రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాతిపదిక కాదు. పాస్‌బుక్‌నే కొలబద్ద. దొంగలు చెప్పే దొంగ మాటలు నమ్మొద్దు. రుణాలు తీసుకున్న దాదాపు 6.36 లక్షల మందికి రేషన్ కార్డులు లేవు. అందుకే పాసుబుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తున్నాం. ప్రతి రైతు రుణమాఫీకి కావాల్సిన చర్యలు చేపడుతున్నాం. సమస్యలు తలెత్తితే బ్యాంకు అధికారులను సంప్రదించాలి. బ్యాంకు అధికారులు కూడా రైతులకు అవగాహన కల్పించాలి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల స్వయంగా రైతు. ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క రుణమాఫీకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయత్నం చేశారు..'అని రేవంత్ చెప్పారు.

త్వరలో వరంగల్‌లో రాహుల్‌గాంధీతో సభ

'గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా ఇవ్వలేదు. మా ప్రభుత్వం ఒకటో తారీఖున జీతాలు ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సంక్షేమ కార్యక్రమాలకు రూ.29 వేల కోట్లు ఖర్చు చేశాం. గత ప్రభుత్వ అప్పులకు మిత్తీగా ప్రతి నెలా రూ.7 వేల కోట్లు చెల్లిస్తున్నాం. జీతాలు, పింఛన్ల కోసం రూ.5 వేల కోట్లు కేటాయిస్తున్నాం. ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపించాం. రైతు రుణమాఫీలో దేశానికి తెలంగాణ మోడల్‌గా ఉండబోతుంది. 8 నెలల్లో రుణమాఫీ హామీని నెరవేర్చి దేశంలోనే తలెత్తుకునేలా ఉన్నాం. సవాల్ చేసిన ఆయనను రాజీనామా చేయమని మేం అడగం. ఇప్పటికైనా గాంధీ కుటుంబం మాట ఇస్తే తప్పదని వారు గుర్తు పెట్టుకోవాలి. రైతు రుణమాఫీ సందర్భంగా రాహుల్‌గాంధీని ఆహ్వానించి వరంగల్‌లో బహిరంగ సభ నిర్వహిస్తాం. త్వరలో మంత్రివర్గ సహచరులతో కలిసి ఢిల్లీ వెళ్లి ఆయన్ను ఆహ్వానిస్తాం..'అని సీఎం తెలిపారు.

రాష్ట్ర రైతులకు పెద్ద పండుగ: భట్టి

రాష్ట్రంలో ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న తెలంగాణ వైపు దేశం మొత్తం ఆశ్చర్యంగా చూస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర లేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇది పెద్ద పండుగ అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలు ఇప్పటికే అమలు చేయడంతో పాటు ఈ రోజు రైతు రుణమాఫీ అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి రూ.7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పజెప్పినప్పటికీ రూపాయి రూపాయి పోగేసి రుణమాఫీ అమలు చేసి చూపిస్తున్నామని చెప్పారు. కాగా రైతు రుణమాఫీ పురస్కరించుకుని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలుపుతు సమావేశంలో తీర్మానం చేశారు. కార్యక్రమం చివర్లో కొందరు రైతులకు రుణమాఫీ చెక్కులు సీఎం పంపిణీ చేశారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పార్టీ నేతలు. చిత్రంలో దీపా దాస్‌మున్షీ, మధుయాష్కీ



ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీగా వస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మాఫీ సంబురాలు

- రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ అమలుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్ మొదలు గ్రామ స్థాయిలోని రైతు వేదికల వరకు అన్ని స్థాయిల్లో పార్టీ కేడర్, నాయకులు.. రైతులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామాల స్థాయిలో టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, టీపీసీసీ కార్యవర్గం పాల్గొన్నారు. నల్లగొండలో స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ మంత్రి కోమటిరెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. రైతులకు రుణ విముక్తి కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. పైసా పైసా కూడబెట్టి రైతులను రుణ విముక్తి చేస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ మల్లురవి హాజరయ్యారు.

రైతు వేదికల వద్ద కోలాహలం

గ్రామాల్లో రైతు వేదికల వద్ద రైతులతో కలిసి కాంగ్రెస్ నేతలు సంబురాలు చేసుకున్నారు. క్లస్టర్ స్థాయిలో జరిగిన ఈకార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు కూడా రైతులు రైతు వేదికల వద్దకు వచ్చారు. చప్పట్ల ద్వారా ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించారు. రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్ధిదారుల జాబితాలు కూడా పెట్టడంతో కాంగ్రెస్ నేతల హడావుడి కనిపించింది. కాగా శుక్రవారం మండల స్థాయిలో రుణమాఫీ సంబురాలు జరగనున్నాయి. శని, ఆదివారాల్లో గ్రామ స్థాయిల్లో జరిగే ర్యాలీల కోసం పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మున్షీ, యాష్కీల సమక్షంలో..

హైదరాబాద్ గాంధీభవన్‌లో రైతు రుణమాఫీ సంబురాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున కేడర్ వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, రాష్ట్ర మత్స్యకార సొసైటీల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధులు సత్యం శ్రీరంగం, కమల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మీడియాతో మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే తొలిసారని వ్యాఖ్యానించారు. రుణమాఫీ ప్రారంభించిన జూలై 18 రైతుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.

వరంగల్‌కు రాహుల్ గాంధీ!

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో ఈ నెలాఖరున కృతజ్ఞత సభ'

ఇదే వేదికపై 2022 మే 6న 'రైతు రుణమాఫీ' హామీ

హామీ అమలు దేశానికి తెలిపేలా భారీ సభ



సాక్షి ప్రతినిధి, వరంగల్: ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓరుగల్లులో పర్యటించనున్నారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ నెలాఖరున నిర్వహించ తలపెట్టిన రైతు రుణమాఫీ కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. 2022, మే 6న ఇదే ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా రైతు సంఘర్షణ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సభలోనే ఆయన రైతు డిక్లరేషన్‌ను ప్రకటించారు. రూ.2 లక్షల మేరకు రైతుల రుణా లను మాఫీ చేయనున్నట్లు ప్రకటించడంతోపాటు 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలోనూ చేర్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి కూడా శ్రీకారం చుట్టింది. మొదటి విడతగా రూ.లక్ష వరకు రాష్ట్రవ్యాప్తంగా 10,83,004 రైతు కుటుంబాలకు రూ.6,093.93 కోట్ల రుణాలను మాఫీ చేసింది. మూడు విడతల్లో రూ.2 లక్షల మేర ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో హామీని అమలు చేసేందుకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలిపేందుకు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని టీపీసీసీ యోచిస్తోంది. రాహుల్‌గాంధీని ముఖ్యఅతిథిగా ఆహ్వానించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ముఖ్యులు శనివారం ఢిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. ఆయనతో చర్చించిన తర్వాత కృతజ్ఞత సభ నిర్వహణ తేదీని ప్రకటిస్తారని టీపీసీసీ ముఖ్యనేత ఒకరు చెప్పారు.

సోషల్ మీడియా ద్వారా చెప్పాలి

రైతులతో సీఎం ముఖాముఖి.. రుణమాఫీ సందర్భంగా మాటామంతి

సాక్షి, హైదరాబాద్: తొలి విడత రుణమాఫీ సందర్భంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల రైతులతో మాట్లాడారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఆదిలాబాద్ జిల్లాకు నీళ్లు ఇస్తామని ఆ జిల్లాలోని తాంసీ మండలం బండల్ నాగాపూర్ గ్రామానికి చెందిన రైతు మహేందర్‌కు చెప్పారు. వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల రైతులతో కూడా ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడారు.

సీఎం, మహేందర్ మధ్య సంభాషణ ఇలా..

సీఎం: ఎంత భూమి ఉంది మహేందర్?

మహేందర్: ఎకరం ఉంది సార్.

సీఎం: రుణం ఎంత ఉంది..?

మహేందర్: రూ.50 వేలు ఉంది. ఒకేసారి రుణం తీరిపోతున్నందుకు సంతోషంగా ఉంది.

సీఎం: రైతుల కష్టాలు, ఆదివాసుల కష్టాలు తెలుసుకుంటుందనే సీతక్కను మీ జిల్లాకు ఇన్‌చార్జిగా మంత్రిగా వేశాం. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నావా?

మహేందర్: ఉన్నాను సార్.

సీఎం: రైతు రుణమాఫీ గురించి సోషల్ మీడియా ద్వారా చెబుతావా?

మహేందర్: చెబుతా.

సీఎం: ధన్యవాదాలు మహేందర్.. మీ జిల్లాలో ప్రాణహితపై తుమ్మిడిహెట్టిప్రాజెక్టుతో నీళ్ల ఇస్తాం.

వరంగల్ జిల్లా ఎల్లయ్యతో..



ఎల్లయ్య: రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుండటంతో పండగ రోజులా అనిపిస్తోంది.

సీఎం: రుణమాఫీ డిక్లరేషన్ వరంగల్‌లోనే చేశాం తెలుసా?

ఎల్లయ్య: తెలుసు సార్. వరంగల్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు..

సీఎం: ఆ సభకు వచ్చావా?

ఎల్లయ్య: వచ్చా...

సీఎం: వరంగల్‌లో సభ పెట్టి రాహుల్‌గాంధీని పిలుద్దామా?

ఎల్లయ్య: పిలిచి కృతజ్ఞతలు తెలుపుదాం.

సీఎం: సభకు వస్తావా..?

ఎల్లయ్య: నేను తప్పకుండా వస్తా.. వరంగల్ జిల్లా అంటేనే రైతులు. సభకు నాతో పాటు రైతులను తీసుకువస్తా.

ఖమ్మం జిల్లా వి.వెంకటాయపాలెం రైతు సీతారాంతో..

సీతారాం: రుణమాఫీతో సంతోషం కలిగింది. యువ రైతులకు సాగు చేయాలనే సంకల్పాన్ని మీరు కల్పించారు.

సీఎం: సీతారాం ఎంత భూమి ఉంది? ఎంత అప్పు ఉంది?

సీతారాం: నాలుగున్నర ఎకరాల భూమి, రూ.78 వేల అప్పు ఉంది.

సీఎం: మొత్తం రుణమాఫీ అవుతోంది. మీకు ఎలా ఉంది..?

సీతారాం: చాలా సంతోషంగా ఉంది.. మీరు చల్లగా ఉండాలి.

సీఎం: పిల్లలు ఎంతమంది సీతారాం?

సీతారాం: ఇద్దరు పాపలు. పెద్ద పాప ఇంటర్, చిన్న పాప పదో తరగతి చదువుతున్నారు.

సీఎం:ఇద్దరిని మంచిగా చదివించు, చదువు ఆపొద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

సీతారాం: ఆపను సార్.. మంచిగా చదివిస్తా.

ఇప్పుడు నమ్మకం కలిగింది..

రేవంత్‌రెడ్డితో బోధన్ రైతు రవి

రవి: గతంలో రుణమాఫీపై ఎవరు హామీ ఇచ్చినా నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. కానీ ఇప్పుడు నమ్మకం కలిగింది. సంతోషంగా ఉంది. మిమ్మల్ని మరో రాజశేఖరరెడ్డిలా చూస్తున్నాం. రైతులందరి తరఫున పాదాభివందనం చేస్తున్నా.

సీఎం: మీ నిజామాబాద్ జిల్లాకు రూ.225 కోట్లు రుణమాఫీ కింద ఇస్తున్నాం.

రవి: నాట్లు వేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నాం

సీఎం: అంకాపూర్ చికెన్ తినిపిస్తావా?

రవి: తప్పకుండా.. అంత అదృష్టం ఎలా వదులుకుంటాం సార్?

తొలిరోజు డీఎస్సీకి 82.14 % మంది హాజరు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్షలు (డీఎస్సీ) గురువారం మొదలయ్యాయి. తొలిరోజు జరిగిన పరీక్షకు 19,746 మందికిగాను 16,221 మంది హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా జరిగిన తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు అధికారులు తెలిపారు. 82.14% మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్టు వెల్లడించారు. తొలిరోజు స్కూల్ అసిస్టెంట్స్ పోస్టుల్లో భాగంగా ఫిజికల్‌సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులపై పరీక్ష జరిగింది. కరెంట్ అఫైర్స్‌లో ప్రశ్నలు ఈసారి భిన్నంగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. ఎ క్కువగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రశ్నలు వచ్చాయి. విద్యావేత్తల నిర్వచనాలు, ఐసీటీ, నలంద విక్రమశిల విద్యాకాలం, ఆవిష్కరణ సిద్ధాంతం, హంటర్ కమిషన్ టాపిక్స్ నుంచి ప్రశ్నలొచ్చాయి. ఒక సన్నివేశాన్ని ఇచ్చి వికాస సూత్రాలు రాసే విధానంలో ప్రశ్నలకు ప్రాధాన్యం ఇచ్చారు. కరెంట్ అఫైర్స్‌లో 8, 9, 10 తరగతుల స్టాండర్డ్స్ నుంచే ప్రశ్నల సరళి ఉన్నా, కొన్ని ఇంటర్‌స్థాయిలో ఉన్నాయి.

750 కోట్లతో 'మలబార్': శ్రీధర్‌బాబు



మలబార్ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఏర్పాటు చేస్తున్న బంగారం, వజ్రాభరణాల తయారీ కేంద్రం 'మలబార్' దేశంలోనే అతిపెద్దదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. దీనికి సంబంధించి మలబార్ ఇప్పటికే రూ.183 కోట్లు ఖర్చుచేసిందని, మూడేళ్లలో రూ.750 కోట్లు వెచ్చిస్తుందని చెప్పారు. గురువారం సచివాలయంలో మలబార్ గ్రూప్ ప్రతినిధులతో జరిగిన భేటీలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో మలబార్ చైర్మన్ ఎంపీ.అహమ్మద్, సంస్థ ప్రతినిధులు కేపీ.అబ్దుల్ సలామ్, ఏకే.నిషాద్, ఇలంగోవన్, నందకుమార్, షఫీక్ పాల్గొన్నారు.


ఏఐపై 20 ఏళ్ల రోడ్ మ్యాప్: ప్రభుత్వ పాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపై వచ్చే 20 ఏళ్లకు సంబంధించి రోడ్ మ్యాప్ రూపొందించాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు సూచించారు. బ్రిటిష్ హైకమిషన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో మంత్రి భేటీ అయ్యారు. 200 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 'ఏఐ సిటీ'లో భాగస్వాములు కావాలని వారిని మంత్రి కోరారు. భేటీలో బ్రిటిష్ హై కమిషన్ ప్రతినిధి లారా బాల్డ్‌విన్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ ప్రతినిధులు వికాస్ అగర్వాల్, నవీన్‌కౌల్, కిరణ్ వింజమూరి, రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ డైరెక్టర్ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజి ద్వారా నిధుల సమీకరణ

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మూలధన సేకరణలో సెబీ రూపొందించిన సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజి విధానాన్ని వినియోగించుకోనున్నట్టు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. నిధుల సమీకరణకు పెట్టుబడులు ఆహ్వానించే ప్రణాళికపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎక్విప్ దేశీ అనే పెట్టుబడుల సేకరణ సంస్థ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (ఎన్ఎస్ఈ) ప్రతినిధులు, ప్రభుత్వ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఎస్సీపై స్టేకు నిరాకరణ

- పరీక్షల్లో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
- సన్నద్ధతకు సమయం ఇవ్వలేదన్న పిటిషనర్లు.. పరీక్షల వాయిదా సరికాదన్న ఏఏజీ రజనీకాంత్
- 10 మంది కోసం పరీక్షలు ఆపడం సమర్థనీయంకాదని వెల్లడి
- మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ పరీక్షలను నిలిపివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. పరీక్షలు ఇప్పటికే మొదలైనందున జోక్యం చేసుకోలేమని.. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. తుది ఉత్తర్వుల మేరకు ఫలితాలు ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరినా కుదరదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం గత ఫిబ్రవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 5 వరకు సాగనున్నాయి. అయితే సన్నద్ధతకు సరిగ్గా సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారని, స్టే ఇవ్వాలని కోరుతూ వికారాబాద్ జిల్లా నాగులపల్లికి చెందిన రాంపల్లి అశోక్‌తోపాటు మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం సమయం ఇవ్వకుండా అత్యవసరమన్నట్లు డీఎస్సీ నిర్వహిస్తోందన్నారు. సన్నద్ధతకు సరైన సమయం ఇవ్వని కారణంగా చాలామంది టీచర్ పోస్టు పొందలేకపోయే ప్రమాదం ఉందని చెప్పారు. 2022 నుంచి పిటిషనర్లు గ్రూప్–1, గ్రూప్–2తోపాటు కేంద్ర ప్రభుత్వం నిర్వహి స్తున్న పలు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారన్నారు. ఈ కారణంగా డీఎస్సీకి సిద్ధం కావడానికి తగిన సమయం లేకుండా పోయిందని చెప్పారు. డీఎస్సీ పరీక్షలపై స్టే విధించి సన్నద్ధకు సమయం ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

నిరుద్యోగుల జీవితాలను ఫణంగా పెట్టొద్దు: ఏఏజీ

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, గురువారం నుంచి ప్రారంభమయ్యాయని చెప్పారు. దాదాపు 2.5 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యారన్నారు. 10 మంది కోసం లక్షల మంది జీవితాలను ఫణంగా పెట్టవద్దని కోరారు. 81.5% మంది పరీక్ష లకు హాజరవుతున్నారన్నారు. పిటిషనర్లు ఏయే పరీక్షలకు హాజరయ్యారు.. వారి హాల్‌టికెట్ల వివరాలు సమర్పించలేదని పేర్కొన్నారు. పరీక్షను వాయిదా వేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ డీఎస్సీ పరీక్షలకు వర్తించదని వెల్లడించారు. తుది తీర్పు మేరకు ఫలితాలు వెల్లడించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ల న్యాయవాది విజ్ఞప్తి చేయగా.. ఏఏజీ అభ్యంతరం చెప్పారు. ఇప్పటికే పలు పరీక్షల రద్దుతో నిరుద్యోగులు విసిగిపోయారని, తుది తీర్పు మేరకే ఫలితాల వెల్లడి అంటే వారు మరింత నిరుత్సాహంలో కూరుకుపోతారన్నారు. ఏఏజీ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవిస్తూ.. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని చెప్పారు.

హెచ్‌సీయూలో ఎంటెక్ స్పాట్ రౌండ్ అడ్మిషన్లు

26న ఉదయం సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని సూచన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీలో గేట్ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఎంటెక్ కోర్సుల్లో స్పాట్ రౌండ్ అడ్మిషన్లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంటెక్‌లోని బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సులో 17 సీట్లు, మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో 18 సీట్లు, నానో సైన్స్ అండ్ టెక్నాలజీలో 18 సీట్లు, మ్యాను ఫ్యాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో 18 సీట్లు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ టెక్నాలజీలో 15 సీట్లు, మైక్రో ఎలక్ట్రానిక్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్‌లో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయని, అందులో మళ్లీ జనరల్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్ కేటగిరీలకు రిజర్వ్ చేసిన సీట్లు ఉన్నాయని వర్సిటీ వివరించింది. వెబ్ సైట్ లింకులో రిజర్వేషన్ సీట్లపై సమాచారం చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. జూలై 26వ తేదీ (శుక్రవారం) ఉదయం 9.30 గంటలకు హెచ్‌సీయూ పరిపాలనా భవనంలోని సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ కోసం టెన్త్, 12వ తరగతి, బీటెక్/బీఈ/ఎంఎస్సీ/ అదర్ క్వాలిఫయింగ్ డిగ్రీ గ్రేడ్ షీట్, బీటెక్/ బీఈ/ఎంఎస్సీ, ఇతర క్వాలిఫయింగ్ డిగ్రీ ప్రొవిజినల్/ఒరిజినల్ సర్టిఫికెట్లు, రిజర్వేషన్ ఉంటే అందుకు సంబంధించిన ధృవపత్రాలు, వాలీడ్ గేట్ స్కోర్ కార్డు తీసుకుని రావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు http://acad.uohyd.ac.in లింక్‌ను చూడాలని హెచ్‌సీయూ అధికారులు కోరుతున్నారు. అవసరమైతే ఫోన్ నెంబర్ 040–23132110లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

20న సింగరేణి నియామక పరీక్షలు

సీఎండీ బలరామ్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థలో 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి హైదరాబాద్ కేంద్రంగా ఈనెల 20, 21వ తేదీల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహించనునట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ గురువారం తెలిపారు. మొత్తం 18,665 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లను జారీ చేసినట్లు వెల్లడించారు. అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలన్న ఉద్దేశంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో వివరించారు. పోటీ పరీక్షల నిర్వహణలో విశేష అనుభవం ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఈడీసీఐఎల్ ఆధ్వర్యంలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు, ఈ మేరకు హైదరాబాద్‌లోని 12 కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు.

- పరీక్షకు గంటన్నర ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసేస్తారు.
- అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు కలర్ ఫొటోలు తీసుకురావాలి.
- పరీక్షా కేంద్రంలో పరీక్షకు ముందు, తర్వాత వారి అభ్యర్థుల బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు.
- అడ్మిట్ కార్డులో తెలిపిన సూచనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. ● అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులు డౌన్ లోడ్ చేసుకోవడంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తినట్టైతే హెల్ప్ డెస్క్ నెం. 08744–249992ను సంప్రదించవచ్చు.

తల్లితండ్రులు, సమీప బంధువులు వదలివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అలాగే తల్లితండ్రులు, సమీప బంధువులు వదలివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది. ఆ ఆస్తి తక్కువైనాసరే, ఎక్కువైనాసరే (అందులో) వాటా మాత్రం నిర్ధారితమై ఉంది.

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 19 జూలై 2024

సొంతగూటి సమస్యలు!

సాగినంత కాలం మనంతటి వాళ్ళు మరొకరు లేరనుకోవడం సహజమే. సాగనప్పుడు కూడా సమైక్యంగా నిలిచి, సవాళ్ళను ఎదుర్కొన్నప్పుడే సత్తా తెలుస్తుంది. రాజకీయంగా, చట్టసభల్లో సంఖ్యాపరంగా కీలకమైన ఉత్తరప్రదేశ్ (యూపీ)లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొన్నేళ్ళుగా తిరుగు లేకుండా సాగింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలేవరకు అత్యంత పటిష్ఠంగా కనిపించిన ఆ పార్టీ రాష్ట్రశాఖలో ఒక్కసారిగా ఇప్పుడు లుకలుకలు బయటకొస్తున్నాయి. ఎదురు లేని నేతగా గుర్తింపు తెచ్చుకున్న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటలకు మొదటిసారిగా సొంత పార్టీలోనే అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. స్వయానా ఉపముఖ్యమంత్రే గొంతు పెంచడం, మంగళవారం ఢిల్లీ వెళ్ళి తమ పార్టీ జాతీయ అధ్యక్షుడితో సమావేశం కావడం, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కూడా దేశ రాజధానికి చేరి పార్టీ అధ్యక్షుడితో – ప్రధానితో విడివిడిగా భేటీ అవడం... ఈ పరిణామాలన్నీ పార్టీలో అంతా సవ్యంగా లేదని తేటతెల్లం చేస్తున్నాయి. యూపీలో 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు త్వరలో రానున్న వేళ పార్టీలో అందరినీ మళ్ళీ ఒక్క తాటి మీదకు తీసుకురావడం ఇప్పుడు అధిష్ఠానానికి తలనొప్పిగా తయారైంది.

లక్నోలో పార్టీ రాష్ట్రశాఖ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆదివారం మాట్లాడుతూ... ఓట్ల బదలీ, మితిమీరిన ఆత్మవిశ్వాసం వల్ల ఎన్నికల్లో యూపీలో బీజేపీ విజయావకాశాలు దెబ్బతిన్నాయని యోగి వ్యాఖ్యానించారు. దాంతో ఇప్పుడీ తేనెతుట్టె కదిలింది. తర్వాత డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్య ప్రసంగిస్తూ, 'ప్రభుత్వం కన్నా పార్టీ పెద్దది. పార్టీ కన్నా ఎవరూ పెద్ద కాదు' అనేశారు. కర్రు కాల్చి వాత పెట్టిన ఈ మాటలతో రచ్చ రాజుకుంది. ఒకప్పుడు మోదీకి శిష్యవారసుడిగా పేరుబడ్డ యోగికి ఇలాంటి పరిస్థితి ఎదురవడం చిత్రమే. అయితే, అది స్వయంకృతమే. ఇటీవలి ఎన్నికల్లో కమలనాథులకు లోక్‌సభలో కావాల్సిన మెజారిటీ రాకపోవడానికి ప్రధాన కారణం – యూపీ నిరాశపరచడమే అన్నది బహిరంగ రహస్యం. 2019లో రాష్ట్రంలోని 80 సీట్లకు గాను 62 గెల్చుకున్న ఆ పార్టీ ఈసారి 33కే పరిమితమైంది. ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ – కాంగ్రెస్ కూటమి 43 గెలిచి దూసుకొచ్చింది. చివరకు రామమందిరం నిర్మించామంటూ ఊరూవాడా గొప్పలు చెప్పుకున్నా, అయోధ్య నెలకొన్న ఫైజాబాద్‌లోనూ బీజేపీ ఓడిపోయింది. మోదీ సైతం వారణాసిలో గతంలో 4.79 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గితే, ఈసారి 1.52 లక్షల ఓట్ల తేడాతోనే బయటపడ్డారు. ఇవన్నీ యోగి ప్రతిష్ఠను దెబ్బతీసినవే. ఇప్పటి దాకా సాగిన ఆయన ఒంటెద్దుపోకడను ఇరుకునపెట్టినవే.

చివరకు మిత్రపక్షాల గొంతులు సైతం పైకి లేస్తున్నాయి. 'బుల్‌డోజర్లు ప్రయోగిస్తే ఓట్లెలా వస్తాయి? ఉద్యోగ నియామకాల్లో ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల పట్ల దుర్విచక్షణ చూపడం పెద్ద తప్పు! అసలు మొన్న లోక్‌సభ ఎన్నికల్లో మాకు బీజేపీ నుంచి సహకారం లభించనే లేదు' – ఇలా యూపీలో మిత్రపక్ష నేతలే యోగి సర్కార్‌ను తప్పు పడుతుండడం గమనార్హం. మొత్తం మీద సొంత గూటిలో సమస్యలు పెరుగుతున్నాయనేది వాస్తవం. రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా చేయి దాటక ముందే బీజేపీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకొని, కీలక నిర్ణయం తీసుకోవాలంటూ సాక్షాత్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలే బాహాటంగా అంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పదవి నుంచి యోగిని పక్కకు తప్పించవచ్చనే చర్చ సైతం రాజకీయ వర్గాల్లో మొదలైంది. దేశంలోనే అత్యంత పాపులర్ సీఎంగా నిన్న మొన్నటి సర్వేల్లోనూ ఉన్న మనిషిని పక్కనపెట్టడం పార్టీకి అంత తేలిక కాదు. ఏమంత తెలివైన పనీ కాదు. కాకపోతే, ఇది కచ్చితంగా బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం. కీలక మంత్రులతో సహా అంతా గత హయాంకు కొనసాగింపు కేంద్ర సర్కారనే భావన కల్పిస్తున్న ఆ పార్టీ... ఎన్నికల్లో ఎదురుదెబ్బకు కారణాలు లోతుగా అధ్యయనం చేసుకోకపోతే చిక్కే!

పెన్షన్ అంశం, పార్టీ కార్యకర్తల్లో పెరిగిన అసంతృప్తి, గత ఆరేళ్ళలో పదే పదే పేపర్ లీకులు, ప్రభుత్వోద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ, అగ్నివీర్ల అంశం, రాజ్‌పుత్‌ల ఆగ్రహం, రాజ్యాంగాన్ని మార్చేస్తామన్న పార్టీ నేతల ప్రకటనలు – ఇలా అనేకం యూపీలో ఎదురుగాలి వీచేలా చేశాయని పార్టీ అంతర్గత నివేదిక. మరోపక్క కరడుగట్టిన బీజేపీ భక్త ఓటరు గణం చెక్కు చెదరకున్నా – దేశాభివృద్ధికి మోదీయే దిక్కని భావించినవారు, లబ్ధిదారులు, మోదీ ఆకర్షితుల్లో తరుగుదల కాషాయధ్వజుల జోరుకు పగ్గాలు వేసినట్టు స్వతంత్ర విశ్లేషకుల మాట. ఎవరి మాట ఏదైనా అంతా సవ్యంగా ఉంది, అసలేమీ జరగలేదన్నట్టుగా ఉష్ట్రపక్షిలా వ్యవహరిస్తే నష్టం బీజేపీకే! ఎన్నికల్లో తలబొప్పి కట్టిందని ముందు గుర్తించాలి. నిత్యం కార్యకర్తలతో చర్చిస్తూ, క్షేత్రస్థాయి స్పందన తీసుకుంటూ, నిరంతరం ఎన్నికల ధోరణిలోనే ఉంటుందని పేరున్న బీజేపీ మళ్ళీ మూలాల్లోకి వెళ్ళాలి. మోదీ నామమే తారకమంత్రమన్న మూర్ఖత్వం మాని, కళ్ళు తెరిచి ప్రజాక్షేత్రంలోని చేదు నిజాలను విశ్లేషించాలి. పార్టీలో పరస్పర నిందారోపణల్ని మించిన మార్గమేదో అన్వేషించాలి.

ముందు రోగం కనిపెడితేనే తర్వాత సరైన మందు కొనిపెట్టగలరు. బీజేపీ అధిష్ఠానం తొందర పడాల్సింది అందుకే. ఇటీవల దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 10 స్థానాల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమే గెలిచింది. అధికారపక్ష వ్యతిరేకత కనిపించడమే కాక, బీజేపీ ఓటు షేర్ తగ్గడం ఆ పార్టీకి పారాహుషార్ హెచ్చరికే. యూపీలో తాజా విజయాలతో సమాజ్‌వాదీ – కాంగ్రెస్ కూటమి సమధికోత్సాహంతో అడుగులు వేస్తోంది. ఇప్పుడు గనక బీజేపీ దిద్దుబాటు చర్యలతో, సొంత ఇంటిని చక్కబెట్టుకోకుంటే, ప్రతిపక్షం కీలకమైన యూపీలో మరింత విస్తరిస్తుంది. అప్పుడిక కమలనాథులు ఏం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.త్రయోదశి సా.6.01 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మూల రా.2.31 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.16 నుండి 11.54 వరకు, తదుపరి రా.12.53 నుండి 2.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59, నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** రా.8.01 నుండి 9.36 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

గడ్డినే కాదు, జీవులనూ చంపుతుంది!

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

ఒక ఉత్పత్తి గురించి అనేక దేశాలు గోస పడుతున్నాయి. అయినా దాని మీద శాశ్వత నిషేధం విధించడం లేదు. కలుపు సంహారక సమ్మేళనం గ్లైఫోసేట్ (గడ్డి మందు) వల్ల పర్యావరణం మీద, వ్యవసాయ కార్మికుల మీద, గ్రామీణ ప్రజల ఆరోగ్యం మీద దుష్ప్రభావాలు పెరుగుతున్నాయి. నేరుగా క్యాన్సర్ కలుగజేసే దీన్ని ఆహార పంటల క్షేత్రాలలో వినియోగించడం చాలా ప్రమాదకరం. దీన్ని పిచికారీ చేసిన పంట వ్యర్థాలను తిని గొర్రెలు, మేకలు, ఇతర పశువులు కూడా చనిపోయాయి. అయినా దీన్ని వినియోగం ఆపడం, ఉత్పత్తిని నిలిపివేయడం, అడ్డుకోవడం సవాలుతో కూడుకున్నదని స్పష్టమవుతోంది. వివిధ దేశాల రాజకీయ సంకల్పం పెద్ద కంపెనీల గణనీయమైన లాబీయింగ్ శక్తి ముందు దిగదుడుపే అని అర్థమవుతోంది.

2015లో గ్లైఫోసేట్ నిషేధాన్ని ఆమోదించి, అమలుచేసిన మొట్టమొదటి దేశం శ్రీలంక. కానీ ఈ నిషేధాన్ని 2018లో పాక్షికంగా మార్చవలసి వచ్చింది. 2022లో పూర్తిగా ఉపసంహరించబడింది. 2014లో ఒక స్థానిక శాస్త్రవేత్త గ్లైఫోసేట్ వలన 'క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఆఫ్ అన్నోన్ ఆరిజిన్' వస్తున్నదని పరిశోధించి చెప్పిన దరిమిలా శ్రీలంక నాయకత్వం దీని మీద దృష్టి పెట్టింది. 2015లో ఎన్నికైన మైత్రిపాల సిరిసేన ప్రభుత్వం ఈ నిషేధాన్ని ఆమోదించింది. ఈ నిషేధం అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో బౌద్ధ సన్యాసి రథనా థెరో మద్దతు కొరకు ఇచ్చిన వాగ్దానం. కానీ తర్వాత నిషేధంలో వెనక్కి తగ్గడం, తరువాత పూర్తిగా ఎత్తి వేయడం జరిగింది. ఈ లాబీయింగ్ వెనుక అమెరికా ప్రభుత్వం, బేయర్ కంపెనీ (అప్పట్లో మోన్‌శాంటో) ఉన్నదని అందరికీ తెలుసు.

డిసెంబర్ 2023లో, నెలల తరబడి తర్జనభర్జనల తర్వాత, ఐరోపా కూటమి దేశాలలో కొన్ని నిషేధించాలని కోరినా, దీని లైసెన్స్‌ను పునరుద్ధరించాలని యూరోపియన్ కమిషన్ నిర్ణయించింది. మరో పదేళ్లపాటు వినియోగాన్ని ఆమోదించింది. ఆస్ట్రియా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బెల్జియం, లక్సెంబర్గ్, జర్మనీ వంటి కొన్ని యూరప్ దేశాలు కొన్ని ప్రాంతాల్లో, ఇళ్లల్లో దీని వాడకంపై పాక్షిక నిషేధాలనో, పరిమితులనో విధిస్తున్నాయి.

గ్లైఫోసేట్ ఒక రసాయన ఉత్పత్తి. ఇదివరకు మోన్‌శాంటో, తరువాత దానిని కొన్న బేయర్ కంపెనీ అంతర్జాతీయ గుత్తాధిపత్య కంపెనీ. చాలా శక్తిమంతమైన ఐరోపా కూటమి కూడా ఈ కంపెనీ ఒత్తిడికి తలొగ్గి జీవరాశికి, మానవాళికి ప్రమాదకరంగా పరిణమించిన గ్లైఫో సేట్ వాడకం ఆపలేకపోయింది. సాంకేతిక, మార్కెట్, నియంత్రణ వ్యవస్థల మధ్య ఏర్పడిన ఒక సంక్లిష్టమైన పరస్పర అవగాహన వల్ల ఆధునిక వ్యవసాయంలో గ్లైఫోసేట్‌కు ప్రోత్సాహం లభించిందని ఒక అధ్యయనం చెబుతున్నది. ఇందులో 4 కీలక విషయాలు ఇమిడి ఉన్నాయి. (1) జన్యుమార్పు పంటల మీద ఉపయోగం కోసం గ్లైఫోసేట్ వినియోగం; (2) కొత్త వ్యవసాయ వినియోగాలను ప్రోత్సహించడం ద్వార ప్రపంచవ్యాప్త సాధారణ గ్లైఫోసేట్ మార్కెట్ పెరుగుదల; (3) గ్లైఫోసేట్ వాడకంతో మిళితం చేసే డిజిటల్ వ్యవసాయం, జీనోమ్ ఎడిటింగ్ వంటి కొత్త సాంకేతిక ప్రోత్సాహం; (4) కార్పొరేట్ మార్కెట్ శక్తి పెరుగుదల వల్ల వ్యవసాయ పరిశోధన కార్యక్రమాల్లో ప్రభుత్వ పెట్టుబడి తగ్గి హెర్బిసైడ్ రహిత కలుపు నియంత్రణ మీద పరిశోధనలు ఆగిపోవడం.

మన దేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ప్రభుత్వాలు ఆ మధ్య వరుసగా ఒక మూడు సంవత్సరాలు దీనిమీద 60 రోజులు పాటు నిషేధం ప్రకటించాయి. ఈ తాత్కాలిక నిషేధం ఉద్దేశ్యం చట్టవిరుద్ధమైన, హెర్బిసైడ్-తట్టుకునే బీటీ పత్తి విత్తనాలను ఉపయోగించకుండా అరికట్టడానికి అని చెప్పారు. ఈ తాత్కాలిక



నిషేధం కూడా కాగితాలకే పరిమితం అయ్యింది. ఆ పరిమిత నిషేధ కాలంలో కూడా బహిరంగంగానే అమ్మకాలు జరిగాయి. పురుగు మందుల నియంత్రణ చట్టం, 1968 ప్రకారం రాష్ట్రాలు విష రసాయనాలను 60 రోజుల వరకు మాత్రమే నిషేధించవచ్చు. కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే శాశ్వతంగా నిషేధించే అధికారం ఉంది. వివిధ రాష్ట్రాలు కోరినా కేంద్రం నిషేధం గురించి స్పందించడం లేదు. కేరళ, సిక్కిం రాష్ట్రాలు మాత్రం కొన్ని అధికరణలను ఉపయోగించి శాశ్వత నిషేధం విధించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కేంద్రానికి రాసి మిన్నకున్నాయి. ఇతర విషయాలలో అధ్యయనాలకు బృందాలను పంపే రాష్ట్రాలు మరి కేరళ, సిక్కిం ఎట్లా సాధించాయో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

2019–21 మధ్య స్వదేశీ జాగరణ్ మంచ్ అవగాహన కార్యక్రమాలు చేపట్టి, గ్లైఫోసేట్‌ను పూర్తిగా నిషేధించాలని కోరుతూ రెండు లక్షల మంది సంతకాలతో కూడిన మెమోరాండంను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రికి సమర్పించింది. స్వదేశీ జాగరణ్ మంచ్ ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ. అనేక విషయాలలో ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆరోపణ ఎదురుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, గ్లైఫోసేట్ మీద మాత్రం ఆ సంస్థ కోరిన నిషేధం విధించలేకపోతున్నది. రాజకీయ ఒత్తిడులలో ఉండే అధికార క్రమం ఇక్కడ స్పష్టంగా కనపడుతున్నది.

అక్టోబర్ 2020లో, పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ ఇండియా మరియు పాన్ ఆసియా పసిఫిక్ సంయుక్తంగా 'స్టేట్ ఆఫ్ గ్లైఫోసేట్ యూజ్ ఇన్ ఇండియా' నివేదికను విడుదల చేశాయి. దీని వాడకం విచ్చలవిడిగా ఉందని నివేదించాయి. దీని వల్ల పర్యావరణం మీద, వ్యవసాయ కార్మికుల మీద, గ్రామీణ ప్రజల ఆరోగ్యం మీద దుష్ప్రభావాలు పెరుగుతున్నాయని పేర్కొంది. నేరుగా క్యాన్సర్ కలుగజేసే దీన్ని ఆహార పంటల క్షేత్రాలలో వినియోగించడం ప్రమాదకరం.

ప్రజల నుంచి, సంస్థల నుంచి వచ్చిన ఒత్తిడుల నేపథ్యంలో నిషేధించకుండా కేంద్ర ప్రభుత్వం 2020లో కొన్ని ఆంక్షలు ప్రకటించింది. దీని ప్రకారం పెస్ట్ కంట్రోల్ ఆపరేటర్ల ద్వారా తప్ప ఏ వ్యక్తి కూడా దీన్ని పిచికారీ చేయరాదు. అంటే సాధారణ రైతులు ఉపయోగించరాదు. కేవలం రసాయన పిచికారి చేసే సంస్థల ద్వారానే ఉపయోగించాలని కొత్త నిబంధన తెచ్చింది. తదుపరి కంపెనీ నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి ఈ ఆంక్షలను సవరించారు. శిక్షణ పొందిన వారు ఎవరైనా ఉపయోగించవచ్చు అని చెప్పారు. ఆ శిక్షణ ఇవ్వడానికి ఒక కేంద్ర పరిశోధన సంస్థకు అప్పజెప్పితే వారు కొన్ని ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి ఒక సర్టిఫికెట్ ఇస్తున్నారు.

రైతులలో పూర్తి అవగాహన లేకపోవడం, పురుగుమందు / విత్తన కంపెనీల మార్కెట్ మాయాజాలం, కొరవడిన ప్రభుత్వ నియంత్రణ వంటి కారణాల వల్ల, రైతులు దీన్ని వాడుతున్నారు. రైతులు తాము కొన్నవి గ్లైఫోసేట్ తట్టుకునే విత్తనాలు అనుకుని, కాయ కాసిన తరుణంలో, గడ్డిని తొలగించటానికి దీన్ని వాడటం వల్ల, మొత్తం పంట మాడిపోయి నష్టపోయిన ఉదంతాలు ఉన్నాయి. దీని వాడకం మీద ఆంక్షలు ఉండడంతో, ప్రభుత్వం నుంచి పరిహారం కోరే అవకాశం కూడా లేకుండా పోయింది. గ్లైఫోసేట్ పిచికారీ చేసిన గడ్డి అని తెలియక దాన్ని నోట్లో పెట్టుకున్న ఒక అమ్మాయి చనిపోయింది. అనేక విధాలుగా గ్రామాలలో అమాయకులు ఈ విష రసాయనాల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారు. పంట ఎండపెట్టడానికి ఓపిక లేని రైతులు పంట కోతకొచ్చే సమయానికి దీన్ని వాడుతున్నారు. దాని వల్ల మొక్క మాడుతుంది, చచ్చిపోతుంది. అట్లాంటి పంట వ్యర్థాలు విషపూరితం అవుతాయి. దీన్ని పిచికారీ చేసిన పంట వ్యర్థాల్నితిని గొర్రెలు, మేకలు, ఇతర పశువులు కూడా చనిపోయాయి.

క్యాన్సర్ ప్రమాదాల గురించి వినియోగదారులను హెచ్చరించడంలో కంపెనీ విఫలమైందని పేర్కొంటూ మోన్‌శాంటో (ఇప్పుడు బేయర్ యాజమాన్యంలో ఉంది)తో సహా గ్లైఫోసేట్‌తో సంబంధం ఉన్న రౌండప్ తయారీదారులపై అమెరికాలో వేలకొద్దీ కోర్టు వ్యాజ్యాలు దాఖలైనాయి. 2019 నాటికి ఇవి 42,700. ఇతర దేశంలో గ్లైఫోసేట్ మీద ఈగ వాలితే అమెరికా ప్రభుత్వం వాలిపోతుంది. అదే అమెరికాలో వేల కొద్ది వ్యాజ్యాలను ఆ కంపెనీ ఎదుర్కొంటున్నది.

మానవాళికి, జీవకోటికి ప్రమాదకరంగా పరిణమించిన ఈ వ్యాపార వస్తువును నిషేధించలేని పాలనా వ్యవస్థలను, అందులోని లోపాలను అధ్యయనం చేయాలి. ఒక వ్యాపార వస్తువుని నియంత్రించలేని దేశాధినేతల బలహీనతలు ఇక్కడే తేలిపోతున్నవి. ప్రజారోగ్యాన్ని దెబ్బ తీస్తూ, పర్యావరణానికి దీర్ఘకాల హాని చేసే రసాయనాల నియంత్రణ మీద ఒక వైపు అంతర్జాతీయ చర్చలు జరుగుతుంటే మన దేశంలో మాత్రం ఏ చర్చా లేదు. ఇది మారాలి. ఈ పరిస్థితి మారాలంటే మన రాజకీయం మారాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



షూటింగులకు వాడుతున్నారా?



దట్టమైన పర్వత ద్రోణుల్లోంచి కూడా చైనా సైనిక డ్రోన్లు సిమెంట్ సంచులను ముప్పై సెకన్ల లోపే మోసుకెళ్తున్నాయి. మరి ఇండియన్ డ్రోన్లు ఏం చేస్తున్నట్టు?

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

స్వేచ్ఛకు అడ్డంకి



పొరబడొద్దు. ఒకవేళ ఎన్నికైతే, ట్రంప్ రెండో హయాంలో దారుణమైన ప్రాజెక్ట్ 2025 పథకాన్ని అమలు చేయడంలో జె.డి. వాన్స్ సహకరిస్తారు. ఆ ప్రాజెక్ట్ సంతాన నిరోధకాలను నియంత్రిస్తుంది. జాతీయస్థాయిలో అబార్షన్లను నిషేధిస్తుంది. మేము వారిని ఆపుతాం.

– కమలా హ్యారిస్, అమెరికా ఉపాధ్యక్షురాలు

కన్నడిగులదే కర్ణాటక



కర్ణాటక ఉద్యోగాలు కన్నడిగులకే అనేదానికి నా పూర్తి మద్దతు. బెంగళూరులో ఈ హిందీవాళ్లతో అలసిపోయాను. నా రాష్ట్రంలోనే నేను పరాయివాడిని అనిపిస్తోంది. వ్యాపారం పేరుతో మనం మన సంస్కృతి కోల్పోయాం. ఆటోవాళ్ల నుంచి స్విగ్గీవాళ్ల దాకా అందరూ హిందీలోనే మాట్లాడుతారు. జర్మనీలో ఉద్యోగాలకు జనాలు జర్మన్ పరీక్ష రాస్తున్నప్పుడు, కర్ణాటకలో కూడా దాన్ని అమలుచేస్తే తప్పేమిటి?

– దర్శన్, కన్నడిగ

అందరూ అంతేనా?



నా జీవితంలో పెద్ద నిరాశ ఏమిటంటే, ఆఖరికి సోకాల్డ్ ప్రగతిశీల (లెఫ్టిస్టులు) మనుషులు కూడా అవే అంశాలను విలువైనవిగా పరిగణించడం: ఒక పెద్ద పేరున్న సంస్థలో పనిచేయడం, నెట్‌వర్క్ ఉండటం, మీరు అమ్మాయైతే సంప్రదాయ ప్రమాణాల్లో ఆకర్షణీయంగా ఉండటం.

– భారతి, పరిశోధకురాలు

తుర్కియే దారుణాలు



ఇరాక్ భూభాగాల మీద తుర్కియే ఆకస్మిక దాడులు జరుగుతున్నాయి. ప్రతిరోజూ తుర్కిష్ సైనిక కదలికలు. కుర్దు, అస్సీరియన్ గ్రామాల మీద దాడుల లైవ్ ఫుటేజ్ చూస్తున్నాం. అమాయక పౌరులు తమ ఇళ్ల నుంచి పారిపోవాల్సి వస్తోంది. ఈ కొత్త దాడులు మొదలైనప్పటి నుంచీ 602 గ్రామాలు భయంలో ఉన్నాయి.

– షెనాజ్ ఇబ్రహీమ్ అహ్మద్, ఇరాక్ తొలి మహిళ

కాలుష్య పన్ను



సరిగ్గా అమలుచేస్తే, కార్బన్ డై ఆక్సైడ్ పన్ను అనేది స్థిరంగా గాలిలో పెరుగుతున్న సీఓ2 స్థాయిలను మార్చగలదు. మనం దేనికైనా పన్ను విధిస్తున్నప్పుడు మంచివాటి కంటే చెడ్డవాటి మీద వేయాలి. కూరగాయలు, పళ్ల కంటే మద్యం, సిగరెట్ల మీద విధించినట్టుగా! ఐదు, పదేళ్లలోనే వాతావరణ ఘోర విపత్తు పొంచివున్నదనే వారితో నేను విభేదిస్తాను గానీ దీర్ఘకాలిక నష్టం ఉందని అంగీకరిస్తాను.

– ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

అర్హత లేదా?



నాకు 46 ఏళ్లు. ఏ రాష్ట్రంలోనూ 15 కంటే ఎక్కువ ఏళ్లు ఉండలేదు. మా నాన్న ఇండియన్ నేవీలో పని చేశారు. దేశమంతా బదిలీ అయ్యారు. ఆయన పిల్లలు కర్ణాటకలో ఉద్యోగాలకు అర్హులు కారా? నేను కంపెనీలను ఏర్పాటుచేశాను. దేశవ్యాప్తంగా పాతిక వేలకు పైగా ఉద్యోగాలు కల్పించాను. నా పిల్లలు వారి సొంత నగరం (బెంగళూరు)లో ఉద్యోగాలకు అర్హులు కారా? సిగ్గుచేటు!

– సమీర్ నిగమ్, 'ఫోన్ పే' వ్యవస్థాపకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గని మరణాలు ఇంకెంత కాలం?

బొగ్గుబావుల్లో చావుకేక ఇప్పట్లో ఆగేలా లేదు. 2020వ సంవత్సరం జనవరి నుంచి 2023 డిసెంబర్ నాటికి సింగరేణిలో మొత్తం 24 ప్రమాదాలు జరగగా నాలుగేండ్లలో 35 మంది కార్మికులు మరణించారు. సీరియస్ ప్రమాదాలు 376 నమోదు కాగా 388 మంది గాయపడ్డారు. 2024 జనవరి నుంచి ఈ నెల అంటే జులై 17 వరకు జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మరణించారు. మొత్తం నాలుగున్నర ఏండ్లలో 40 మంది మరణించారు. నల్ల బంగారు నేలలో గని ప్రమాదం జరిగిందంటే మొత్తం ఆ రోజు, ఆ షిఫ్ట్‌లో డ్యూటీలో ఉన్న కార్మిక కుటుంబాలు కలవరపడిపోతాయి.

సింగరేణి పుట్టిన కాడి నుంచి అన్నీ సమస్యలే! గతంలో సింగరేణి పుట్టిన ప్రారంభంలో మొహర్రం నాడే సింగరేణిలో అతి పెద్ద ప్రమాదం జరిగిన దాఖలా ఉంది. ఈ నెల 17న జీడీకే 2, ఓపెన్ కాస్ట్ గనిలో జరిగిన ప్రమాదంలో ఒక టెక్నీషియన్, మజ్దూర్ కూడా మరణించినరోజు మొహర్రం కావడం యాదృచ్ఛికమే!

ఆ రోజు సింగరేణిలో జీతంతో కూడిన సెలవు దినం అయినప్పటికీ, ఓసీ పని చేస్తున్న కారణంగా మృతులూ, గాయపడ్డ మరో ఇద్దరూ విధులు నిర్వహిస్తున్నారు. ఇది కేవలం ముందస్తు నిఘా, రక్షణ చర్యలు తీసుకోని కారణంగా జరిగిందే! ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. ఈ ఏడాది ఒక భూగర్భ గనిలో, స్టోర్స్, ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇలా అయిదుగురు కార్మికులు ప్రమాదాల్లో మరణించారు. గత పదేండ్లలో సింగరేణిలో ప్రతి నెలా జరగాల్సిన సేఫ్టీ కమిటీ సమావేశాలు నిబంధనల ప్రకారం జరుగలేదు. ఏదో మూడు, నాలుగు సార్లు జరిపి మమ అనిపించారు. గనుల మీద యాక్సిడెంట్ రిపోర్ట్‌లు అధికారులు రాయాలి కానీ సాధారణంగా వారు రాయరు. 'ప్రైవేట్‌లో చూపించుకోండి, మస్టర్ ఇస్తాం...' లాంటి మాటలతో అధికారులు రిపోర్ట్ రాయకుండా తప్పించుకుంటారు. ఇందుకు కారణం తమకు రిమార్క్ వస్తుందనే భయం. ఈ విషయం సింగరేణి డైరెక్టర్స్‌కు కూడ తెలిసినా మౌనం వహిస్తారు. గత మూడేండ్లుగా సేఫ్టీ మీద సీఎండీ స్థాయిలో జరిగే సమావేశాలను నిర్వహించినవారు లేరు. ఇవాళ (జూలై 19) సీఎండీ స్థాయిలో, యూనియన్స్ కూడా పాల్గొనే సేఫ్టీ ట్రయిపార్టీయేట్ సమావేశం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరుగుతోంది.

ప్రమాదం తరువాత పరామర్శలు, సంతాపాలు, ఉపాధి, పరిహారాలు సరే... మరో ప్రమాదం జరిగి ఎవరూ ఊపిరి కోల్పోయే పరిస్థితి రాదని గ్యారంటీ ఇవ్వగలదా యాజమాన్యం? ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్ | 99518 65223

నకాశీ కళను కాపాడుకోవాలి!

భారత దేశంలో పేరున్న చిత్రకళా రీతుల్లో 'నకాశీ' ఒకటి. ప్రకృతి సహజమైన రంగులతో సంప్రదాయ కళాకారులు గానం చేసే కథలను ప్రతిబింబించే చిత్రాలు ఉన్న పటాలూ, పొడవైన వస్త్రపు చుట్టలు (స్క్రోల్స్)గా నకాశీ పెయింటింగ్స్‌ను చెప్పవచ్చు. ఈ పెయింటింగ్స్‌ను ఇప్పుడు 'చేర్యాల పెయింటింగ్స్'గా పిలుస్తున్నారు. 1942లో ఒకరిద్దరు కళాకారులు చేర్యాలకు వలస వచ్చారు. అప్పటి నుంచి ఆ కుటుంబాలు పెరిగి అనేకమంది ఈ చిత్రాలపై జీవనం సాగిస్తున్నారు. అందుకే చేర్యాల ఈ పెయింటింగ్స్‌కు ప్రసిద్ధి చెందింది.

నకాశీ కళలో సహజసిద్ధ రంగులకే పెద్దపీట. మొదట ఖాదీ కాన్వాస్‌ను పెయింటింగ్ కోసం సిద్ధం చేసుకుంటారు. రంగురాళ్లను కొను గోలు చేసి వాటిని నూరుకొంటారు. అలాగే తిరుమని చెట్ల నుంచి తీసిన బంకను నూరి నీళ్లు కలిపి సిద్ధం చేసుకుంటారు. ఈ రెంటిని కొంచెం కొంచెంగా కలిపి వస్త్రంపై గీసుకున్న బొమ్మలకు రంగు లద్దుతారు. ఒక్కో పెయింటింగ్ పూర్తి చేయడానికి కొన్ని నెలలు కూడా పట్టవచ్చు.




తెలుగు సమాజంలో ఒక్కో కులంపై ఆధారపడి బతికేందుకు సంప్రదాయ హక్కులు కలిగిన కులాలు కొన్ని ఉన్నాయి. ఆ కులాలను ఆశ్రిత కులాలు అంటారు. ఈ కులాలకు చెందిన వారు తాము ఆధారపడి ఉన్న (ప్రధాన) కులాల చరిత్ర, వంశ చరిత్ర, కుల పురాణాలు వంటి వాటిని తమకు హక్కున్న గ్రామాలకు వెళ్లి చెబుతూ ఉంటారు. కథల్లోని సంఘటనలను చిత్రించిన పటాలను ప్రేక్షకులకు చూపిస్తూ కథలు చెబుతారు. అందుకే ఈ కళాకారులను పటం కథకులనీ పిలుస్తూ ఉంటారు. ఈ కళాకారులకు అద్భుతమైన చిత్రాలతో పటాలను తయారుచేసి ఇచ్చేది నకాశీ కళాకారులే. చిన్న చిన్న పటాలే కాకుండా దాదాపు 20 నుంచి 50 మీటర్ల పొడవు ఉన్న బట్టపై ఒక ఇతివృత్తానికి సంబంధించిన బొమ్మలూ, సంఘటనలనూ ఈ కళాకారులు చిత్రిస్తారు. కాటమరాజు, పెద్దిరాజు లాంటి కథలు చెప్పడానికి బొమ్మలను కూడా తయారు చేస్తారు కొందరు నకాశీ కళాకారులు. గొల్ల కురుమల చరిత్ర చెప్పే మందెచ్చులవారు ఇలా బొమ్మలు చేయించుకుంటారు.

గొల్ల కుర్మ పురాణం, గౌడ పురాణం, పద్మశాలీల మార్కండేయ పురాణం వంటి అనేక కుల పురాణాలు పూర్వం చెప్పేవారు. అయితే కాలక్రమంలో ఆశ్రిత కుల కళాకారులతో కథలు చెప్పించుకునేవారు తగ్గిపోవడంతో వారు వేరే పనులు చేసుకుని బతుకుతున్నారు. దీంతో నకాశీ పెయింటింగ్స్ వేసేవారికి కూడా గిరాకీ తగ్గింది. కొందరు వేరే జీవనాధారం వెతుక్కుంటున్నారు. మిగిలినవారు కుల పురాణాల బొమ్మలకు బదులు ఎక్కువగా రామాయణ, భారత ఇతిహాసాలు, ఆధునిక ఇతివృత్తాలకు సంబంధించిన పెయింటింగ్స్ వేస్తూ ఉపాధి పొందుతున్నారు. కులవృత్తులు, వ్యవసాయం, గ్రామీణ వాతావరణం, గంగిరెద్దులు, హరిదాసులు, బతుకమ్మ, బోనాలు, ముగ్గులు వంటి చిత్రపటాలకు డిమాండ్ ఉంటోంది. ప్రభుత్వం అంతరించి పోతున్న నకాశీ కళను బతికించ డానికి తగిన చర్యలు తీసుకోవాలి.

– ఆలేటి రమేష్
మొబైల్: 99487 98982

ధోతీ, తలగుడ్డంటే... రైతే!



దాక్టర్ యలమంచిలి శివాజీ

బెంగళూరులో ఓ మాల్‌లోని మల్టీప్లెక్స్‌లో కుమారుడితో కలిసి సినిమా చూడటానికి ఫకీరప్ప అనే రైతు ధోతీ కట్టుకొని వచ్చాడని, కాపలాదారు లోనికి రానివ్వకుండా, ప్యాంట్ ధరించి వస్తేనే అనుమతిస్తానని అడ్డుకొన్నాడు. ఆ రైతు కుమారుడు ఈ సంభాషణను వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశాడు. దానిపై రైతు సంఘం నాయకులు వేలాదిమంది ధోతీ ధరించిన రైతులతో, ఆ మాల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దానితో మాల్ యాజమాన్యం ఈ సదరు ఫకీరప్పను ఆహ్వానించి, ధోతితో వచ్చిన ఆయనకు స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించి, క్షమాపణలు చెప్పి ఇకపై ఇటువంటి పొరపాటు చేయబోమని చెంపలేసుకుంది.

పత్రికలలో ఈ వార్త చదివినాక, నాడు రాజ్యసభలో జరిగిన ఓ ఆసక్తికరమైన సన్నివేశం గుర్తుకొచ్చింది. 1990లో నాటి ఉపప్రధాని దేవీలాల్ ఓ ప్రశ్నకు సమాధానం చెబుతున్నారు. 5 నక్షత్రాల హోటళ్లలో రైతులకు రెస్టారెంట్లలో చౌక ధరలకు తినుబండారాలు ఇస్తామని ప్రకటించారు. రైతులను ఎలా గుర్తుపడతారని ప్రశ్నించారు. 'ఏముంది – ధోతీ, తలగుడ్డ ఉంటుంది గదా? వాటి ఆధారంగా గుర్తుపడతారు' అన్నారు.

కర్ణాటకకు చెందిన మార్గరేట్ ఆల్వా కాంగ్రెస్ పక్షాన సీనియర్ సభ్యురాలు – పైగా జీవ్ రాజ్ ఆల్వా కుటుంబ నేపథ్యం – చాలా హుందాగా ఉండేది. 'అది సరే చౌదరీసాబ్ – చౌదరిణీల నెలా గుర్తుపట్టడం (మహిళా రైతులను) అని' ప్రశ్నించారు. దానికి దేవీలాల్ 'వారు ఎటూ వారి భర్తల వెంటే ఉంటారు గదా?' అని సమాధానమిచ్చారు. 'మరి వారు ఒంటరిగా వస్తేనో?' అనే సందేహం వెలిబుచ్చారు. దానికి దేవీలాల్ 'మా పల్లెటూరి మహిళలు, బస్తీల దొరసానులలాగా ఒంటరిగా, భర్త లేకుండా 5 నక్షత్రాల హోటళ్లకు వెళ్లరు' అని గడుసుగా శెలవిచ్చారు. మార్గరేట్ ఆల్వా సిగ్గుతో – ఆమె కుడా సభలో వెల్లివిరిసిన నవ్వులతో పాలుపంచుకొన్నారు.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు | 98663 76735



గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత

సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తం

- తెలంగాణలో మావోయిస్టుల జాడ లేదు
- మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ పడుతోంది. తాజాగా మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని మన్నోలీ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందడం తెలిసిందే. ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్ ఘటనల నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణ వైపు రాకుండా రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు మల్టీజోన్ -1 ఐజీ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేన ప్పటికీ.. మావోయిస్టు ప్రభావిత జిల్లాలున్న గోదావరి పరీవాహక ప్రాంతంలో అధికారులు ఎప్పటికప్పుడు కూంబింగ్ కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు. స్థానిక పోలీసులతో పాటు గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ సిబ్బంది భద్రత విధుల్లో ఉంటున్నారని ఐజీ చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు.

పైప్‌బాంబు పేల్చిన మావోయిస్టులు

- ఇద్దరు జవాన్ల మృతి.. నలుగురికి తీవ్రగాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు మరో ఘాతుకానికి పాల్పడ్డారు. అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్తున్న పోలీసు బలగాలే లక్ష్యంగా పైపుబాంబు పేల్చడంతో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తెల్లవారు జామున చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా మందమరక అటవీ ప్రాంతంలో మావో యిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. రెండు రోజుల పాటు కూంబింగ్ కొనసాగించిన బలగాలు గురువారం తిరిగి వస్తుండగా మావోయిస్టులు మందమరక అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పైపు బాంబును పేల్చడంతో ఎస్టీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ భరత్ లాల్ సాహు, కానిస్టేబుల్ సత్వర్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందారు. కానిస్టేబుళ్లు పురుషోత్తంనాగ్, కోమల్ యాదవ్, సియారాం, సంజయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను తెర్రెంకు, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రాయ్ పూర్‌కు తరలించారు. మృతదేహాలను బీజాపూర్ తీసుకెళ్లారు. ఈ ఘటనతో కూబింగ్‌ను తీవ్రం చేశారు.

ఈ సమస్య ఒకరిది కాదు.. అందరిదీ

- కుక్కల దాడి ఘటనలపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- మనుషులపై దాడికి పరిష్కార మార్గం కావాలి
- నిపుణులను సంప్రదించి నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కుక్కల దాడులు ప్రభుత్వానికి కూడా ఆందోళన కలిగిస్తున్నాయన్న ఏజీ

సాక్షి, హైదరాబాద్: కుక్కల దాడి సమస్య ఒకరిది కాదని, అందరిదీ అని హైకోర్టు అభిప్రాయపడింది. మనుషులపై దాడి చేయకుండా పరిష్కారం కావాలని.. నిపుణులను సంప్రదించి నివేదిక ఇవ్వాలని జంతు జననాల నియంత్రణ కమిటీని ఆదేశించింది. వీధి కుక్కలకు స్టెరిలైజ్ చేసి శిశువులు, వృద్ధులపై దాడులు చేయకుండా నిరోధించలేమని వ్యాఖ్యానించింది. దాడులు చేయకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళిక రూపొందించాలని ఆదేశించింది. జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం, జంతు సంరక్షణ సంస్థలు, జంతు జనన నియంత్రణ కమిటీలు పటిష్ట పరిష్కారం చూపి.. పసికందులపై వీధికుక్కలు దాడి చేసి



చంపేస్తున్న ఘటనలను అరికట్టేందుకు మార్గం వెతకాలని చెప్పింది. జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. బిహార్‌కు చెందిన వీరి కుటుంబం పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను దీనికి జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా జస్టిస్ అలోక్ అరాధే.. హైదరాబాద్‌లో వీధికుక్కల దాడికి గురైన పసికందు వార్త క్లిప్పింగ్‌ను కోర్టు హాల్‌లో చూపించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం చాలా దారుణమన్నారు.

నిబంధనలు అమలు చేస్తున్నాం: ఏజీ

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'అనుమమ్ త్రిపాఠి వర్సెస్ కేంద్రం కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను, జంతు జననాల నియంత్రణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రంలో 3,79,148 కుక్కలున్నాయి. నిబంధనల ప్రకారం కుక్కలకు స్టెరిలైజేషన్, ఇమ్యూనైజేషన్ చేసి మళ్లీ అదే ప్రాంతంలో వదిలేస్తున్నాం. కుక్కల దాడులు ప్రభుత్వానికి కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. జంతు సంక్షేమ సంఘాలతో కూడా చర్చలు జరుపుతాం' అని చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో లక్షల్లో కుక్కలుండగా.. రోజుకు 30–40 కుక్కలకు వ్యాక్సిన్ చేస్తున్నారని న్యాయవాది వేణుమాధవ్ చెప్పారు. ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. కుక్కల దాడుల బారినపడిన బాధితులను ఆదుకోవడానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలించాలని సూచించింది. తదుపరి విచారణను ఈనెల 31కి వాయిదా వేసింది.

పాలమూరు ఎత్తిపోతలకు రూ. 2,500 కోట్లు

- 2024–25 వార్షిక తుది బడ్జెట్‌లో కేటాయింపునకు సర్కారు యోచన

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2024–25 వార్షిక తుది బడ్జెట్‌లో రూ.2,500 కోట్లను కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ పథకం కింద 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం సవరించిన అంచనా వ్యయం రూ.55,086 కోట్లు కాగా.. దీనిలో ఇప్పటిదాకా రూ.31,424.49 కోట్ల విలువైన పనులు జరిగాయి. ప్రాజెక్టు పూర్తికావాలంటే మరో రూ.21,747 కోట్లు అవసరమని తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సాగునీటి ప్రాజెక్టులపై మొత్తం రూ.11 వేల కోట్లను ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కచ్చితంగా 100 శాతం పూర్తవుతాయని అంచనా వేస్తున్న ప్రాజెక్టులకు రూ.240.66 కోట్లను కేటాయిస్తే 47,800 ఎకరాలు సాగులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇక 75 శాతానికి పైగా పూర్తయిన 12 ప్రాజెక్టులకు రూ.7,406 కోట్లను ప్రతిపాదిస్తున్నారు. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా 5.8 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుందని అంచనా. అంతిమంగా ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.7,650 కోట్లను ప్రతిపాదించాలని భావిస్తున్నారు. మైనర్ ఇరిగేషన్‌కు మరో రూ.1,000 కోట్లు, మరో కీలకమైన కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.1,000 కోట్లను కేటాయించాలని నిర్ణయించారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తన నివాసంలో కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించా రు.

త్వరలో తొలిదశ సీట్ల కేటాయింపు

- ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో ముగిసిన ఆప్షన్ల ప్రక్రియ
- 96 వేల మంది విద్యార్థులు.. 62 లక్షల ఆప్షన్లు
- అందుబాటులో ఉన్న కన్వీనర్ కోటా సీట్లు 72,741

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ తొలి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఆప్షన్లకు ఇచ్చిన గడువు ముగిసింది. 96 వేల మంది విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చారు. వివిధ కాలేజీలు, బ్రాంచీలకు మొత్తం 62 లక్షల ఆప్షన్లు అందినట్టు అధికారులు తెలిపారు. వాస్తవానికి ఆప్షన్ల గడువు 15వ తేదీతో ముగిసింది. కొత్తగా 2,640 సీట్లు పెరగడంతో గడువును 18 వరకు పొడిగించారు. 19న సీట్ల కేటాయింపు చేపట్టాల్సి ఉంది. కానీ ఆప్షన్ల గడువు పొడిగించడంతో ఈ తేదీలో మార్పు చోటు చేసుకుంది. అందిన ఆప్షన్లపై సాంకేతిక విద్యా విభాగం కసరత్తు చేస్తోంది. ఒకటి రెండురోజుల్లో సీట్ల కేటాయింపు చేపట్టే వీలుందని సంబంధిత అధికారులు తెలిపారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 11 వేల సీట్లను ప్రైవేటు కాలేజీలు రద్దు చేసుకున్నాయి. వీటి స్థానంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సీట్లు పెంచాలని కోరాయి. కానీ ప్రభుత్వం దీనికి అనుమతించలేదు. ఈ సీట్లపై మొదటి కౌన్సెలింగ్ వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ప్రధాన బ్రాంచీల్లో కన్వీనర్ కోటా కింద అందుబాటులో ఉన్న సీట్లు

బ్రాంచి	సీట్లు
సీఎస్ఈ	22,943
ఐటీ	3,747
సైబర్ సెక్యూరిటీ	1,439
డేటా సైన్స్	6,747
ఏఐఎంఎల్	11,574
ఈసీఈ	10,398
ఈఈఈ	4,332
సివిల్ ఇంజనీరింగ్	3,252
మెకానికల్ ఇంజనీరింగ్	3,099

75 శాతం సీఎస్ఈ ఆప్షన్లే

రాష్ట్రంలోని 173 కాలేజీలు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. ఇప్పటివరకు 1,01,661 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కన్వీనర్ కోటాలో తొలి విడత 72,741 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులోనే పెరిగిన 2,640 సీట్లు కూడా ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన ఆప్షన్లలో 75 శాతం విద్యార్థులు మొదటి ప్రాధాన్యతగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులనే ఎంచుకున్నారు. ఎంసెట్‌లో వందలోపు ర్యాంకులు వచ్చిన విద్యార్థులంతా యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలు, టాప్ 5లో ఉన్న ప్రైవేటు కాలేజీలకు సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ బ్రాంచీలకే తొలి ప్రాధాన్యత ఇచ్చారు. జేఈఈ ద్వారా 'నిట్'లో సీట్లు పొందిన వాళ్లు కూడా టాప్ కాలేజీలకు ఆప్షన్లు ఇచ్చారు. అయితే ఇందులో 80 శాతం విద్యార్థులు సీట్లు వచ్చినా చేరే అవకాశం ఉండదు.

బాధ్యతలు స్వీకరించిన రవిగుప్తా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐపీఎస్ అధికారి రవిగుప్తా గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సీఎం అభినందించారు. పలువురు ఐపీఎస్ అధికారులు, సచివాలయం అధికారులు కూడా రవిగుప్తాకు అభినందనలు తెలిపారు.

మద్యం తాగి వేధిస్తున్నాడని.. చెట్టుకు కట్టేశారు!

- విపరీతమైన దాహంతో వ్యక్తి మరణం

శంషాబాద్: మద్యం తాగి మహిళను వేధిస్తున్న ఓ వ్యక్తి మరణం.. తిరిగి మహిళల మెడకే చుట్టుకున్న ఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. ప్రకాశ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న జ్యోతికుమార్ (30) తాగుడుకు బానిసయ్యాడు. తాగిన మైకంలో తరచూకాలనీలోకి వచ్చి తన ఒంటిపై ఉన్న దుస్తులు విప్పేసి స్థానిక మహిళతో అసభ్యంగా వ్యవహరించేవాడు. సొంత సోదరిపై లైంగిక దాడి కేసులో గతంలో జైలు జీవితం కూడా అనుభవించాడు. తాజాగా బుధవారం అతడు మద్యం మత్తులో కాలనీలో దుస్తులు విప్పి అసభ్యంగా ప్రవరిస్తుండటంతో స్థానికంగా కొందరు మహిళలు అతడిని చెట్టుకు కట్టేశారు. విపరీతమైన దాహంతో అతడు చెట్టుకు కట్టేసి ఉండగానే ఊపిరి వదిలేశాడు. ఈ విషయం పోలీసులకు చేరడంతో దర్యాప్తు చేపట్టారు. పరోక్షంగా అతడి మృతికి చెట్టుకు కట్టేసిన నలుగురు మహిళలే కారణం కావడంతో వారిపై కేసు నమోదు చేశారు.

20న ఇందిరాపార్కు వద్ద నిరుద్యోగ మహాధర్నా

- బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుద్యోగులకు మద్దతుగా శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ మహాధర్నా నిర్వహిస్తున్నట్టు బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ తెలిపారు. గ్రూప్–1 మెయిన్స్ అర్హత 1:100కు పెంపుదల, వెంటనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని, గ్రూప్–2, 3 పోస్టులు పెంచాలని, ఒక పోటీపరీక్షకు మరో పరీక్షకు మధ్యలో వ్యవధి పెంచాలనేవి యువమోర్చా ప్రధాన డిమాండ్లని వివరించారు.



గురువారం బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడిని తెచ్చేందుకు ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

'అనర్హత' ఫిర్యాదుపై 10 రోజుల్లోనే హైకోర్టుకు..

- ఏజీ వాదనలు.. తదుపరి విచారణ 22కు వాయిదా


సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, దానం నాగేందర్‌ను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన 10 రోజుల్లోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై వాదనలు వినిపించేందుకు మరికొంత సమయం కావాలని కోరడంతో న్యాయస్థానం విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ఏజీ సమయం కోరడంపై పిటిషనర్ల న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం వాదనలు వినిపించాలని ఏజీని న్యాయ మూర్తి ఆదేశించారు.

అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య



సాంబరాజు

నర్మెట: అప్పుల బాధతో పురుగు మందుతాగి ఓ యువరైతు ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. జనగామ జిల్లా నర్మెట మండలంలోని కన్నెబోయిన గూడెంలో గురువారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన తోడేటి సాంబరాజు (29) తనకున్న మూడున్నర ఎకరాల భూమిని చదును చేయడంతోపాటు, బోరు వేశాడు. ఇందుకు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటలు సాగు చేయాల్సి ఉండగా, అప్పటికే అప్పులు ఇచ్చిన వాళ్లు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 16న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు సాంబరాజును చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.



బైడెన్‌కు కరోనా

మిల్వాకీ: ఓవైపు అమెరికా అధ్యక్ష ఎన్నికలు శరవేగంగా సమీపిస్తున్నాయి. ప్రత్యర్థి అసలే డొనాల్డ్ ట్రంప్. ఆదినుంచీ దూకుడుగా దూసుకెళ్తున్నారు. అది చాలదన్నట్టు హత్యా యత్నంతో ఆయన గ్రాఫ్ మరింత పెరిగింది. దాన్ని వీరోచితంగా ఎదుర్కొన్న తీరుతో మరింత ఫేవరెట్‌గా మారారు. అలాంటి ట్రంప్‌ను దీటుగా ఎదుర్కోవాల్సిన డెమొక్రాట్లు మాత్రం ఇంకా కాలూ చెయ్యీ కూడదీసుకునే ప్రయత్నంలోనే ఉన్నారు. వయోభారం, మతిమరుపుతో రోజుకో రకంగా తడబడుతున్న అధ్యక్షుడు జో బైడెన్ ఎలా చూసినా ట్రంప్‌కు పోటీ ఇవ్వలేరని దాదాపుగా తేలిపోయింది. అయినా పోటీ నుంచి తప్పుకునేందుకు, మరొకరికి చాన్సిచ్చేందుకు 81 ఏళ్ల బైడెన్ ససేమిరా అంటున్నారు. ఇవి చాలవన్నట్టు బైడెన్ తాజాగా కరోనా బారిన పడ్డారు! దాంతో కీలక దశలో ఎన్నికల ప్రచారానికి విరామం ఇవ్వాల్సి వచ్చింది. ఈ వరుస పరిణామాలతో డెమొక్రాట్లు తల పట్టుకుంటున్నారు. పోటీకి ముందే ఓటమి ఖాయమయ్యేలా ఉందని వాపోతున్నారు. బైడెన్‌ను ఎలాగోలా బుజ్జగించి తప్పించేందుకు చివరి నిమిషం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. లాస్‌వెగాస్‌లో ప్రచార ఈవెంట్‌లో మాట్లాడాల్సి ఉండగా బైడెన్‌కు కరోనా సోకినట్టు తేలింది. దాంతో డెలావెర్ నివాసంలో ఐసోలేషన్‌లో ఉన్నారు.

ట్రంప్‌ను మీరు ఓడించలేరు: పెలోసీ

బైడెన్ తప్పుకోవాలంటున్న డెమొక్రాట్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. పార్టీ కీలక నేత, ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ ఇటీవల బైడెన్‌తో ఫోన్లో మాట్లాడినట్టు సీఎన్ఎన్ వార్తా సంస్థ వెల్లడించింది. ట్రంప్‌ను ఓడించడం ఆయన వల్ల కాదని ఆమె స్పష్టం చేసినట్టు చెప్పుకొచ్చింది. ''పోల్స్ కూడా మీరు గెలవలేరనే చెబుతున్నాయి. కనుక తప్పుకుంటే మంచిది. కాదని మొండికేస్తే మీరు ఓడటమే గాక ప్రతినిధుల సభలో డెమొక్రాట్ల విజయావకాశాలను కూడా చేజేతులా నాశనం చేసిన వారవుతారు'' అంటూ పెలోసీ కుండబద్దలు కొట్టారట.

మా మంచి తాతయ్య!

ట్రంప్‌పై మనవరాలి ప్రశంసల జల్లు



మిల్వాకీ: అది రిపబ్లికన్ల నేషనల్ కాన్ఫరెన్స్. బుధవారం రాత్రి ఓ 17 ఏళ్ల అమ్మాయి వేదికనెక్కింది. తొలి ప్రసంగమే అయినా ఎక్కడా ఆ ఛాయలే లేవు. అనేకానేక అంశాలపై తడుముకోకుండా మాట్లాడి అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. దాంతో హాలంతా పదేపదే చప్పట్లతో మార్మోగింది. పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తనను అబ్బురంగా, ఒకింత గర్వంగా చూసుకుంటూ మురిసిపోయారు. ఆ టీనేజర్ కాయ్ మాడిసన్. ట్రంప్ మనవరాలు. ''తాతా! మీరే నాకు స్ఫూర్తి'' అని కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారామె. 10 మంది మనవలూ, మనవరాళ్లలో కాయ్ అందరికంటే పెద్ద. ట్రంప్ పెద్ద కుమారుడు ట్రంప్ జూనియర్, ఆయన మాజీ భార్య వనెసా కూతురు.

నేనూ ట్రంప్‌నే...

తాతయ్య ఎప్పుడూ దేశం మంచినే కోరతారని కాయ్ చెప్పుకొచ్చారు. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చేందుకు పోరాడుతున్నారన్నారు. ఎందరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొని నిలిచారంటూ ప్రశంసలతో ముంచెత్తారు. ''ఆయనలో బయటికి ప్రపంచానికి పెద్దగా తెలియని కోణాన్ని మీతో పంచుకోదలిచా. తాతగా ఆయనెంతో ప్రేమాస్పదుడు. మేం చిన్నపిల్లలుగా ఉండగా అందరు తాతల్లాగే మమ్మల్నెంతో గారాబం చేసేవారు. మా పేరెంట్స్ చూడకుండా చాక్లెట్లు, కూల్‌డ్రింకులు ఇప్పించేవారు. మేం ఆనందపడితే చూసి మురిసిపోయేవారు. స్కూల్లో ఎలా చదవుతున్నామో ఎప్పటికప్పుడూ తెలుసుకునేవారు. ఓసారి నాకు బాగా మార్కులొస్తే ఆ ప్రోగ్రెస్ కార్డును ప్రింట్ తీయించి మరీ మిత్రులందరికీ చూపించుకుని సంబరపడ్డారు. నాకు తరచూ కాల్ చేసి గోల్ఫ్ ఎలా ఆడుతున్నానో ఆరా తీసేవారు. తన గోల్ఫ్ కథలన్నీ పంచుకునేవారు. 'స్కూల్లో ఉన్నా తాతయ్యా, మాట్లాడలేను' అని చెప్పాల్సి వచ్చేది. ఇద్దరం కలిసి గోల్ఫ్ ఆడేప్పుడు నన్ను ఓడించడానికి ప్రయత్నించేవారు. కానీ పడనిచ్చేదాన్ని కాదు. నేను కూడా ట్రంప్‌నే తాతయ్యా అనేదాన్ని!'' అంటూ గుర్తు చేసుకున్నారు. 2015లో ట్రంప్ తొలిసారి అధ్యక్ష అభ్యర్థి అయినప్పటి నుంచీ కాయ్ ఆయనతో కలిసి పలు కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ప్రధాన ప్రచార వేదికపై కనిపించడం, మాట్లాడటం ఇదే తొలిసారి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారామె. ట్రంప్‌పై కాల్పులు జరిగిన వెంటనే ఆయన పిడికిలెత్తి నినదిస్తున్న ఫొటోను పోస్ట్ చేసి, ''తాతా, ఐ లవ్యూ. పోరాడుతూనే ఉండు!'' అని రాశారు. ఆమెకు సొంత యూట్యూబ్ చానల్ ఉంది.

మా నాన్న సింహసదృశుడు

హత్యా యత్నాన్ని ట్రంప్ గొప్పగా ఎదుర్కొన్నారని ఆయన పెద్ద కుమారుడు ట్రంప్ జూనియర్ (46) అన్నారు. ''రక్తం ధారగా కారుతున్నా రొమ్ము విరిచి నిలబడ్డారు. నేపథ్యంలో జాతీయ పతాకం రెపరెపలాడుతుండగా చెయ్యెత్తి పిడికిలి బిగించి పోరాట నినాదాలు చేశారు. అమెరికా పోరాట స్ఫూర్తికే ప్రతీకగా నిలిచారు. కాబోయే దేశాధ్యక్షుడు సింహసదృశుడని నిరూపించారు'' అంటూ కొనియాడారు. ట్రంప్ భార్య మెలానియా, కూతురు ఇవాంకా, అల్లుడు జరేద్ కుష్నర్ తదితర కుటుంబ సభ్యులు గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) సదస్సులో పాల్గొంటారు.

ట్రంపే అమెరికా ఆశాకిరణం

- అమెరికాకు ఆయన అత్యవసరం
- ట్రంప్ గెలిస్తేనే దేశానికి భవిష్యత్తు
- రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్
- బైడెన్ స్వార్థ నాయకుడంటూ నిప్పులు



మిల్వాకీ: అమెరికా శ్రామిక వర్గం అభ్యున్నతి కోసం చివరి శ్వాస దాకా పాటుపడతానని రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి, ఒహాయో సెనేటర్ జె.డి.వాన్స్ (39) అన్నారు. వారిని అధికార డెమొక్రటిక్ పార్టీ పూర్తిగా విస్మరించిందంటూ మండిపడ్డారు. మిల్వాకీలో జరుగుతున్న రిపబ్లికన్ల నేషనల్ కన్వెన్షన్‌లో వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా బుధవారం లాంఛనంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదాసీదా, నిరుపేద మూలాలున్న తాను ఇంత దూరం వస్తానని కల్లో కూడా ఊహించలేదని చెప్పారు. ''జీవితంలో ఒక్క మెట్టూ ఎదుగుతూ వచ్చా. ఒకరకంగా సగటు అమెరికన్ కలగనే జీవితాన్ని ప్రస్తుతం జీవిస్తున్నా. వారంతా భద్రమైన, సురక్షితమైన జీవితం గడిపేలా చేస్తా. ఏ పార్టీవారన్న దానితో నిమిత్తం లేకుండా ప్రతి అమెరికన్‌కూ నా సర్వస్వం ధారపోస్తా. అమెరికా ఎన్నడూ మరిచిపోలేని ఉపాధ్యక్షుడిగా పేరు తెచ్చుకుంటా'' అంటూ ప్రతిజ్ఞ చేశారు.

ట్రంప్‌పై ప్రశంసల వర్షం

రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై వాన్స్ ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా మధ్యతరగతికి, శ్రామిక వర్గానికి ప్రస్తుతం ఆయనే ఏకైక ఆశాకిరణమన్నారు. ''ట్రంప్ రాజకీయాల్లోకి రాకముందే ప్రపంచంలోకెల్లా అత్యంత విజయవంతమైన వ్యాపారవేత్తల్లో ఒకరు. ఎవరైనా జీవితంలో కలలుగనేవన్నీ ఆయనకు అందుబాటులో ఉన్నాయి. అయినా అమెరికన్లకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని తపించారు. అందుకోసం తిట్లను, వేధింపులను, మరెన్నింటినో సహిస్తున్నారు. నిజానికి ట్రంప్‌కు ఆయనకు రాజకీయాలు అవసరం లేదు. అమెరికా ప్రజలకే ఇప్పుడు ట్రంప్ అత్యవసరం'' అని చెప్పుకొచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ రాజకీయాలను కేవలం కెరీర్‌గా మలచుకున్న స్వార్థపరుడంటూ వాన్స్ దుయ్యబట్టారు. బైడెన్ మతిలేని వాణిజ్య ఒప్పందాలు, విదేశీ యుద్ధాలకు అర్థం లేని మద్దతు తన స్వస్థలం ఒహాయో వంటి నిరుపేద అమెరికా ప్రాంతాలను సర్వనాశనం చేశాయంటూ మండిపడ్డారు. పాలక వర్గ ప్రతినిధిగా బైడెన్ ప్రతి చర్యా అమెరికన్ల ఉద్యోగాలను విదేశాలపరం చేసింది. మన యువతను యుద్ధక్షేత్రాలకు బలిచ్చింది. ఇరాక్ నుంచి అఫ్గానిస్తాన్ దాకా, ఆర్థిక సంక్షోభం నుంచి మాంద్యం, అక్రమ వలసల దాకా ప్రస్తుత పాలక వర్గం అన్ని రంగాల్లోనూ పదేపదే విఫలమవుతూ వస్తోంది. ఈ సమస్యలన్నింటి నుంచి అమెరికాను గట్టెక్కించే చిట్టచివరి, అత్యుత్తమ ఆశాకిరణం ట్రంప్ మాత్రమే. సగటు అమెరికన్‌కు అగ్రతాంబూలమే ఆయన విజన్. ఆయనను పోగొట్టుకుంటే మనకిక భవిష్యత్తుండదు'' అన్నారు. ''దేశానికి తొలి ప్రాధాన్యమిచ్చే ట్రంప్‌నే అమెరికన్లు గెలిపించుకోబోతున్నారు'' అని వాన్స్ జోస్యం చెప్పారు.

దక్షిణాసియా వలసదారులపై వాన్స్ ప్రశంసలు

దక్షిణాసియా నుంచి వచ్చినవారు అమెరికాను సుసంపన్నం చేశారని వాన్స్ అన్నారు. భార్య ఉషా చిలుకూరిపై ప్రశంసల వర్షం కురిపించారు. ''దక్షిణాసియా నుంచి వలస వచ్చినవారి కుమార్తెను నేను పెళ్లాడాను. ఆమెకు పెళ్లి ప్రస్తావన చేసినప్పుడు లా స్కూల్ చదువు కోసం, ఫ్లాట్ కొనుగోలుకు చేసిన 1.2 లక్షల డాలర్ల అప్పులు నా నెత్తిన ఉన్నాయని చెప్పా. అయినా పెళ్లికి అంగీకరించింది'' అని చెప్పారు. తన వ్యక్తిగత, ఆధ్యాత్మిక జీవితంపై భార్య ప్రభావం ఉందన్నారు. తల్లి బెవర్లీని సభకు పరిచయం చేస్తూ ఉద్వేగానికి లోనయ్యారు.

భారతీయ వంటలు నేర్చుకున్నారు: ఉష

వాన్స్ గొప్ప ఉపాధ్యక్షునిగా తనను తాను నిరూపించుకుంటారని భార్య ఉషా చిలుకూరి (38) విశ్వాసం వెలిబుచ్చారు. వాన్స్ ప్రసంగానికి ముందు ఆయనను రిపబ్లికన్ కన్వెన్షన్‌కు ఆమె లాంఛనంగా పరిచయం చేశారు. ''జేడీది నిరుపేద స్థానిక శ్వేతజాతి కుటుంబం. నాదేమో భారతీయ వలసదారుల కుటుంబం. అలాంటి మేం కలుసుకోగలిగామన్నా, ప్రేమలో పడి పెళ్లి చేసుకోగలిగామన్నా కేవలం అమెరికా గొప్పదనమే అందుకు కారణం'' అన్నారు. ''నా భారతీయ జీవన శైలి గురించి జేడీ ఆసక్తిగా అన్ని విషయాలూ తెలుసుకున్నాడు. పక్కా మాంసాహారి అయినా నా శాకాహార జీవనశైలికి అలవాటు పడ్డాడు. మా అమ్మనడిగి భారతీయ వంటకాలు చేయడం నేర్చుకున్నాడు'' అన్నారు.

సెంటర్లవారీగా ఫలితాలు

- అభ్యర్థుల వివరాలు గోప్యంగా ఉంచండి
- నీట్–యూజీపై ఎన్టీఏకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: పరీక్ష కేంద్రాలు, నగరాలవారీగా నీట్–యూజీ, 2024 ఫలితాలను ప్రకటించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. సమగ్ర ఫలితాలను శనివారం మధ్యాహ్నం 12 గంటలలోపు ఎన్టీఏ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని తెలిపింది. నీట్–యూజీ పేపర్ లీక్, నిర్వహణలో అవకతవకలపై దాఖలైన వేర్వేరు పిటిషన్లను గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారించింది. పరీక్షను రద్దుచేసి కొత్తగా నిర్వహించాలని, కోర్టు పర్యవేక్షణలో లీకేజీ ఉదంతంపై దర్యాప్తు జరగాలని వేర్వేరు పిటిషన్లు దాఖలైన విషయం తెల్సిందే. ''పరీక్షలో సెంటర్లవారీగా విద్యార్థులు పొందిన మార్కుల వివరాలను బహిర్గతంచేయండి. గానీ అభ్యర్థుల ఐడెంటిటీ కనిపించకూడదు. గోప్యత పాటించండి. డమ్మీ రోల్ నంబర్లు వేసి అభ్యర్థుల మార్కుల వివరాలు ఇవ్వండి. ప్రశ్నాపత్రం సోషల్‌మీడియా ద్వారా ఎక్కువ మందికి షేర్ అయి, విస్తృతస్థాయిలో పరీక్ష పవిత్రత దెబ్బతింటేనే పరీక్షను మరోమారు నిర్వహించేందుకు అనుమతిస్తాం. అంతేగానీ ఒకటి రెండు కేంద్రాలకు మాత్రమే లీకేజీ పరిమితమైతే రీటెస్ట్‌కు ఒప్పుకోం. కేసు సీబీఐ చేతికి వెళ్లకముందు బిహార్ పోలీసులు సేకరించిన ఆధారాలు, సమర్పించిన ఆర్థికనేరాల విభాగ నివేదికను రేపు సాయంత్రం ఐదింటికల్లా మాకు అందజేయండి' అని కోర్టు ఆదేశించింది. తర్వాత కొందరు పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది నరేందర్‌హూడా వాదించారు. ''పరీక్షను రద్దుచేయాల్సిందే. ఎందుకంటే లీకేజీ వ్యవస్థీకృతంగా జరిగింది. హజారీబాగ్‌లో ప్రశ్నపత్రాలు ఆరురోజులపాటు ఒక ప్రైవేట్ కొరియర్ కంపెనీ అధీనంలో ఉండిపోయాయి. ఎగ్జామ్ సెంటర్‌కు ఒక సాధారణ ఈ–రిక్షాలో తరలించారు. ఈ ఉదంతంలో ఆ సెంటర్ ప్రిన్సిపల్‌ను ఇప్పటికే అరెస్ట్‌చేశారు' అని అన్నారు. అయితే ప్రశ్నపత్రం లీక్ కాలేదని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. 'కేవలం 1.08 లక్షల మంది అడ్మిషన్ పొందే ఈ పరీక్ష కోసం 23.33 లక్షల మంది భవిష్యత్తును పణంగా పెట్టలేం. పట్నా, హజారీబాగ్ సెంటర్లలో మాత్రమే లీకేజీ అయినట్లు ప్రాథమిక సాక్ష్యాలను బట్టి తెలుస్తోంది. గుజరాత్‌లోని గోధ్రాలోనూ ఇది జరిగి ఉండొచ్చు. అయితే దేశవ్యాప్తంగా పేపర్ లీకేజీ అయిందనే బలమైన ఆధారాలు, సాక్ష్యాలు ఉంటేనే రీ టెస్ట్‌కు ఆదేశాలిస్తాం. అయినా పేపర్ లీకేజీకి, పరీక్ష ప్రారంభానికి మధ్య ఎంత సమయం ఉంది? ఎంత మందికి పేపర్ చేరవేశారు? అనేవి కీలక అంశాలపై స్పష్టత రావాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ 22వ తేదీకి వాయిదా వేసింది.



చైనా మాల్‌లో అగ్ని ప్రమాదం..

16 మంది మృతి

బీజింగ్: చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో బుధవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. జిగోంగ్ నగరంలోని హై–టెక్ జోన్‌లో ఉన్న 14 అంతస్తుల భవనంలో నిర్మాణ పనులు జరుగుతుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. భవనంలో చిక్కుకు పోయిన సుమారు 75 మందిని ఫైర్ సిబ్బంది కాపాడారు. మంటల్లో చిక్కుకుని మరో 16 మంది చనిపోయారని అధికారులు తెలిపారు.

పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్

ఇద్దరు మృతి, 34 మందికి గాయాలు

గోండా/న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో చండీగఢ్–దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలో 34 మంది ప్రయాణికులు గాయపడ్డారు. 40 మంది సభ్యుల వైద్య బృందం క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించింది. తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని సహాయక కమిషనర్ జీఎస్ నవీన్ చెప్పారు. గాయపడిన వారిని తరలించేందుకు 15 అంబులెన్సులను ఘటనాస్థలిలో సిద్ధంగా ఉంచారు. గురువారం మధ్యాహ్నం 2.37గంటలకు ఈ రైలు ప్రమాదం సంభవించింది. బోగీలు పట్టాలు తప్పడానికి ముందు ఒక పేలిన శబ్దం విన్నానని లోకోపైలట్ చెప్పారు. చండీగఢ్ నుంచి బుధవారం రాత్రి బయల్దేరిన ఈ రైలు అస్సాంలోని దిబ్రూగఢ్‌కు వెళ్తోంది. మార్గమధ్యంలో రైలు లక్నోకు 150 కిలోమీటర్ల దూరంలోని మోతీగంజ్, ఝిలాహీ రైల్వేస్టేషన్ల మధ్య ప్రాంతంలో పట్టాలు తప్పింది. ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. ''పై బెర్తులో పడుకున్నా. ఒక్కసారిగా పైకి ఎగిరిపడ్డా. తొలుత కల అనుకున్నా. నిద్రమత్తు వదిలి గాయాలపాలయ్యా'' అని బిహార్‌కు చెందిన ప్రయాణికుడు దిలీప్ సింగ్ అన్నారు. కొందరు కిటికీ అద్దాలు పగలగొట్టి ఎలాగోలా బయటపడ్డారు. ఇంకొందరు రైలు పట్టాలపైనా సాయం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఇంకొందరు ట్రాక్‌కు ఇరువైపులా మోకాలిలోతు బురద దాటి మరీ సాయం కోసం పరుగెత్తారు. సహాయక చర్యలను సీనియర్ రైల్వే, స్థానిక అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించాలని అధికారులకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు రైల్వే మంత్రి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు చెరో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి తలో రూ.2.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.50వేలు అందజేస్తారు.



బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల హింస..

మరో 18 మంది మృతి

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్ల కోటాలో సంస్కరణలను కోరుతూ బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న ఆందోళనలు మరింత హింసాత్మకంగా మారాయి. గురువారం దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో మరో 18 మంది చనిపోగా 2,500 మంది వరకు గాయపడ్డారు. దీంతో, ఈ ఆందోళనల మృతుల సంఖ్య 25కు చేరింది. గురువారం ఆందోళనకారులు ఢాకాలో ప్రభుత్వ టీవీ కార్యాలయం ముందుభాగాన్ని ధ్వంసం చేశారు. పార్కు చేసిన వాహనాల్ని తగులబెట్టారు. దీంతో, ఉద్యోగులతోపాటు జర్నలిస్టులు లోపలే చిక్కుబడిపోయారు. ఢాకాతోపాటు ఇతర నగరాల్లో ఉన్న వర్సిటీల్లో వారం రోజులుగా జరుగుతున్న ఆందోళనలు గురువారం కూడా కొనసాగాయి. ఆందోళనకారులు భద్రతా సిబ్బంది, అధికార పార్టీ అనుకూలురతో బాహాబాహీగా తలపడ్డారు. ఘర్షణల్లో 18 మంది చనిపోగా 2,500 మందికి పైగా గాయపడినట్లు డెయిలీ స్టార్ పత్రిక తెలిపింది. ఢాకాలోనే 9 మంది చనిపోయినట్లు పేర్కొంది. దాంతో రైళ్లతో పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు.

దేవుడు, విశ్వరూపి...

ఆ తర్వాతేమిటి?

ఆశకు హద్దేముంది: ఆరెస్సెస్ చీఫ్ భగవత్

మోదీపై చేసిన విమర్శలే: విపక్షాలు

గుమ్లా (జార్ఖండ్): లోక్‌సభ ఎన్నికల అనంతరం బీజేపీపై తరచూ సునిశిత విమర్శలు గుప్పిస్తున్న ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ గురువారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''జీవుడు వికాస క్రమంలో మనిషి లక్షణాలు సంతరించుకుంటాడు. ఆనక అతీత శక్తులున్న సూపర్‌మ్యాన్ కావాలని ఆశపడతాడు. తర్వాత దేవుడు, భగవంతుడు కావాలనుకుంటాడు. ఆ తర్వాత విశ్వరూపి కావాలని ఆశిస్తాడు. దాన్నీ దాటితే? ఆపైన ఏముందో ఎవరికీ తెలియదు. అంతర్గత, బహిర్గత వికాసానికి అంతన్నదే ఉండదు'' అన్నారు. మానవాళి శ్రేయస్సుకు, ప్రపంచాన్ని అందమైన నివాసయోగ్య ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు పాటుపడటమే మన బాధ్యతన్నారు.

మోదీపై ఆరెస్సెస్ అగ్ని క్షిపణి: కాంగ్రెస్

మోహన్ భగవత్ వ్యాఖ్యలు ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించినవేనని కాంగ్రెస్ పేర్కొంది. ''అవి లోక్ కల్యాణ్ మార్గ్ (ఢిల్లీలోని మోదీ అధికారిక నివాసం)పైకి నాగ్‌పూర్ (ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం) ప్రయోగించిన అగ్ని క్షిపణి' అంఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందరిలా తాను తల్లి కడుపు నుంచి పుట్టలేదని చెప్పుకున్న ప్రధానికి ఆరెస్సెస్ తాజా సందేశం విన్పించే ఉంటుందంటూ వాగ్బాణాలు విసిరారు.

భండార్ నుంచి స్ట్రాంగ్ రూంకు

జగన్నాథుని అమూల్య సంపద తరలింపు పూర్తి

పురీ: పురీ జగన్నాథుని ఆలయంలోని అమూల్య వస్తువులు, ఆభరణాల తరలింపు గురువారం పూర్తయింది. రత్న భండార్ లోపలి గదిలో ఉన్న అమూల్య సంపదను ఆలయం ఆవరణలోనే ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలించారు. చెక్క, ఇనుప అల్మారాలు, భోషాణాలు తదితర ఏడింటిలో ఉన్న వీటిని స్ట్రాంగ్ రూంకు మార్చేందుకు ఏడు గంటలు పట్టిందని ఆలయ ప్రధాన అధికారి అరబింద చెప్పారు. అనంతరం రత్న భండార్‌తోపాటు స్ట్రాంగ్ రూంకు కూడా నిబంధనలను అనుసరించి తాళం, సీల్ వేసి తాళం చెవులను కలెక్టర్‌కు అందజేశామన్నారు.

రత్న భండార్ లోపలి భాగంలోని అమూల్య సంపదను తాము పరిశీలించామని సూపర్‌వైజరీ కమిటీ చైర్మన్, ఒరిస్సా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు. రత్న భండార్‌కు అవసరమైన మరమ్మతులను భారత పురావస్తు శాఖ చేపట్టనుందని, ఆ తర్వాతే స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఆభరణాలు, ఇతర వస్తువుల జాబితా తయారీ ప్రక్రియ మొదలవుతుందని పూరీ రాజవంశీకుడు దిబ్య సింఘ దేబ్ వివరించారు. లోపలి చాంబర్ కింద సొరంగం ఉన్నదీ లేదని సర్వేలోనే తేలుతుందన్నారు.

అమూల్య వస్తువులు, నగల తరలింపు ప్రక్రియను వీడియోలో చిత్రించినట్టు పురీ కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వాన్ చెప్పారు. ఆలయం చుట్టుపక్కల భారీ భద్రత ఉంటుందని ఎస్పీ పినాక్ మిశ్రా చెప్పారు. ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పాములు పట్టేవాళ్లు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచుతామన్నారు. రత్నభండార్ లోపల రక్షణగా పాము ఉందన్న వార్తలపై స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సువేందు మాలిక్ స్పందిస్తూ...అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

జాహ్నవిపై అనుచిత వ్యాఖ్యలు..

ఆ పోలీసు తొలగింపు

న్యూయార్క్/సియాటెల్: అమెరికాలోని సియాటెల్‌లో గతేడాది తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి(23) పోలీసు వాహనం ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. ఆమెకు పెద్దగా విలువేమీ లేదనేలా డేనియల్ ఆడెరర్ అనే పోలీసు అధికారి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అవి జాహ్నవి కుటుంబానికి ఎంతో వేదన కలిగించి ఉంటాయని దీనిపై విచారణ చేపట్టిన అధికారి స్యూ రాహర్ అన్నారు. ఆడెరర్ అమానవీయ వైఖరి పోలీసు వృత్తికే కళంకం తెచ్చిపెట్టిందన్నారు. ''ఇలాంటి అధికారిని ఇంకా కొనసాగనీయడం మొత్తం పోలీసు విభాగానికే అవమానకరమవుతుంది. అందుకే ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పేందుకు అతడిని విధుల నుంచి తొలగిస్తున్నాం' అని ప్రకటించారు. కారును వేగంగా నడిపిన మరో అధికారి కెవిన్ డేవ్‌పై నేరారోపణలను నమోదు చేయలేమంటూ కింగ్ కౌంటీ అధికారులు ఈ ఏడాది జనవరిలో స్పష్టం చేశారు. అయితే, ఈ నేరం కింద డేవ్‌కు 5 వేల డాలర్ల జరిమానా విధిస్తూ సియాటెల్ సిటీ అటార్నీ తీర్పు వెలువరించారు.



జస్టిస్ కోటేశ్వర్‌సింగ్, జస్టిస్ మహదేవన్‌తో ప్రమాణం చేయిస్తున్న సీజేఐ

సుప్రీంకోర్టు జడ్జీల ప్రమాణం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.కొటీశ్వర్ సింగ్ సుప్రీంకోర్టు జడ్జీగా ప్రమాణం చేశారు. దీంతో, సుప్రీంకోర్టులో మణిపూర్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మొట్టమొదటి న్యాయమూర్తిగా జస్టిస్ కొటీశ్వర్ సింగ్ రికార్డుల్లోకెక్కారు. మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్. మహదేవన్ కూడా అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీగా ప్రమాణం చేశారు. గురువారం సుప్రీంకోర్టు కాంప్లెక్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ వీరితో ప్రమాణం చేయించారు. వీరిద్దరి రాకతో అత్యున్నత న్యాయస్థానం సీజేఐతో కలిపి మొత్తం 34 మంది జడ్జీలతో ఆగస్ట్ చివరి వరకు పూర్తి స్థాయిలో పనిచేయనుంది.

డిప్యూటీ సీఎంగా ఉదయనిధి!



చెన్నై: తమిళనాట సీఎం స్టాలిన్ వారసుడికి పదోన్నతి లభించనుంది. క్రీడలు, యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను త్వరలోనే ఉప ముఖ్యమంత్రిగా నియమిస్తారని విశ్వసనీయవర్గాల సమాచారం. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కుమారుడైన ఉదయనిధి 2022 డిసెంబరులో మంత్రివర్గంలో చేరారు. చెపాక్–తిరువల్లికేని నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన ఉదయనిధి.. డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు కూడా. డిప్యూటీ సీఎం పదవి కావాలని ఆయన కొంతకాలంగా బలంగా కోరుతున్నారు. ప్రభుత్వంలో తన పరపతిని మరింత పెంచుకోవడంతో పాటు తండ్రి స్టాలిన్‌కు పాలనా వ్యవహారాల్లో చేదోడువాదోడుగా ఉండటానికి ఈ పదోన్నతి ఉపకరిస్తుందని ఆయన భావిస్తున్నారు.

వంద మంది రండి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోండి

అఖిలేశ్ యాదవ్ ఆసక్తికర ఆఫర్



లక్నో: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్‌మౌర్యల మధ్య విభేదాలతో రాష్ట్ర బీజేపీ ప్రభుత్వంలో లుకలుకలు మొదలయ్యాయన్న వార్తల నడుమ సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్ 'ఎక్స్' ఖాతాలో ఆసక్తికర పోస్ట్‌చేశారు. ''వర్షాకాల ఆఫర్ ప్రకటిస్తున్నా. వంద మంది రండి. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోండి'' అని గురువారం ట్వీట్‌చేశారు. అంతర్గత కుమ్ములాటలు పాలనపై ప్రతికూల ప్రభావం చూపి రాష్ట్రాభివృద్ధి కుంటుబడుతుందని అఖిలేశ్ ఆరోపించారు. ''ఎస్పీకి 111 మంది ఎమ్మెల్యేలున్నారు. 100 మంది బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు లభిస్తే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం తేలిక అవుతుందన్నది అఖిలేశ్ పోస్ట్ సారాంశం' అని ఓ ఎస్పీ నేత విశదీకరించారు.

ఉప ఎన్నికల్లోనూ ఉమ్మడిగానే..

యూపీలో కలిసి పోటీ చేయనున్న ఎస్పీ, కాంగ్రెస్



సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీ ఓ పక్క అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతుండగా..మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలోని 10 సీట్లకు జరుగనున్న ఉప ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ అంగీకారానికి వచ్చాయి. పోటీ చేసే స్థానాలపై చర్చించేందుకు వచ్చే వారంలో రెండు పార్టీల కీలక నేతలు భేటీ కానున్నారని యూపీ పీసీసీ చీఫ్ అజయ్ రాయ్ తెలిపారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన ఎస్పీ 37, కాంగ్రెస్ 6 స్థానాలను గెలుచుకుని, బీజేపీకి షాకిచ్చాయి. దాంతో యూపీలో బీజేపీ 33 సీట్లకే పరిమితమైంది. ఇదే ఫార్ములాను మున్ముందూ కొనసాగించాలని ఎస్పీ, కాంగ్రెస్ నిర్ణయించుకున్నాయి.

హరియాణాలో ఆప్ ఒంటరి పోరు

మొత్తం 90 సీట్లలోనూ పోటీ



చండీగఢ్: ఈ ఏడాది చివర్లో హరియాణా అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నిర్ణయించింది. అసెంబ్లీలోని మొత్తం 90 స్థానాల్లోనూ అభ్యర్థులను బరిలో ఉంచుతామని ప్రకటించింది. పూర్తి వివరాలను ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఈ నెల 20న ప్రకటిస్తారని పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. హరియాణాలో పలుమార్లు సొంతంగానే పోటీ చేసిన ఆప్ ఇప్పటివరకు ఖాతా తెరవలేకపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకుంది.

13న నా 'ప్రీమియర్' చూడండి!

ట్రంప్‌పై హత్యాయత్నం మీద దుండగుని పోస్టు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి దుండగుడు థామస్ మాథ్యూ క్రూక్స్ ముందుగానే పథక రచన చేసుకున్నట్టు తేలింది. తన ప్లాన్ గురించి పాపులర్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫాం స్టీమ్‌లో ముందుగానే అతను సంకేతాలిచ్చాడు. ''జూలై 13న నా ప్రీమియర్ ఉంది. అదెలా జరగబోతుందో చూస్తుండండి'' అంటూ రాసుకొచ్చాడు. అయితే ఈ పోస్టు నకిలీదని కూడా చెబుతున్నారు. మరోవైపు ట్రంప్‌పై హత్యా యత్నానికి సీక్రెట్ ఏజెంట్ల వైఫల్యమే కారణమని ఎఫ్‌బీఐ విచారణలో ప్రాథమికంగా తేలిందంటున్నారు. క్రూక్స్‌ను సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు 20 నిమిషాల ముందే గమనించారని పేర్కొన్నట్టు సమాచారం.

కుడిచెవికి బ్యాండేజి.. కొత్త ఫ్యాషన్

ట్రంప్ మద్దతుదారుల్లో నయా ట్రెండ్

వాషింగ్టన్: అమెరికాలో నయా ఫ్యాషన్ పుట్టుకొచ్చింది. అదే కుడిచెవికి బ్యాండేజీ! హత్యా యత్నంలో గాయమైన తన కుడిచెవికి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ బ్యాండేజీ వేసుకున్నారు. మిల్వాకీలో రిపబ్లికన్ జాతీయ కన్వెన్షన్‌కు బ్యాండేజీతోనే హాజరయ్యారు. చావుకు అతిసమీపంగా వెళ్లినా ట్రంప్ ప్రదర్శించిన మొక్కవోని ధైర్యాన్ని ఆయన అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు ఈ బ్యాండేజీ గుర్తు చేస్తోంది. దాంతో మద్దతుదారులు, రిపబ్లికన్ డెలిగేట్లు ట్రంప్‌కు సంఘీభావంగా తమ కుడిచెవికి ఇలా తెల్లని బ్యాండేజీ ధరిస్తున్నారు!





రోడ్డు ప్రమాదాలపై 'ఆప్ట్'

రోడ్డు ప్రమాదాల నివారణపై రాచకొండ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యల కోసం యాక్సిడెంట్ అనాలసిస్ ప్రివెన్షన్ టీం (ఆప్ట్) ఏర్పాటు చేయనున్నారు. -8లో



నెలకు రూ.120 కోట్లు..

కూరగాయలు, పప్పు దినుసుల ధరల పెరుగుదలతో నగర వాసులు బెంబేలెత్తుతున్నారు. నెలకు దాదాపు రూ.120 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని అంచనా. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/24.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 30, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.











పరీక్ష రాసి వస్తా.. పైలం బిడ్డా!

నగరంలో గురువారం డీఎస్సీ పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులతో ఆయా కేంద్రాలు సందడిగా కనిపించాయి. కొందరు మహిళలు తమ చిన్నారులను వెంట తీసుకు వచ్చారు. బయట ఉన్న తమ కుటుంబ సభ్యులకు పిల్లలను అప్పగించి పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. పరీక్ష రాసి వచ్చే వరకు అల్లరి చేయకుండా జాగ్రత్త ఉండాలని చిన్నారులను ఇలా బుజ్జగించి, సముదాయించిన చిత్రాలు డీఎస్సీ పరీక్ష కేంద్రాల వద్ద కనిపించాయి.

దరఖాస్తుల నవరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు వర్తించని దరఖాస్తుదారులు తమ డేటా సవరణ కోసం హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. సేవా కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ప్రజా పాలన సేవా కేంద్రంలో డేటా సవరణ చేసుకొని లబ్ధి పొందాలన్నారు. సేవా కేంద్రం ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందన్నారు. ప్రభుత్వ సెలవు రోజులలో సేవా కేంద్రాలు అందుబాటులో ఉండవన్నారు. డేటా సవరణ కోసం దరఖాస్తుదారులు రేషన్ కార్డ్, ఆధార్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్ తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఈడీఎం రజిత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాములు, ప్రజా పాలన వార్డ్ అధికారి బిందు పాల్గొన్నారు

మీరాలం చెరువుకు మహర్దశ

- దీని చుట్టూ 6 లేన్‌లతో 2.65 కి.మీ బ్రిడ్జి నిర్మాణం
- సుందరీకరణతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి
- ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌కు కన్సల్టెన్సీల ఎంపిక



సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక మీరాలం చెరువు అంతర్జాతీయ పర్యాటక హంగులను అద్దుకోనుంది. దేశ విదేశాలకు చెందిన పర్యాటకులను ఆకట్టుకొనేలా అందమైన ఆకుపచ్చ చెరువుగా అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందించింది. చెరువు చుట్టూ 2.65 కిలోమీటర్ల పరిధిలో 6 లేన్‌ల బ్రిడ్జిని నిర్మించనున్నారు. దీనిని బెంగళూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చింతల్‌మెట్ రోడ్డు వరకు అనుసంధానించనున్నారు. దీంతో అత్తాపూర్ వద్ద భారీ ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం లభించడంతో పాటు ప్రయాణ సమయం, దూరం కూడా తగ్గనున్నాయి. మరోవైపు ఆరు లేన్‌ల బ్రిడ్జి మార్గంలో పెద్ద ఎత్తున పచ్చదనాన్ని అభివృద్ధి చేయడం వల్ల సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతి లభించనుంది. ఈ బ్రిడ్జి నుంచి సందర్శకులు జూపార్కుకు వెళ్లేందుకు స్కైవాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. లేక్ ఫ్రంట్‌ను అందమైన పార్కుగా అభివృద్ధి చేస్తారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతి (పీపీపీ)లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ట్రాన్సాక్షన్ అడ్వైజర్ కమ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ కన్సల్టెంట్ కోసం అభ్యర్థనల స్వీకరణ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)కు హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. ఆసక్తి గల సంస్థలు ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. ఎంపికైన కన్సల్టెన్సీ సంస్థ ట్రాన్సాక్షన్ అడ్వైజర్ కమ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ కోసం బిల్ట్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) లేదా పీపీపీ మోడల్ కోసం అవసరమైన ప్రణాళికలను రూపొందించి అందజేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఆసక్తిగల సంస్థలు అత్యుత్తమ డిజైన్‌లతో బిడ్డింగ్‌లో పాల్గొనాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి : జీహెచ్ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం రాత్రి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు నీరు నిల్వ ఉండే ప్రాంతాల సమీపంలో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో అత్యవసరమైతేనే బయటకు రావాలని నగర వాసులకు సూచించారు. ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే జీహెచ్ఎంసీ కాల్ సెంటర్ 040-21111111 లేదా డీఆర్ఎఫ్ సహాయం కోసం 9000113667 నంబర్‌ను సంప్రదించాలని ఆమ్రపాలి సూచించారు.

దొంగిలించిన కారుతో దేశం దాటాడు

ఫిలింనగర్: దొంగతనం చేస్తే దేశంలో ఏమూలకు వెళ్లినా మొబైల్ ఫోన్ ట్రాకింగ్‌తోనో.. సిగ్నల్స్ ఆధారంగానో.. ఎలాగోలా.. ఎప్పటికైనా పోలీసులు పట్టేస్తారు. మరి దేశంలోనే లేకుండా పోతే ఎలా పట్టుకుంటారు?. సరిగా ఓ చోరాగ్రేసరుడు సరికొత్తగా దొంగతనానికి తెరలేపాడు. తాను దొంగిలించిన కారుతో దేశ సరిహద్దులు దాటి నేపాల్‌లోకి ప్రవేశించి 'నన్ను పట్టుకోండి చూద్దాం' అంటూ సవాల్ విసిరాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్‌పేట సబ్జా కాలనీలో ఇండస్ గో మోటార్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్లు అద్దెకు ఇచ్చే సంస్థ కొనసాగుతోంది. ఇండస్ గో పేరుతో ఏర్పాటైన కారు రెంటల్ నుంచి ఎవరైనా సరే సెల్ఫ్ డ్రైవ్ కార్లను గంటలు, రోజువారీ, వారాల తరబడి అద్దెకు తీసుకోవచ్చు. ఈ నెల 10న షాహీన్‌షా షరీఫ్ అనే యువకుడు ఇండస్ గో కార్యాలయానికి వచ్చి ఫ్లీట్ మేనేజర్ ఆకాష్ ప్రకాష్‌ను కలిసి తనకు మూడు రోజుల పాటు అద్దెకు కారు కావాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆధార్ కార్డుతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, చెక్‌లిస్టు భర్తీ చేసి ఇచ్చాడు. టీఎస్ 09 యూడీ 3955 నెంబరున్న కారును తీసుకుని ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు అప్పజెప్పేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చడంతో ఈ నెల 11న కారు నేపాల్ బోర్డర్ దాటినట్లుగా ఆకాష్ ప్రకాష్ గుర్తించాడు. 13న సాయంత్రం కారు తీసుకురాకపోయేసరికి షాహీన్‌షాను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కారు భారత్ సరిహద్దులు దాటి నేపాల్ దేశంలోకి ప్రవేశించడంతో తదుపరి వివరాలు లభించలేదు. దీంతో ఉద్దేశపూర్వకంగా తప్పుడు పత్రాలు ఇచ్చి నమ్మించి కారుతో ఉడాయించిన షాహీన్‌షాపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఆకాష్ ప్రకాష్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 318 (3), 316 (2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుక్కలతో జాగ్రత్త!

- వీటి నుంచి తిప్పలు తప్పాలంటే కొన్ని చర్యలు తప్పనిసరి
- జోనల్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలి
- అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలి
- సీఎం ఆదేశాల నేపథ్యంలో సంసిద్ధమైన జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: వీధికుక్కల దాడులతో మరణాలు.. ముఖ్యంగా పసిపిల్లల ప్రాణాలు పోతుండటంతో నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో తగిన చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. జవహర్‌నగర్‌లో పసికందు మరణానికి ముందు కూడా నగరంలో ఓ బాలుడు మృతి చెందడంపై దాఖలైన పిల్‌పై కుక్కల నియంత్రణకు కమిటీలు వేయాల్సిందిగా హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్రస్థాయిలో కమిటీని ప్రభుత్వం నియమించింది. పురపాలికల స్థాయిల్లోనూ కమిటీలను ఏర్పాటు చేసింది. వీధికుక్కలు జనావాసాల నడుమ లేకుండా దూర ప్రాంతాలకు తరలించడం, వాటి సంతతి పెరగకుండా శస్త్రచికిత్సలు, చేయడం, కుక్కలకు యాంటీరేబిస్ వాక్సిన్ వేయడం తదితరమైన వాటిని ఈ కమిటీలు నిర్వహించాల్సి ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో గత సంవత్సరం అంబర్‌పేటలో కుక్కల దాడిలో బాలుడి మరణం తర్వాత జోనల్‌స్థాయిలోనూ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశారు. యానిమల్ వెల్ఫేర్‌బోర్డ్ ఆఫ్ ఇండియా, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్–2023 కనుగుణంగా వీటిని ఏర్పాటు చేసినట్లు జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం పేర్కొంది. కమిటీ చైర్మన్‌గా సంబంధిత జోనల్ కమిషనర్, సభ్యులుగా డిప్యూటీ కమిషనర్లు, వెటర్నరీ అధికారులు, యానిమల్ వెల్ఫేర్‌బోర్డు సభ్యుడు, స్థానిక ప్రజాప్రతినిధి ఉన్నట్లు తెలిపింది.

కమిటీలు పని చేసేలా..

కమిటీలు ఏర్పాటైనప్పటికీ సరిగా పని చేసిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో కమిటీలు నిర్ణీత వ్యవధుల్లో, అవసరమైన సందర్భాల్లో సమావేశమై పరిస్థితుల్ని సమీక్షించేలా తగిన చర్యలు తీసుకోనున్నారు. సమీక్షలకనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు సైతం గతంలో మాదిరిగా ఒక్కసారికే పరిమితం చేయకుండా నిర్ణీత వ్యవధుల్లో నిర్వహించాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీధికుక్కల పట్ల వ్యవహరించాల్సిన పద్ధతుల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో కూడా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా.. పేదలు, కార్మికులు ఎక్కువగా నివసించే స్లమ్స్‌లో చిన్నపిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలపై అవగాహన కల్పించనున్నారు. వీటితో పాటు కుక్కల సంతతి పెరగకుండా సంతాన నిరోధక శస్త్ర చికిత్సల్ని పెంచనున్నారు. గత పదేళ్లలో 7,21,291 కుక్కలకు శస్త్రచికిత్సలు చేసినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. మూసీనది వెంట అధికసంఖ్యలో కుక్కలున్నట్లు గుర్తించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపింది. అవసరాలకనుగుణంగా భవిష్యత్‌లోనూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించే ఆలోచన ఉందని సంబంధిత అధికారి చెప్పారు.

- కుక్కల విషయంలో చేయాల్సిన, చేయకూడని పనుల గురించి విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు కాలనీ, బస్తీసంఘాల సహకారం తీసుకోవాలని భావిస్తున్నారు.

చేయాల్సినవి..

- కుక్క మీ దగ్గరకు వస్తుంటే.. కదలకుండా అక్కడే నిలబడాలి.
- వీధి కుక్కలకు దూరంగా ఉండాలి.
- నిశ్శబ్దంగా ఉండాలి.
- పిల్లలతో ఉన్న కుక్కల దగ్గరకు వెళ్లవద్దు.
- కుక్కలతో స్నేహపూర్వకంగా ఉండాలి.. కానీ వాటిని ముట్టుకోవద్దు.
- కుక్కల గుంపు కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలి.

చేయకూడనివి..

- కుక్కలు అరుస్తున్నప్పుడు, తింటున్నపుడు, నిద్రిస్తున్నప్పుడు వాటికి భంగం కలిగించవద్దు.
- వీధికుక్కలపై రాళ్లు విసరడం వంటివి చేయొద్దు.
- తల్లి, పిల్లలున్నప్పుడు కుక్కల వద్దకు వెళ్లొద్దు.
- కుక్కల వెంటపడి తరమవద్దు.
- కుక్కల తోక, చెవులు లాగడం వంటి పనులు చేయొద్దు.
- రోడ్లపై మాంసాహారం వేయొద్దు.
- ఎప్పుడైనా కుక్క కరిస్తే కరిచిన ప్రాంతంలో సబ్బుతో శుభ్రం చేయడంతో పాటు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- జీహెచ్ఎంసీని సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్: 040- 21111111
- ఈ వివరాలతో కరపత్రాలు తదితర మార్గాల ద్వారా మళ్లీ అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని యోచిస్తున్నారు.

జల సవ్వడి!

గలగలా గోదావరి.. బిరబిరా కృష్ణమ్మ

- పెరుగుతున్న సాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నీటి మట్టం
- ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం
- వారం రోజుల్లో రెండు అడుగులు పెరుగుదల
- ఇప్పటికే ఎల్లంపల్లిలో అత్యవసర పంపింగ్ నిలిపివేత
- మహా నగరం తాగునీటిపై చిగురిస్తున్న ఆశలు



సాక్షి, సిటీబ్యూరో: కృష్ణా, గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో మహానగరానికి తాగునీటిని అందించే నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపలి ప్రాజెక్టులపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో వారం రోజుల్లో జలాశయాల్లో నీటిమట్టం రెండు అడుగుల మేర పెరిగింది. మరో వారం రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో మరింత వరద నీరు వచ్చి చేరే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తో పాటు సింగూరు, మంజీరాలో కూడా నీటిమట్టం పెరుగుతోంది. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులైనా జలాశయాల్లో నీటిమట్టం పెరగకపోవడంతో నీటి సరఫరాపై ఆందోళన వ్యక్తమైంది. గతేడాది కృష్ణా, గోదావరి బేసిన్‌లో సరైన వరద నీరు వచ్చి చేరకపోవడంతో నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో వేసవిలోనే నీటి మట్టాలు పూర్తిగా పడిపోయాయి. సుదీర్ఘ కాలం తర్వాత రెండు జలాశయాలలో అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి డెడ్ స్టోరేజీ నీటిని అత్యవసర పంపింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారానే మహా నగరానికి దాదాపు 75 శాతం వరకు నీటి తరలింపు ఉంటుంది. ప్రస్తుతం నాగార్జున సాగర్ నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా నీటి సరఫరా కొనసాగుతుండగా, శ్రీపాద ఎల్లంపల్లిలో మాత్రం నీటి మట్టం పెరుగడంతో అత్యవసర పంపింగ్ నిలిపివేసి పాత పద్ధతి గ్రావిటీ ద్వారానే నీటి సరఫరా కొనసాగిస్తున్నారు.

సాగర్‌కు 21 వేలకు పైగా క్యూసెక్కులు..

ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి సుమారు 21,481 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో కర్ణాటకలోని ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టికి 92,736 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా, అక్కడి నుంచి తుంగభద్ర ప్రాజెక్టుకు 49,522 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దిగువ శ్రీశైలం ప్రాజెక్టుకు 3,585 క్యూసెక్కుల వరద వస్తుండంతో అక్కడ జల విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఇప్పటికే నాగార్జునసాగర్ నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో తాగునీటి కోసం అత్యవసర పంపింగ్ జరుగుతోంది. శ్రీశైలంలో వరద నీరు వచ్చి చేరుతుండటంతో హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు నిమిత్తం కనీసం 3 టీఎంసీల విడుదల చేయాలని ప్రాజెక్టు అధికారులు కోరడంతో వారం రోజుల నుంచి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జున సాగర్ నీటి మట్టం రెండు అడుగులు పెరిగింది.

శ్రీపాద ఎల్లంపల్లికి వరద

భారీ వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలో నీటి మట్టం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 4,468 క్యూసెక్కుల వరద వస్తోంది. అక్కడి నుంచి కడెం ప్రాజెక్టుకు 3,442 క్యూసెక్కులు, ఎల్లంపల్లి, సింగూరుకు 391 క్యూసెక్కుల వరద రికార్డవుతోంది. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో గత నెలలో అత్యవసర పంపింగ్ ప్రక్రియను చేపట్టారు. తాజాగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఇటీవల అత్యవసర పంపింగ్ నిలిపివేసి పాత పద్ధతిలోనే నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లిలోనూ రెండు అడుగుల నీటి మట్టం పెరిగింది.

ప్రస్తుతం జలాశయాల్లో నీటి మట్టం ఇలా (అడుగుల్లో)

ప్రాజెక్టు	పూర్తి స్థాయి నీటిమట్టం	ప్రస్తుతం	గతేడాది
నాగార్జున సాగర్	590.000	505.000	517.000
శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు	485.560	459.996	478.960
ఉస్మాన్‌సాగర్	1,790.000	1,779.250	1,783.850
హిమాయత్ సాగర్	1,763.500	1,755.600	1,759.950
సింగూరు	1,717.932	1,704.643	1,709.614
మంజీరా	1,651.750	1,644.800	1,645.200

ప్యాచ్‌వర్క్ ఫటాఫట్

- గుంతలు పూడ్చేలా బెంగళూరులో వినూత్న యాప్
- ఇలాంటి యాప్‌ను రూపొందించాలని జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశాలు
- నగరవాసులు నేరుగా రిపోర్టు చేసే వీలు
- కాంట్రాక్టర్‌కు నిమిషాల్లో సమాచారం
- వెనువెంటనే గుంతలు పూడ్చేలా ఏర్పాట్లు
- పూడ్చకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: వర్షం పడిందంటే చాలు నగరంలోని రోడ్లన్నీ కొట్టుకుపోతూ.. గుంతలు దర్శనమిస్తాయి. అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. ఇక కొన్ని ప్రదేశాల్లోనైతే వరద నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తాయి. వీటిని పూడ్చాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలంటే ఎలా సంప్రదించాలో ప్రజలకు తోచదు. కొన్నిసార్లు సంప్రదించినా స్పందన ఉండదు. మనం ఇచ్చిన ఫిర్యాదుకు జవాబుదారీగా ఉండేలా ఒక యూజర్ ఫ్రెండ్లీ యాప్ ఉంటే సులువుగా ఫిర్యాదు చేయొచ్చు కదా.. అప్పుడు వెంటనే సమస్యలు కూడా తీరుతాయి. తాజాగా ఇలాంటి యాప్ రూపొందించాలని జీహెచ్ఎంసీని హైకోర్టు కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి యాప్‌ను బెంగళూరులో త్వరలో తీసుకురానున్నట్లు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ ప్రకటించారు. ఇప్పటికే దీన్ని అభివృద్ధి పరిచామని, త్వరలోనే అందుబాటులోకి తెస్తామని వివరించారు. ఈ యాప్ ఎలా పని చేస్తుందనే వివరాలు మనం తెలుసుకుందాం.

ఫొటోలు తీసి పంపితే చాలు..

బెంగళూరు రోడ్లపై గుంతలు చాలా సర్వసాధారణం. ఎన్నోసార్లు వీటివల్ల వాహనదారులకు యాక్సిడెంట్లు అయిన సందర్భాలు కోకొల్లలు. ముఖ్యంగా వానాకాలంలో వాహనదారుల బాధలు వర్ణనాతీతం. దీనిపై చాలామంది నిరసనలు కూడా చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 'పాట్‌హోల్ అసిస్టెంట్ సిటిజెన్ ఎంగేజ్‌మెంట్' (పేస్) పేరుతో బృహత్ బెంగళూరు మహానగర పాలక సంస్థ యాప్‌ను రూపొందించింది. దీంతో నగరవాసులు గుంతల సమస్యలను సమర్థంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలుగుతుంది.

ఎలా పనిచేస్తుంది?

నగరంలోని ఎక్కడైనా గుంతలు పడినట్టు గుర్తిస్తే వాటిని ఫొటోలు తీసి యాప్‌లో సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఆ సమాచారాన్ని ఇంజినీర్.. ఆ గుంతలు పూడ్చాల్సిన బాధ్యత తీసుకున్న కాంట్రాక్టర్‌కు పంపిస్తారు. వెంటనే సదరు కాంట్రాక్టర్ గుంతలు పూడ్చి ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇక పని పూర్తయినట్లు ఫిర్యాదుదారుడికి మెసేజ్ వెళ్తుంది.

పని పూర్తి కాకపోతే..

ఫిర్యాదు చేసిన నిర్ణీత కాలంలో సమస్య పరిష్కరించాల్సి ఉంటుంది. సరైన సమయంలో స్పందన రాకపోయినా.. సమస్యను పరిష్కరించకపోయినా.. గుంతలు పూడ్చకపోయినా.. అందుకు కారణాలు చెప్పకపోయినా.. ఉన్నతాధికారులకు సమాచారం అందుతుంది. వెంటనే వాళ్లు రంగంలోకి దిగుతారు. గుంతలు పూడ్చడంలో విఫలమైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేందుకు ఉపక్రమిస్తారు.

కాంట్రాక్టర్లకు కూడా ప్రయోజనకరంగా..

గుంతలు పూడ్చిన కాంట్రాక్టర్ బిల్లులు పొందడం ఆలస్యం అవుతుంటుంది. పని చేసిన తర్వాత సంబంధిత బిల్లులు మాన్యువల్‌గా కార్యాలయానికి వెళ్లి సబ్మిట్ చేస్తుంటారు. అలాంటి అవసరం లేకుండా బిల్లులను కూడా యాప్‌లోనే సబ్మిట్ చేసే వెసులుబాటు కల్పించనున్నారు. బిల్లులు, వాటి చెల్లింపుల వివరాలన్నీ యాప్‌లో అందుబాటులో ఉంచుతారు. దీంతో పనులు చకచకా అయిపోయేందుకు వీలుంటుంది.

గతంలో భవన నిర్మాణ యాప్..

టెక్నాలజీని పుణికిపుచ్చుకోవడంలో ముందుడే బృహత్ బెంగళూరు గతంలోనూ నగరవాసుల కోసం ఒక యాప్ తీసుకొచ్చింది. పౌరులకు సంబంధించిన సమస్యలతో పాటు, భవన నిర్మాణానికి సంబంధించి సమస్యలను రిపోర్టు చేసేందుకు 'ఫిక్స్ మై స్ట్రీట్'యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఉమ్మడి దేవాలయాల కమిటీలకు చెక్కులు

అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రజల భాగస్వామ్యం, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాల ఉమ్మడి దేవాలయాలకు మంత్రి చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవాలయ కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21న ఉజ్జయిని మహంకాళి బోనాలు, 28న లాల్ దర్వాజా సింహవాహిని బోనాలు, ఆ తర్వాత రంగం, భవిష్యవాణి, ఏనుగు ద్వారా అంబారీ ఊరేగింపు కార్యక్రమాలు సజావుగా జరగాలని మంత్రి ఆకాంక్షించారు. గతేడాది కంటే ఈసారి దేవాలయాలకు 10 శాతం అదనంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో చెక్కుల పంపిణీ పూర్తైందన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ వెంకటాచారి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ బాలాజీ, రామకృష్ణ, దేవాలయాల కమిటీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

జూపల్లిని కలిసి బార్ యజమానులు



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్స్ అసోసియేషన్ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు గురువారం రవీంద్రభారతిలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక వైన్స్ షాపులలో పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వైన్స్ షాపులకు, బార్‌లకు మధ్య దూరాన్ని సైతం లెక్క చేయకుండా బార్‌లకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారులు బాల్‌రాజ్ గౌడ్, చక్రపాణి, ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై 'ఆప్ట్'

- పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ విభాగాలతో ప్రత్యేక బృందాలు
- ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యలు సూచించడం వీటి బాధ్యత
- ఇక గల్లీగల్లీలో సైకిల్ పెట్రోలింగ్.. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత
- ప్రజలతో సత్సంబంధాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన
- నైపుణ్యతను బట్టి హెడ్ కానిస్టేబుళ్లకూ ఐఓ బాధ్యతలు

'సాక్షి'ఇంటర్వ్యూలో రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు



సాక్షి, సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాల నివారణపై రాచకొండ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యల కోసం యాక్సిడెంట్ అనాలసిస్ ప్రివెన్షన్ టీం(ఆప్ట్) ఏర్పాటు కానుంది. ఇందులో పోలీసులతోపాటు మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ, ఇంజనీరింగ్ వంటి అన్ని విభాగాలు భాగస్వామ్యం అవుతాయి. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే కేసు నమోదు, దర్యాప్తుతోపాటు సమాంతరంగా ప్రమాదం జరిగిన తీరు, కారణాలు, రోడ్డు పరిస్థితులు తదితరాలను క్షేత్రస్థాయిలో విశ్లేషించడం, పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నివారణ మార్గాలను సూచించడం ఈ బృందం బాధ్యత. రోడ్లపై పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధ్యయనం చేయడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో రహదారుల వెడల్పు, ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు ఇతరత్రా చర్యలూ తీసుకుంటుంది. ఈ మేరకు 'ఆప్ట్'ను రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో త్వరలోనే అమలు చేయనున్నట్లు కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. 'సాక్షి'ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించిన ముఖ్యమైన అంశాలివీ..

ఈ మూడింటికే ప్రాధాన్యత..

రాచకొండలో విజిబుల్ పోలీసింగ్, సత్వర స్పందన, సాంకేతికత వినియోగం.. ఈ మూడింటికే అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పోలీసు వ్యవస్థలో సాంకేతికత వినియోగం ఎంత పెరిగినా విజిబుల్ పోలీసింగే అత్యంత కీలకం. అందుకే గల్లీ గల్లీలో సైకిల్ పెట్రోలింగ్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే ప్రతీ పోలీసు స్టేషన్‌కు 3–4 సైకిళ్లను పంపిణీ చేశాం. శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ఠాణా సిబ్బంది ఆయా ప్రాంతాల్లో సైకిళ్లపై తిరుగుతారు. దీంతో సిబ్బందికి ఆరోగ్యం, ప్రజలతో సత్సంబంధాలు మెరుగవుతాయి. వీరు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. నేరం జరగ్గానే సత్వరమే స్పందించి ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి బాధితులకు న్యాయం చేయాలి. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులపై జరిగే అత్యాచారాలు, హత్యలు ఇతరత్రా నేరాలను చాలెంజ్‌గా తీసుకొని సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

హెడ్ కానిస్టేబుళ్లూ ఐఓలుగా..

నేరం తీవ్రత, సిబ్బంది పనితీరు, నైపుణ్యతను బట్టి హెడ్ కానిస్టేబుళ్లకు కూడా విచారణాధికారి(ఐఓ) బాధ్యతలు అప్పగిస్తాం. దీంతో వారు సుశిక్షితులు అవడంతోపాటు ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్లపై ఒత్తిడి తగ్గుతుంది. డ్రగ్ పెడ్లర్, భూకబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతాం. సామాన్యులను ఏమాత్రం ఇబ్బందులకు గురిచేసినా ఉపేక్షించం. హత్యలు, దొంగతనాల తరహాలోనే భూ కబ్జాదారులపై పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తాం. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంతోపాటు వాటి మూలాలను వెతికి పట్టుకొని కూకటివేళ్లతోసహా పెకిలిస్తాం. దీనికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

కమిటీలు క్రియాశీలకంగా..

మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లు, కాలేజీలలో సైబర్ వారియర్లు, యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్ కమిటీలు క్రియాశీలకంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ పోలీసులు రోడ్డు మీద ఉంటేనే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ జరుగుతుంది. అందుకే ఇక నుంచి ప్రతిరోజు పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ డీసీపీ నుంచి కానిస్టేబుల్ వరకూ ప్రతీ ఒక్కరూ రోడ్డు మీదనే విధులు నిర్వర్తిస్తారు.

ఒక్క కన్విక్షన్.. వంద నేరాలకు అడ్డు

ఒక్క నేర నిరూపణ(కన్విక్షన్) వంద నేరాలకు అడ్డుకట్ట పడుతుంది. నేరం చేస్తే పోలీసుల నుంచి, శిక్ష నుంచి తప్పించుకోలేమనే భయం నేరస్తులలో కలుగుతుంది. ఇదే లక్ష్యంగా ఎక్కువ కన్విక్షన్లు వచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. కేసు నమోదైన 60 రోజుల్లోగా చార్జ్‌షీట్లు దాఖలు చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. రౌడీషీటర్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న పాత నేరస్తుల గురించి ఆరా తీసి, వారు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? ఎక్కడ ఉన్నారు? ఫోన్ నంబర్లు, చిరునామా, కుటుంబసభ్యులు, ఇతరత్రా వివరాలతో డేటా అప్‌డేట్ చేస్తాం. దీంతో వారి కదలికలపై నిరంతరం నిఘా పెట్టడానికి వీలవుతుంది.

విద్యుత్ బిల్లు చెల్లించాలన్నందుకు దాడి



దాడిలో గాయపడ్డ సాయిగణేష్

సనత్‌నగర్: విద్యుత్ బిల్లు చెల్లించాలని అడిగిన సిబ్బందిపై ఓ యువకుడు దాడి చేశాడు ఓ యువకుడు. అతడిపై చర్యలు తీసుకోవాలంటూ విద్యుత్ ఉద్యోగులు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు శాంతినగర్‌కు చెందిన హమిస్‌పూర్ శ్రీకాంత్(45) ఎర్రగడ్డ ప్రాంతంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ప్రైవేటు మీటర్ రీడర్ అయిన సాయిగణేష్‌తో కలిసి మోతీనగర్ మీ–సేవా సమీపంలో ఉన్న వెంకటస్వామి ఇంటికి వెళ్లి రూ.6,858 కరెంటు బిల్లు చెల్లించాలని కోరారు. దీంతో వెంకటస్వామి కుమారుడు మురళీధర్‌రావు కలగజేసుకుని 'మేం బిల్లు కట్టం.. ఏమి చేసుకుంటారో చేసుకోండి'అంటూ దురుసుగా మాట్లాడాడు. శ్రీకాంత్‌పై దాడి చేసి కిందికి నెట్టేశాడు. సాయిగణేష్ మొహంపై, కడుపులో పిడిగుద్దులతో దాడి చేశాడు. దీంతో సాయిగణేష్ కుడికన్నుకు గాయాలయ్యాయి. శ్రీకాంత్ శరీరం కమిలిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మురళీధర్‌రావుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మురళీధర్‌రావు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండటం గమనార్హం. అలాగే అతడికి బాక్సింగ్‌లో కూడా ప్రావీణ్యం ఉంది.

లారీడ్రైవర్‌పై ట్రాఫిక్ ఎస్సై జులుం

బదిలీ వేటు వేసిన ఉన్నతాధికారులు



డ్రైవర్‌పై దాడి చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై యాదగిరి

దుండిగల్: లారీ డ్రైవర్‌పై ఓ ట్రాఫిక్ ఎస్సై అసభ్యపదజాలంతో దూషించి చేయిచేసుకున్నారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై బదిలీవేటు వేశారు. వివరాలు... ఈ నెల 17వ తేదీన గండిమైసమ్మ చౌరస్తా నుంచి నర్సాపూర్ వెళ్లే దారిలో దుండిగల్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద ఓ లారీలో సాంకేతిక సమస్య తలెత్తడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపివేశాడు. నో పార్కింగ్ ప్రాంతంలో ఎందుకు లారీని నిలిపావంట డ్రైవర్‌పై జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్సై యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలో సాంకేతిక సమస్య ఉందని, స్టార్ట్ కావడం లేదని డ్రైవర్ చెప్తున్నా వినకుండా చేయిచేసుకున్నారు. అసభ్యపదజాలంతో దూషించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఉన్నతాధికారులు స్పందించి ఎస్సై యాదగిరిపై బదిలీ వేటు వేశారు. హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎక్స్ వేదికగా డీజీపీని ప్రశ్నించిన కేటీఆర్

ఈ ఘటనపై మాజీమంత్రి కేటీఆర్ 'ఎక్స్'వేదికగా స్పందిస్తూ డీజీపీ జితేందర్‌కు ట్యాగ్ చేశారు. ఇంత అంగీకారయోగ్యమైన భాష వినియోగించిన పోలీసుల ప్రవర్తన సబబేనా అని ప్రశ్నించారు. 'ప్రజలే పోలీసులకు జీతాలు ఇస్తున్నారన్న విషయం గుర్తించుకోండి. ఇలాంటివి సోషల్ మీడియాలో తరుచూ చూస్తున్నాను. ప్రజలతో మమేకం కాని పోలీసులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి'అని ట్వీట్ చేశారు.

పోస్టుమార్టం చేయకుండా మృతదేహం అప్పగింత

మంత్రి దామోదర్ ఆదేశాల అమలు

గాంధీఆస్పత్రి : మానవతా దృక్పథంతో వ్యవహరించి పోస్టుమార్టం నిర్వహించకుండానే మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జారీ చేసిన ఆదేశాలను చిలకలగూడ పోలీసులు, గాంధీ ఆస్పత్రి వైద్యులు అమలు చేశారు. వివరాలు... వరంగల్‌కు చెందిన సాంబశివరావు, విశ్వరూప భార్యభర్తలు. కొన్ని రోజుల క్రితం సాంబశివరావు ఇంట్లో చెప్పకుండా నగరానికి వచ్చి గాంధీఆస్పత్రి మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై నివసిస్తున్నాడు. అస్వస్థతకు గురైన సాంబశివరావు బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకున్న విశ్వరూప తన భర్త మృతదేహాన్ని గుర్తించింది. భర్త మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని అప్పగించాలని కోరగా వైద్యులు తిరస్కరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆమె గోడు తెలుసుకున్న మంత్రి రాజనర్సింహ వెంటనే స్పందించారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, చిలకలగూడ సీఐ అనుదీప్‌లకు ఫోన్ చేసి పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని అప్పగించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు పోస్టుమార్టం నిర్వహించకుండా సాంబశివరావు మృతదేహాన్ని భార్య విశ్వరూపకు అప్పగించామని చిలకలగూడ సీఐ అనుదీప్ తెలిపారు.

'చిరెక్' విద్యార్థుల సత్తా

ఐబీడీపీ స్కోర్‌లో అంతర్జాతీయ నగటును అధిగమించారు...

సాక్షి, సిటీబ్యూరో: చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల ఐబీడీపీ, కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ, సీబీఎస్ఈ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ స్కూల్ అంతర్జాతీయ విభాగం ప్రిన్సిపాల్ సంచిత రాహ తెలిపారు. 'ఐబీడీపీ మే 2024'పరీక్షలో 95 మంది విద్యార్థుల బృందం ఈ ఏడాది సగటు 34 స్కోర్‌ను సాధించిందని, ఇది అంతర్జాతీయ సగటు 30.32 కన్నా ఎక్కువని పేర్కొన్నారు. ముఖ్యంగా 15 మంది విద్యార్థులు 40 గ్రేడ్ పాయింట్లకుపైగా సాధించారని, స్పృహ డియో, ఆమని సుసానా మద్దుకూరి 45కి 44 పాయింట్లు సాధించారన్నారు. కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ 2024 పరీక్షల్లో 186 ఏ ప్లస్, 183 ఏ ఎంట్రీలతో అన్ని సబ్జెక్టులలో తమ స్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత రేటు సాధించిందన్నారు. 10, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో కూడా అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నట్లు తెలిపారు. దర్శికా సన్వారియా 96.8 శాతం స్కోర్ సాధించగా, 86.7 శాతం మంది విద్యార్థులు 75 శాతం, అంతకంటే ఎక్కువ సాధించారన్నారు. 10వ తరగతి సీబీఎస్ఈలో 93 శాతం మంది విద్యార్థులు 75 శాతం అంతకంటే ఎక్కువ స్కోర్, ఇద్దరు 99.2 శాతం స్కోర్ సాధించారని సంచిత రాహ తెలిపారు.

22న షార్జా-అసోచామ్ భేటీ

సాక్షి, సిటీబ్యూరో: షార్జా ప్రభుత్వంతో కలిసి అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ – ఇండస్ట్రీ సహకారంతో ప్రత్యేక బీ2బీ సమావేశాన్ని ఈ నెల 22న బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని అసోచామ్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార ప్రోత్సాహకాలు, సున్నా పన్నులు, వేగంగా కంపెనీ రిజిస్ట్రేషన్ మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, రష్యా, ఐరోపాలో వ్యూహాత్మక మార్కెట్ చేరుకోవడం వంటి లక్ష్యాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలలో అవగాహన పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా వారి వ్యాపారాలను విస్తరించడానికి ఈ భేటీ ఉపకరిస్తుందన్నారు.

850 గ్రాముల బంగారం దోపిడీ

రాంగోపాల్‌పేట్: ద్విచక్ర వాహనంపై 850 గ్రాముల బంగారు ఆభరణాలు తరలిస్తుండగా దుండగులు అడ్డగించి దోచుకెళ్లిన ఘటన మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఓల్డ్ జైలు స్ట్రీట్‌కు చెందిన ప్రఫుల్ జైన్ పాట్ మార్కెట్‌లో శాంతినాథ్ గోల్డ్ జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం వాటిని కస్టమర్లను చూపించేందుకు క్లాక్‌టవర్ ప్రాంతంలోని సాయిశ్రీని జ్యూవెలర్స్ షాపు నిర్వాహకుడు వెంకట్ తీసుకున్నారు. ఆ తర్వాత ప్రఫుల్ దగ్గర పనిచేసే దినేష్ జైన్ సాయంత్రం 4 గంటల సమయంలో ఆ ఆభరణాలను తిరిగి షాపునకు ద్విచక్ర వాహనంపై తీసుకొస్తున్నాడు. మార్గమధ్యంలో బాటా షోరూమ్ వద్ద బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు దినేష్ జైన్‌ను అడ్డగించి ఆభరణాలున్న బ్యాగు ఎత్తుకెళ్లారు. వెంటనే ఆయన షాపుకు వచ్చి యజమానికి విషయం చెప్పాడు. ఈ మేరకు యజమాని మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దుండగుల కోసం గాలింపు చేపట్టారు. ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. అయితే తెలిసిన వ్యక్తులే పథకం ప్రకారం కాపు కాచి దోపిడీ చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆగస్టు 9న 'హలో మాల చలో ఢిల్లీ'



మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

గన్‌ఫౌండ్రీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 9న ఢిల్లీ జంతర్‌మంతర్‌లో 'హలో మాల చలో ఢిల్లీ'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మాలసంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ తెలిపారు. గురువారం ఆదర్శనగర్‌లో జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అన్ని రాజకీయ పార్టీలు గౌరవించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌పై భాగ్యరెడ్డి వర్మ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేఏసీ ముఖ్య సలహాదారులు అంజయ్య, కె.బాలకృష్ణ, నేతలు నర్సింహయ్య, గడ్డం సత్యనారాయణ, దాసరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌లైన్స్ ఉద్యోగినిపై లైంగిక వేధింపులు

శంషాబాద్: ఓ ఎయిర్‌లైన్స్ సంస్థ మహిళా ఉద్యోగిపై మేనేజర్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు... శంషాబాద్ విమానాశ్రయ సమీపంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న మహిళా ఉద్యోగి(26) వివిధ ఎయిర్‌లైన్స్ సంస్థలతోపాటు జీఎంఆర్ సంస్థలో పనిచేసింది. ప్రస్తుతం ఆకాశ ఎయిర్‌లైన్స్ సంస్థలోని సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తోంది. ఇటీవల మేనేజర్‌గా చేరిన రవితేజేంద్ర ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగా శరీరాన్ని తాకడంతోపాటు ద్వంద్వార్థాలతో వేధిస్తున్నాడు. అతడి వేధింపులకు తాళలేక ఆమె ఈ నెల 15 రాత్రి ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నతండ్రే కామాంధుడై...

మేడిపల్లి: తాగిన మత్తులో కన్నతండ్రే కామాంధుడై కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి(36) కుటుంబంతోసహా బతుకుదెరువు కోసం నగరానికొచ్చి మేడిపల్లి సాయినగర్ కాలనీలో 15 ఏళ్లుగా ఉంటున్నాడు. స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలం క్రితం అతడిని భార్య వదిలి వెళ్లిపోగా, తల్లి, కూతురుతో కలిసి ఉంటున్నాడు. కుమార్తె(12)ను హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం కూతురికి జ్వరం రావడంతో ఇంటికి తీసుకువచ్చాడు ఇంట్లో తల్లిలేని సమయంలో బుధవారం అర్ధరాత్రి మద్యంమత్తులో కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

గో'దారుల'పైనా దృష్టి

- చిన్న వర్షానికే సిటీలో రహదారులు మునక
- ఫలితంగా అనేక చోట్ల భారీ ట్రాఫిక్ జామ్స్
- కారణాలు అన్వేషించనున్న హైడ్రా
- జేఎన్టీయూ అధికారులతో భేటీకి నిర్ణయం
- బాటిల్‌నెక్స్ సమస్యలపై పోలీసులతో చర్చలు



సాక్షి, సిటీబ్యూరో: వానొస్తే వరద.. చినుకు పడితే చిత్తడి.. రోడ్డెక్కాలంటే రోత.. ఇది సిటీలోని అనేక రహదారుల పరిస్థితి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానస పుత్రిక హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా) దీనిపైనా దృష్టి పెట్టనుంది. రోడ్లు మునిగిపోవడంలోనూ అవినీతి, నిర్లక్ష్యం కోణాలను వెలికి తీయనుంది. మరోపక్క ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న బాటిల్‌నెక్స్ అంశాన్నీ ఈ విభాగం పరిగణనలోకి తీసుకుని పని చేయనుంది. రహదారులపై నీరు నిలిచినప్పుడు స్పందించాల్సిన బాధ్యత డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ది (డీఆర్ఎఫ్) కావడం ఈ విభాగం హైడ్రాలు విలీనం కానుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రధానంగా రెండు కారణాలతోనే ఇలా..

చిన్నపాటి వర్షానికే నగరంలోని అనేక ప్రాంతాలు జలమయమవుతున్నాయి. శివారు ప్రాంతాలతో పాటు నడిబొడ్డున ఉన్న రహదారులదీ ఇదే పరిస్థితి. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. నానాటికీ విస్తరిస్తున్న నగరంతో పాటు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ లేదు. కొన్ని దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మించిన మురుగునీటి వ్యవస్థ ఇప్పటి అవసరాలకు సరిపోవట్లేదు. మరోపక్క ఉన్న డ్రైనేజీ సిస్టం సైతం సక్రమంగా వినియోగంలోకి రాకపోవడం కారణంగానూ అనేక రహదారులు నీట మునుగుతున్నాయని హైడ్రా అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు ఆ విషయాన్ని గుర్తించారు.

క్యాచ్‌పిట్స్ పూడికతీత పక్కాగా జరగక..

ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభానికి ముందు జీహెచ్ఎంసీ అధికారులు నాలాలు, క్యాచ్‌పిట్స్ తదితరాల్లోని పూడిక తీయిస్తుంటారు. అయితే నగరంలోని అనేక ప్రాంతాల్లో ఈ పూడికతీత పక్కాగా జరగట్లేదని హైడ్రా భావిస్తోంది. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పూర్తిస్థాయిలో పనులు చేయకుండానే బిల్లులు పొందుతున్నట్లు అనుమానిస్తోంది. ఈ కారణంగా క్యాచ్‌పిట్స్ చెత్తతో నిండిపోయి నీళ్లు ప్రధాన రహదారులపైకి చేరుతున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న హైడ్రా అధికారులు నగరంలో రహదారులు మునిగిపోయే ప్రాంతాలు, అక్కడ జరిగిన పనులు తదితరాలపైనా ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. రహదారులు మునిగిపోవడానికి కారణాలను అధ్యయనం చేయడం, పరిష్కారాలు కనిపెట్టడం కోసం జేఎన్టీయూ నిపుణుల సాయం తీసుకోనున్నారు.

ట్రాఫిక్ పోలీసులతో కలిసి బాటిల్‌నెక్స్‌పై..

వర్షం కురవకపోయినప్పటికీ రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సాధారణ విషయంగా మారిపోయింది. దీనికి ఆయా చోట్ల ఉన్న బాటిల్‌నెక్స్ కారణంగా మారుతున్నాయి. వీటిలో అత్యధికం ఆక్రమణల వల్ల ఏర్పడినవే అని హైడ్రా అనుమానిస్తోంది. ప్రభుత్వ స్థలం, రోడ్డు, ఫుట్‌పాత్ తదితరాలను ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసిన కారణంగానే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని హైడ్రా తేల్చింది. ఈ నేపథ్యంలోనే వీటిని కబ్జా చేయడం ద్వారా బాటిల్ నెక్స్‌కు కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి హైడ్రా సిద్ధమవుతోంది. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులతో ఒకసారి సమావేశమైన హైడ్రా అధికారులు ప్రాంతాల వారీగా బాటిల్ నెక్స్ జాబితాలు సిద్ధం చేశారు. వీటికి సంబంధించి క్షేత్రసాయిలో పర్యటించిన తర్వాత ఉన్నతాధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. వీలున్నంత వరకు బాటిల్‌నెక్స్ క్లియర్ చేయించాలని హైడ్రా అధికారులు భావిస్తున్నారు.

రుణమాఫీతో రైతాంగానికి చేయూత

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహత్తర లక్ష్యంతో రైతాంగానికి చేయూతనివ్వాలని దృఢ సంకల్పంతో రుణమాఫీకి శ్రీకారం చుట్టిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో పలు పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దక్కుతుందని ఆయన అన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పథకానికి శ్రీకారం చుట్టిందని తొలి దశలో లక్ష రూపాయలు, రెండో దశలో లక్షన్నర, మూడో దశలో ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. రుణమాఫీతో పాటు రాష్ట్ర ప్రజలు ఎవరు కోరకముందే తెల్లరేషన్ కార్డు లేకపోయినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికీ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా సేవలు అందించాలని సంకల్పించడం శుభపరిణామన్నారు. ఏడాదిలో ఆరోగ్య శ్రీ పథకానికి రూ. 1500 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడకుండా అందరికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందించడం మామూలు విషయం కాదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కృషి, పట్టుదలతో ఇచ్చిన హామీలను కంకణబద్ధులై నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ సంప్రదాయ వంటకాల ప్రదర్శన


తెలంగాణ వంటకాలు ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా బోనాల వేడుకలు గురువారం సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో అమ్మవారికి సమర్పించే బోనాలు, తెలంగాణ సంప్రదాయ వంటలైన నాటుకోడి, చిట్టిగారెలు, బగారన్నం మటన్ కర్రీ, సకినాలు, బెల్లం అన్నం, పాయసం, పచ్చి పులుసు ఇలా తదితర తెలంగాణ వెరైటీలు ప్రదర్శనకు ఉంచారు. ఈ నెల 21వ తేదీన సికింద్రాబాద్ బోనాలు, అలాగే 28న జరిగే హైదరాబాద్ బోనాల పండగ సందర్భంగా తెలంగాణ వంటకాలు మొత్తం 25 రకాలు మధ్యాహ్నం 12:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంచనున్నట్లు చెఫ్ సత్య పండరి తెలిపారు. ఈ కార్యక్రమంలో చెఫ్‌లు మహేందర్, శ్రీనివాస్, ప్రతినిధి శ్లోక పాల్గొన్నారు.

టర్కీ జాతీయ ఐక్యత దినోత్సవం


వేడుకల్లో టర్కీ కాన్సులేట్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్

బంజారాహిల్స్: టర్కీ జాతీయ ఐక్యత దినోత్సవం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–34లో గురువారం జరిగింది. టర్కీ కాన్సులేట్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్, ఆసఫ్ జాహీ రాజవంశానికి చెందిన తొమ్మిదో నిజాం నవాబ్ రౌనక్ యార్‌ఖాన్, వెల్‌నెస్ రచయిత దివ్యత తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. టర్కీ జాతీయ ఐక్యత ఎనిమిదో వార్షికోత్సవం జ్ఞాపకంగా ఈ వేడుకలను నిర్వహించారు.

జాగ్రత్తలతోనే డెంగీ నుంచి రక్షణ

సాక్షి, సిటీబ్యూరో: ముందస్తు జాగ్రత్తల ద్వారా డెంగీకి దూరంగా ఉండవచ్చునని అపోలో ఆసుపత్రికి చెందిన డా.మల్లాదేవి వినయ సూచించారు. నగరంలో డెంగీ కేసులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆ తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి నొప్పి, వికారం, వాంతులు, కీళ్ళు–కండరాల నొప్పి, చర్మంపై దద్దుర్లు, తేలికపాటి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే, డెంగీతో బాధపడుతున్నట్లు గుర్తించాలని తక్షణ వైద్య సహాయం అందించాలన్నారు. దోమలు పెరిగేందుకు వీలు కల్పించే నీరు నిల్వ ఉంచే పాత్రలు సరిగ్గా మూత వేసి ఉండేలా చూసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పొడవు చేతులున్న చొక్కాలు, ఫుల్ ప్యాంట్స్ ధరించాలని, చిన్న పిల్లలకు దోమతెరలను వాడాలని ఆమె ఒక ప్రకటనలో సూచించారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల నిరసన

ఖైరతాబాద్: పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్ల నిమిత్తం కాంట్రాక్టులు దక్కించుకున్న వారంతా నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలలో వీడియోగ్రఫీ, ఫుడ్, టెంట్స్‌కు సంబంధించిన బిల్లులను చెల్లించకుండా ఎమ్మార్వో, ఆర్డీఓ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. బిల్లులు రాకుంటే తమ కుటుంబాలతో రోడ్డున పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో జూబ్లీహిల్స్, గోషామహల్, కార్వాన్, శేరిలింగంపల్లి, బహదూర్‌పురాలకు చెందిన కాంట్రాక్టర్లు సాయినాథ్, నరేష్, రాజు, నదీం, షరత్ తదితరులు ఉన్నారు.

జైలు నుంచి విడిపిస్తానని.. రూ.2.85 లక్షలు వసూలు

వెంగళరావునగర్: మహిళను నమ్మించి నగదు కాజేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖలో విధులు నిర్వహించే మహిళ 2022లో నాగరాజు అనే వ్యక్తిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. వివాహం ఇష్టం లేని ఆమె అన్న మోబిన్ మహ్మద్, బావ మసూద్‌లు నాగరాజును చంపారని అప్పట్లో పోలీసులు కేసు రిజిస్టర్ చేసి వారిని జైల్లో ఉంచారు. అయితే నజియా అనే మహిళ తన చెల్లిని చూడటానికి వస్తున్న క్రమంలో పరిచయమైంది. ఈ క్రమంలో తన మామ కొడుకు నెమత్ అల్తారీ అలియాజ్ ముజాహీద్‌కు చాలా మంది తెలుసునని, జైల్లో ఉన్న ఆమె సోదరుడిని, బావను విడిపిస్తారని చెప్పించింది. దీంతో నమ్మి అతడికి కేసు పేపర్లుతో పాటు తన భర్త గోల్డ్ రింగ్ కూడా ఇచ్చింది. 15 రోజుల తర్వాత డబ్బులు కావాలని దాదాపు రూ.లక్షన్నర తన ఫోన్‌కు నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. తర్వాత ఏటీఎం కార్డు కూడా తీసుకున్నాడు. ఆ తరువాత ఆమె బ్యాంక్‌కు వెళ్ళి చెక్ చేసుకోగా రూ.2.85 లక్షలు విత్ డ్రా చేసుకున్నట్టుగా తెలిసింది. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినా స్పందించకపోవడంతో ముజాహీద్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్య తలెత్తితే..
క్షణాల్లో పరిష్కారం.!



- పూర్తయిన విద్యుత్ ఫీడర్ల సర్వే
- యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్న అధికారులు
- సర్వేతో ఎన్నో ప్రయోజనాలు
- వర్షాకాలం నేపథ్యంలో అధికారుల చర్యలు

వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా టీజీఎయిమ్స్ యాప్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే దానిని గుర్తించి పరిష్కరించేందుకు వీలు కలుగుతుంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే 99 శాతం ఫీడర్ల సర్వేను కూడా పూర్తి చేసింది. ఈ యాప్ ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు.


సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఏ సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్ని ఫీడర్లు..

సబ్‌స్టేషన్ పేరు	11కేవీ ఫీడర్లు	సర్వేపూర్తయినవి
అమీర్‌పేట	15	15
ఎస్‌కేనగర్	12	12
యూసుఫ్‌గూడ	16	15
బంజారాహిల్స్	43	41
ఫిలింనగర్	32	32
జూబ్లీహిల్స్	33	33
మాదాపూర్	39	33
మోతీనగర్	9	9
గ్రీన్‌ల్యాండ్స్	24	24
ఎస్ఆర్‌నగర్	22	22
బేగంపేట	30	30
బోరబండ	9	9
సనత్‌నగర్	17	17
ఎర్రగడ్డ	10	10

బంజారాహిల్స్: ఎక్కడైనా, ఏదేని పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తితే నిమిషాల్లో సమస్యను గుర్తించి పరిష్కరించేలా టీజీఎయిమ్స్ యాప్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో జూన్ 24వ తేదీ నుంచి 11 కేవీ ఫీడర్ల సర్వేను చేపట్టింది. 11 కేవీ ఫీడర్ల సర్వేను ఎప్పటికప్పుడు సంబంధిత డీఈలు, ఏడీఈలు, ఏఈలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పరిశీలిస్తున్నారు.ఈ సర్వేలో భాగంగా అధికారులు, సిబ్బంది సంబంధిత ఫీడర్ల పరిధిలో వివరాలు,ఫొటోలను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 99శాతం ఫీడర్ల పరిధిలో సర్వే పూర్తయ్యింది.ఈ సర్వే పూర్తయితే కరెంటు పోల్స్‌ను, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను త్వరితగతిన గుర్తించేందుకు వీలవుతుంది. దీనికి సంబంధించి యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఖైరతాబాద్, సోమాజీగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ,ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావు నగర్, రహమత్‌నగర్, కృష్ణానగర్, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో 11కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే దాదాపుగా పూర్తి కావొచ్చింది. స్తంభాలు, డీటీఆర్‌ఏలు, ఆర్ఎంయూల వరకు ప్రతిదీ లెక్కించి జీపీఎస్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఈ సర్వేలో ఎస్ఈ నుంచి ఆర్టిజన్ వరకు అధికారులందరూ క్షేత్రస్థాయిలో పాల్గొని వివరాలు సేకరిస్తున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో 11కేవీ ఓవర్ హెడ్‌లైన్స్, ఎల్‌టీ లైన్స్ విస్తరించి ఉన్నాయి.అలాగే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు,లైన్లు,ఇన్సులేటర్లు, ఏబీ స్విచ్‌లు,కండక్టర్లు, డీటీఆర్‌ల వివరాలను పక్కాగా సేకరించి టీజీఎస్ పీడీసీఎల్ జీఐఎస్ అసెట్ ఇన్‌స్పెక్షన్ మెయింటెనెన్స్ సిస్టంలో నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా సబ్‌స్టేషన్, పోల్ లొకేషన్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రక్చర్,రింగ్ మెయిన్ యూనిట్, ఆటో రీక్లోజ్,లైన్ ఏబీ స్విచ్‌ల జీఐఎస్ మ్యాపింగ్ చేయడంతో పాటు స్తంభాల పరిస్థితి (సిమెంట్, ఐరన్, రైల్వే(ట్రాక్ పోల్) టీటీఆర్‌స్ట్రక్చర్ ఎలా ఉంది, విద్యుత్ తీగల పరిస్థితి, పోల్స్ మధ్య గ్యాప్ వంటి విషయాలను ఈ యాప్‌లో పొందుపరుస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో లైన్ల పునరుద్ధరణ పనులతో పాటు మెటీరియల్ సమకూర్చడం, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడం, త్వరితగతిన ఘటనా స్థలాన్ని గుర్తించడం లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

20, 21వ తేదీల్లో ప్రపంచ కమ్మ మహాసభలు

23 దేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న ప్రముఖులు


కమ్మ మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కెజీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో ప్రపంచ కమ్మ మహాసభలు హైటెక్స్‌లోని హైదరాబాద్ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు కెజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా సభలకు 23 దేశాలు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20వ తేదీన ప్రారంభోత్సవం చేస్తారని, అదేరోజు పెట్టుబడుల సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు దానికి ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. 21వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు నుంచి కమ్మ సామాజిక వర్గం నుంచి గెలిచిన 50 మంది ఎమ్మెల్యేలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక సెషన్, ముగింపు సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ.సుబ్బారావు, ఎమ్.భానుప్రసాద్, బి.శ్రీనివాస రాజు, ఎమ్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘నెక్ట్స్ జనరేషన్ కమ్యూనికేషన్స్ ఇన్ ఉర్దూ’

మూడు రోజులపాటు సెమినార్‌లు


కార్యక్రమ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఇబ్రహీం అలీ సిద్దిఖీ తదితరులు

బంజారాహిల్స్: భవిష్యత్ తరాల విద్యార్థులు టెక్నాలజీని స్థానిక భాషల్లో నేర్చుకునేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీయూ) సంస్థ కృషి చేస్తుందని సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషన్ బోర్డు మెంబర్ జస్టిస్ ఇబ్రహీం అలీ సిద్దిఖీ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నెక్ట్స్ జనరేషన్ కమ్యూనికేషన్స్ ఇన్ ఉర్దూ అనే అంశంపై మూడు రోజుల సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో విషయ విభాగాలలో ఉర్దూలో పుస్తకాలు ముద్రించబడి ఉన్నాయని, ప్రస్తుతం టెక్నాలజీ సంబంధిత విషయాల్లో ఉర్దూలో బోధించేందుకు, నేర్చుకునేందుకు వీలుగా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులో ఉర్దూ భాష పండితులతో పాటు ఉర్దూ భాష గురించి తెలిసిన మేధావులు అంశాలపై చర్చిస్తారని వారు తెలిపారు. ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, ఎంబీఏ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మి రావత్, డాక్టర్ అయేషానాజ్, సల్మా ఫౌజియా, మలిహా నాజ్, రిజిస్ట్రార్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగడ్డ రైతుబజార్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి


బోరబండలో పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

ఎన్నికల హామీల అమలులో భాగంగా రైతులకు మొదటి రుణమాఫీ చేసినందుకు కాంగ్రెస్ నాయకులు పలు ఏరియాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సి.రోహిణ్‌రెడ్డి


ముఖ్యమంత్రి రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వనం సంగీత

ప్రజాహితానికి పనిచేస్తే మంచి గుర్తింపు


అవార్డు అందుకుంటున్న ఆదినారాయణ

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేసే వారికి సమాజంలో సముచిత గౌరవం దక్కుతుందని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ మాజీ సంచాలకులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. ప్రజలకు అందించిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఆదిలీలా ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో అందిస్తున్న సేవలకుగాను ఆదినారాయణకు ఉత్తమ సేవారత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తులు, శక్తులు సంస్థలు స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు దారిద్ర్య రేఖ దిగువనున్న వారికి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, యోగా శిబిరాలు సాంస్కృతిక సమ్మేళనాలు వివిధ అంశాలపై సదస్సులు నిరంతరం నిర్వహిస్తున్నందువల్లే తమకు ఉత్తమ అవార్డు దక్కిందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తుల సేవలను మరింత విస్తృతం చేసి పేదలను ఆదుకుంటామని ఆదినారాయణ అన్నారు.

స్మోక్‌బార్‌లో పోలీసుల తనిఖీలు

భారీగా పట్టుబడ్డ నిషేధిత ఈ–సిగరెట్లు

బంజారాహిల్స్: నిషేధిత ఈ–సిగరెట్లను అడ్డదారిలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న స్మోక్‌బార్‌పై బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున నిషేధిత ఈ–సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో ‘ది స్మోక్ బార్’ పేరుతో నిర్వహిస్తున్న ఇక్కడ గత కొంతకాలంగా నిషేధిత ఈ–సిగరెట్లను కస్టమర్లకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్మోక్‌బార్ మేనేజర్ షేక్ ముదసర్ సిగరెట్లను విక్రయిస్తున్నట్లుగా గుర్తించి ఆయనపై కేసు నమోదు చేశారు. రూ.2.21 లక్షల విలువ చేసే 83 ఈ–సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిల్క్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శుక్రవారం (నేటి) నుంచి సిల్క్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సిల్క్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో పాటు వన్‌గ్రామ్‌గోల్డ్, పలు ఫ్యాన్సీ వస్తువులను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు.

బీసీల కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడం


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖను విడుదల చేస్తున్న రాజారాం యాదవ్ తదితరులు

పంజగుట్ట: కొంతమంది ప్రైవేట్ వ్యక్తులతో కోర్టులో కేసులు వేయించి బీసీలకు అన్యాయం చేసే కుట్రలు ముఖ్యమంత్రి పన్నుతున్నారని బీసీలకు అన్యాయం జరిగితే ఎంతటి త్యాగానికైనా వెనుకాడమని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే 6 నెలల్లో సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చారని, ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి విధి విధానాలు రూపొందించకుండా సాధ్యా అసాధ్యాల గురించి జానారెడ్డి సలహా తీసువాలని సూచించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జానారెడ్డి చరిత్ర మొత్తం బీసీలకు వ్యతిరేక చరిత్రనే అని ఆయన తప్పకుండా బీసీలకు అన్యాయమే చేస్తారనిన్నారు. వెంటనే ప్రొఫెసర్ సింహాద్రి, జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు లాంటి వారితో నిపుణుల కమిటీ వేసి కులగణన చెయ్యాలని డిమాండ్ చేశారు. కుల గణన జరిగితే బీసీల జనాభా ప్రకారం స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లు పెరుగుతాయని బీసీలు, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతారని తెలిపారు. వెంటనే నిపుణుల కమిటీ వేసి కుల గణన చేపట్టాలని లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ సమావేశంలో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, కొంపెల్లి రాజు, బొడ్డుపల్లి లింగం, మహేష్ గౌడ్, పిడికిలి రాజు, అశోక్, కె.వి.గౌడ్, ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని జీహెచ్ఎంసీ పార్కులో గంజాయి సేవిస్తున్న ఓ యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేయగా, పోలీసులు చూసిన మరో ఇద్దరు యువకులు పరారైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని శ్రీరామ్‌నగర్‌లో నివసించే బీ ప్రశాంత్ (23) తన స్నేహితుడు బాలు, సాయిలతో కలసి పార్కులో గంజాయి సేవిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ప్రశాంత్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే పోలీసులను చూసిన బాలు, సాయిలు పరారయ్యారు. గంజాయికి అలవాటుపడ్డ ఈ ముగ్గురు తాము తాగుతుండడమే కాకుండా అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. ఈజీ మనీ కోసం వీరు ధూల్‌పేట నుంచి గంజాయి తెస్తూ విక్రయిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. ప్రశాంత్‌కు మూత్ర పరీక్షలు చేయగా గంజాయి తాగినట్లుగా పాజిటివ్ రావడంతో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పరారైన బాలు, సాయిల కోసం గాలింపు చేపట్టినట్టు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

పార్కుల్లో మురుగు నీరు రానివ్వొద్దు

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



బంజారాహిల్స్: వర్షం కురిసిన సమయాల్లో భారీగా వరద నీరు వచ్చి వాకర్లు, సందర్శలకు ఇబ్బందులతోపాటు పార్కులోని వాకింగ్ ట్రాకులు దెబ్బతింటున్నాయని అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. లోటస్‌పాండ్ పార్కు చెరువులో మురుగు నీరు కలుస్తుందని వాకర్లు, సందర్శకులు ఫిర్యాదు చేయడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి గురువారం బంజారాహిల్స్‌లోని లోటస్‌పాండ్‌లో జలమండలి, ఇంజినీరింగ్, పార్కు విభాగం అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కులో చాలా చోట్ల వాకింగ్ ట్రాక్ దెబ్బతిన్నదని దాన్ని బాగు చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. కొన్ని చోట్ల గ్రీనరీ పెంచేందుకు అవకాశం ఉందని వెంటనే ఆ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను ఆదేశించారు. అదే విధంగా జూబ్లీహిల్స్‌లోని బటర్‌ఫ్లై గార్డెన్‌ను కూడా మరింత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పార్కులోకి వస్తున్న మురుగు నీటిని దారి మళ్లించాలని సూచించారు. జూబ్లీహిల్స్ 44/45 జంక్షన్‌లోని మంగోలియా బేకరీ వద్ద వర్షం వచ్చిన ప్రతీసారి వర్షం నీరుతో పాటు మురుగు నీరు నిలుస్తున్నదని చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో అక్కడి పరిస్థితి గురించి అధికారులను ప్రశ్నించారు. ప్రతిపాదనలు రూపొందించామని టెండర్ ప్రాసెస్‌లో ఉందని త్వరలోనే ఇక్కడ పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జలమండలి జీఎం హరి శంకర్, సర్కిల్–18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, పార్కుల విభాగం అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్‌వర్క్స్ టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి : కమిషనర్

◆ జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో చేపట్టిన వివిధ సివిల్‌వర్క్స్ టెండర్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె సర్కిల్ పరిధిలో అధికారులతో కలిసి పర్యటించారు. లోటస్‌పాండ్‌లోని సీవరేజీ కనెక్షన్లు తొలగించాలని, నాలాల్లో స్ట్రామ్ వాటర్ ఫ్లోటింగ్ మెటీరియల్ రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైటెన్షన్ వైర్ల దిగువన ఉన్న అన్ని పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలని యూబీడీ అధికారులకు సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 44, 45లలో మంగోలియా బేకరీ వద్ద గల పార్కులో క్రీడా మైదానం ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయో లేవో పరిశీలించాలన్నారు. ఇక్కడ సీవరేజీ పనులు చేపట్టడానికి సంబంధించిన సివిల్ వర్క్ టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

దోమలు పెరిగే హాట్‌స్పాట్‌లపై దృష్టి..

నగరంలో దోమలు ఉత్పత్తి జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి గురువారం ఆమె వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ.. డెంగీ నివారణలో భాగంగా పాఠశాల, కళాశాలల్లో చేపట్టే అవగాహన కార్యక్రమాలను వెంటనే పూర్తి చేసి, హాట్‌స్పాట్‌లపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా బస్తీలు, భవన నిర్మాణ స్థలాల వద్ద పనిచేసే కార్మికులు, వసతి గృహాల్లో, ఓపెన్ స్థలాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటోడ్రైవర్ నిర్దేశించిన ప్రకారంగా చెత్త సేకరణ, డైలీ హాజరు అయిన వారికి సర్కిల్, జోన్ వారీగా గుర్తించి అవార్డులు ప్రదానం చేయాలని శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ వద్దు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆగ్రహం



మాట్లాడుతున్న డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, డాక్టర్ విజయరావు

సుల్తాన్‌బజార్: ఆర్ఎంపీ, పీఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ పారా మెడికల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడంపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ మేరకు కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కాళీ ప్రసాదరావు, డాక్టర్ విజయరావు మాట్లాడారు. ఆధునిక వైద్యం గురించి ఏమీ తెలియని ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రజారోగ్యంలో స్వల్పకాలిక శిక్షణ ఇవ్వడం వలన ప్రజలకు హాని జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ పొందిన ఆధునిక వైద్యులను నియమించి ప్రభుత్వం ఆరోగ్య సదుపాయాలను మెరుగుపర్చాలన్నారు. తాము ఈ ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో వైద్య కళాశాలను ప్రారంభించి వైద్యులను తయారు చేసి ప్రజారోగ్యానికి చేయూత అందిస్తున్న సమయంలో నాటు వైద్యులకు శిక్షణ ఇవ్వడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. వీరికి శిక్షణ సర్టిఫికెట్లపై తాము గతంలోనే హైకోర్టుకు వెళ్లామని, ఇప్పటి వరకు దీనిపై స్టేఆర్డర్ ఉందని ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తే ఐఎంఏ న్యాయపరంగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ రాజేంద్రకుమార్, ద్వారకానాథ్, అశోక్‌రెడ్డి, యశ్వంత్‌రావు, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

కలెక్టర్‌కు అవిశ్వాసంపై నోటీసులు అందజేసిన కార్పొరేటర్లు



మేడిపల్లి: పీర్జాగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం 19 మంది కార్పొరేటర్లతో కలిసి మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసులు అందజేశారు. కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మాజీ మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కుల గణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచాలి

సాక్షి, సిటీబ్యూరో: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కామారెడ్డి డిక్లరేషన్ హామీని తక్షణమే అమలు చేయాలని వివిధ ప్రజాసంఘాలకు చెందిన ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రెండు నెలలుగా బీసీ జనసభ, బీసీ కులాలు, బీసీ సంఘాలు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కులగణనపైన స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదని, విధివిధానాలను రూపొందించలేదని పేర్కొన్నారు. ఈ మేరకు బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు కరుణాకర్ ముదిరాజ్, అడ్వొకేట్ జేఏసీ అధ్యక్షుడు గోవర్ధన్, ఎంబీసీ జాతీయ సంఘం కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు మేకల కృష్ణ తదితరులు ప్రభుత్వ వైఖరిపట్ల నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కులగణన చేపట్టకుండా న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. సమగ్ర కులగణనను అటకెక్కించి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండానే ఎన్నికలకు వెళ్లాలనే వ్యూహంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. సామాజిక శాస్త్రవేత్తలు, న్యాయకోవిదులైన ఉస్మానియా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, మాజీ న్యాయమూర్తులు జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు నేతృత్వంలోనే నిపుణుల కమిటీ వేయాలని కోరారు.

బొగ్గు బావుల వేలం రద్దు చేయాలి

ఖైరతాబాద్: కేంద్ర ప్రభుత్వం బొగ్గుబావుల వేలం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో రాజ్‌భవన్ ముట్టడికి ప్రయత్నించిన ఏఐటీయూసీ నాయకులను ఖైరతాబాద్ పోలీసులు రైల్వే గేట్ వద్ద అరెస్టు చేశారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే పదో విడత బొగ్గు బావుల వేలం ప్రక్రియ ప్రారంభించిందని, అందులో భాగంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కూడా వేలం పెట్టడాన్ని తెలంగాణ కార్మికవర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, రాష్ట్రంలోని బొగ్గు బావులను కేంద్రప్రభుత్వం సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల ప్రైవేటీకరణ ద్వారా వేల కోట్లు సంపాదించాలని చూస్తోందని, తెలంగాణకు సింగరేణి కొంగు బంగారంగా ఉందని, 40వేల మంది శాశ్వత ఉద్యోగులు, 26వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందన్నారు. బొగ్గు బావుల ప్రైవేటీకరణ వల్ల సింగరేణికి, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఆయా సంఘాల నాయకులను ఖైరతాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.

జాతర నిర్వహణలో సహకరించాలి

జోగినిలతో దేవాదాయ శాఖ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: ఆషాఢ మాసం బోనాలు సందర్భంగా ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ కోరారు. దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జోగినిలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జోగినిలతో ప్రభుత్వం మొదటిసారి ఇలాంటి సమావేశాన్ని నిర్వహించింది. ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని జోగినిలు అంగీకరించారు. లా అండ్ ఆర్డర్ కాపాడటం చాలా ముఖ్యమని, ఈ విషయం గమనించాలని వారికి అధికారులు సూచించారు. జోగినిలు, శివశక్తులతో పాటు గరిష్ఠంగా ఐదుగురిని అనుమతించనున్నట్లు తెలిపారు. అడిషనల్ సీపీ విక్రంసింగ్ మాన్, నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ యం.హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమావేశంలో పాల్గొన్నారు. జోగినిలు శ్యామల, వైష్ణవి, రాధిక, వెన్నెల, విశాఖ, శ్రుతి, క్రాంతి తదితరులు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

నగరవాసులపై అదనపు భారం ఇది | భారీగా పెరిగిన నెలవారీ ఖర్చులు | పప్పు దినుసులతో పరేషాన్ | నింగినంటిన కూరగాయలు | నడ్డివిరుస్తున్న నిత్యావసరాలు | లబోదిబోమంటున్న నగటు జీవులు

నెలకు రూ.120 కోట్లు



రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల నడ్డివిరుస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు వచ్చేశాయి. నెల రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏ కూరగాయ పట్టుకున్నా కిలో రూ.80 పైనే ఉంది. తాజాగా పప్పుదినుసులు సైతం అదే దారిలో పయనిస్తున్నాయి. కంది, మినప, పెసర, సెనగ వంటి పప్పుదినుసులు కిలోకు రూ.170 నుంచి రూ.250కి చేరింది. ఆర్గానిక్ ఉత్పత్తులు కావాలంటే మాత్రం కిలోకు రూ.300కుపైగా వెచ్చించాల్సి వస్తోంది. పెరిగిన ధరల ఫలితంగా పట్టణ ప్రజలపై నెలకు దాదాపు రూ.120 కోట్ల అదనపు భారం పడుతోందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.–సాక్షి, సిటీబ్యూరో

మార్కెట్‌లో కంది పప్పు సాధారణంగా క్వాలిటీని బట్టి కేజీ రూ.60 నుంచి రూ.80 అదనంగా పెరిగింది. మినుములు కేజీకి రూ.50 నుంచి రూ.70 అదనపు భారం పడుతోంది. పొట్టుతీసిన మినపగుళ్ల కొన్ని బ్రాండ్‌ల ధర రూ.229 వరకు అమ్ముతున్నారు. పెసర పప్పు కిలో రూ.50 నుంచి రూ.80 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. శెనగపప్పు సైతం కేజీ రూ.110 విక్రయిస్తున్నారు. దీనికి తోడు గత నెల రోజుల నుంచి కూరగాయల ధరలు మండుతూనే ఉన్నాయి. ఉల్లి కిలో రూ.45 నుంచి రూ.60 పలుకుతోంది. టమాటా రూ.55 నుంచి రూ.60 అమ్ముతున్నారు. బంగాళాదుంపలు రూ.45 నుంచి రూ.60, క్యాప్సికం రూ.58 నుంచి రూ.79, క్యాబేజీ రూ.60, క్యారెట్ రూ.80, వంకాయలు రూ.70 నుంచి రూ.80, బెండకాయ రూ.66, వెల్లుల్లి రూ.250, మునగకాడలు (3) రూ.20కి అమ్ముతున్నారు. షాపింగ్ మాల్స్‌లో ఈ ధరలు కిలోకు మరో రూ.5 నుంచి రూ.10 వరకు ఎక్కువగా ఉంటోంది.

★ నగరంలో దాదాపు 1.30 కోట్ల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారని అంచనా. ఒక వ్యక్తి నెలకు సరాసరిన 8.8 కేజీల కూరగాయలు వినియోగిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఈ లెక్కన నెలకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరమవుతున్నాయి. సాధారణ ధరలతో పోల్చితే ప్రస్తుతం కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయి. సరాసరిన కేజీకి రూ.10 అదనంగా చెల్లించినా నెలకు సుమారు రూ.115 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. అదే సమయంలో కంది, పెసర, మినప, సెనగ, ఇతర పప్పులు కేజీకి రూ.20 నుంచి రూ.60 పెరిగింది. పప్పు దినుసుల ధరలను పరిగణనలోకి తీసుకుంటే మరో రూ.5 కోట్ల వరకు అదనపు వడ్డింపు కనిపిస్తోంది. మొత్తం కలిపితే నగర ప్రజలు నెలకు దాదాపు రూ.120 కోట్ల అదనపు భారం మోయాల్సివస్తోంది.

వర్షాభావ పరిస్థితులతో..

గత ఏడాది రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ధరల పెరుగుదలకు కారణమంటూ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో పంట దిగుబడులు తగ్గడంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలపై కూరగాయలు, పప్పుదినుసుల కోసం ఆధారపడాల్సి వస్తోంది. దిగుమతి చేసుకునే సమయంలో రవాణా చార్జీలు, లోడింగ్ అన్‌లోడింగ్, మార్కెట్ ఫీజు, ఇతర ఖర్చులు అన్నీ వినియోగదారుడిపైనే భారం వేస్తున్నారు. దీంతో సాధారణ ధరలతో పోలిస్తే కొన్ని కూరగాయలు రెట్టింపు ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల ప్రభావంతో స్థానిక రైతులకు మాత్రం ప్రయోజనం చేకూరడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

	రెండు నెలల క్రితం	ప్రస్తుతం (కిలో రూపాయల్లో)
కంది పప్పు	105-120	160-250
పెసర పప్పు	96-116	130-180
మినపపప్పు	115-130	170-190
సెనగపప్పు	69-78	110

గతంలో ఎన్నడూ లేని ధరలు..

మార్ట్‌లో సరుకుల కోసం వెళితే అన్నింటి ధరలూ భారీగా పెరిగాయి. రెండు నెలల క్రితం వెళ్లినప్పటికీ ఇప్పటికి పప్పుల ధర కేజీకి రూ.60 వరకు పెరిగింది. కూరగాయల ధరలైతే గడిచిన రెండు నెలల నుంచి వారపు సంతలో కేజీ రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. ఒక్కోసారి బిల్లు చూస్తే భయమేస్తోంది. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ధరలు పెరగడం చూడలేదు.

– డి.మనోజ్‌కుమార్, మణికొండ



తొందరలోనే తగ్గుతాయి.

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కూరగాయల దిగుబడులపై ప్రభావం కనిపిస్తోంది. టమాటా, పచ్చిమిర్చి వంటివి అధిక ధరలు పలుకుతున్నాయి. తొందరలోనే ధరలు తగ్గే అవకాశం ఉంది.

– విజయానందరెడ్డి, వ్యాపారి, గుడిమల్కాపూర్ మార్కెట్



నగరంలో నేడు

- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సాంఘిక న్యాయం – రాజ్య సమానత్వం – రాజ్యాంగం సమాలోచన సభ జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ ఐక్య సంఘటన నిర్వహించే సభలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు టి.రాధా, విద్యాసాగర్, అంగళకుర్తి, ప్రభాకర్ పాల్గొంటారు.
- సాయి సేవా సంఘ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2.15 గంటలకు ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియోలో టచింగ్ హార్ట్స్‌పై సమావేశం జరుగుతుంది.
- నాగ్ వి ఆర్ట్ కలెక్షన్స్‌పై మధ్యాహ్నం 3 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

ఆన్‌లైన్‌లో నీటి బిల్లులు చెల్లించండిలా..

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్(HMWSSB) అధికారిక వెబ్‌సైట్ https://www.hyderabadwater.gov.in/లోనికి వెళ్లండి. హోమ్‌పేజీలో Services(సేవలు) ట్యాబ్ ఆప్షన్‌పై క్లిక్‌చేసి.. కస్టమర్ సర్వీసెస్ ఆప్షన్(వినియోగదారుల సేవలు)లో.. Pay Your Bill Online(ఆన్‌లైన్ బిల్లు చెల్లింపు)పై క్లిక్ చేయండి. తదుపరి పేజీలో.. చెల్లించడానికి తగిన లింక్‌ను (Bill Desk లేదా Official Govt Wallet)క్లిక్ చేయండి.

◆ మీరు అధికారిక ప్రభుత్వ వాలెట్‌ని ఎంచుకుంటే HMWSSB వాటర్ బిల్ పేజీ ఓపెన్ అవుతుంది. అక్కడ మీరు CAN నంబర్‌ను నమోదు చేసి, "Request for Bill ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం స్క్రీన్‌పై నీటి బిల్లు వివరాలు కనిపిస్తాయి. వాటిని తనిఖీ చేసి చెల్లించండి.

బిల్ డెస్క్ ద్వారా చెల్లింపులు..

బిల్‌డెస్క్‌ను ఎంచుకుంటే.. HMWSSB వాటర్ బిల్ పేజీ ఓపెన్ అవుతుంది. అక్కడ మీరు CAN నంబర్‌ను నమోదు చేసి, 'Submit ఆప్షన్‌పై క్లిక్‌చేయాలి. స్క్రీన్‌పై నీటి బిల్లు వివరాలు కనిపిస్తాయి.

ఫేస్ రికగ్నైజేషన్ సిస్టంతో విద్యార్థుల హాజరు

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



పాఠశాలను సందర్శించి సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల హాజరును ఫేసియల్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) యాప్‌లో నమోదు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. లంగర్‌హౌస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి అమ్మ ఆదర్శ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వాటర్ ట్యాంక్, డ్రైనేజ్, ఎలక్ట్రికల్ పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చదును చేసి టాయిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, మొక్కలను ట్రిమ్ చేసి పాఠశాలను అందంగా తీర్చిదిద్దాలని, పాఠశాలలో ఏమైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేపట్టాలని అన్నారు. డిప్యూటీ ఐఓఎస్, డీఓఐఓఎస్, డిప్యూటీ డీఈఓ, డీఈఓలు పాఠశాలలను సందర్శించినప్పుడు అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్(ఏజీఆర్)లో ఫైండింగ్స్ నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను మోడల్ పాఠశాలగా అందంగా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రోహిణి, డిప్యూటీ డీఈఓ సీహెచ్ రమణరావు, డిప్యూటీ ఐఓఎస్ మక్బుల్ హుస్సేన్, హెడ్ మాస్టర్ ఉమారాణి, ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'స్కూల్స్'ను సందర్శిస్తున్నారు

● జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పనులు, ఇతర కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు నియమించిన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన స్కూల్స్‌ను సందర్శిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఈవో వివరణ ఇచ్చారు. స్పెషల్ ఆఫీసర్లు షెడ్యూల్ ప్రకారం పాఠశాలలను సందర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు 9,31,339 పాఠ్యపుస్తకాలు, 4,90,174 నోట్ పుస్తకాలు, 1,71,515 వర్క్ బుక్‌లను 1,05,281 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. 7వ తరగతి ద్వితీయ భాష తెలుగు పాఠ్యపుస్తకాలు ముద్రణ కాకపోవడంతో సరఫరా కాలేదన్నారు. వాటిని కూడా త్వరగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సుమారు 1,05,281 మంది ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పనుల కింద 384 పాఠశాలలకు గాను 255 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 129 పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటం



కోఠి డీఎంహెచ్ఎస్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్‌లో 17 ఏళ్లుగా పనిచేస్తున్న 2వ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసేంత వరకు ఏఐటీయూసీ పోరాడుతూనే ఉంటుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ వెల్లడించారు. 2వ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ.. కోఠిలోని డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. ఒక్కసారిగా ఏఎన్ఎంలు డీఎంహెచ్ఎస్ ప్రాంగణానికి చేరుకోవడంతో స్థానిక సుల్తాన్‌బజార్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఏఎన్ఎంలను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసేదాకా తమ ఆందోళన ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, బోయిని శ్యామల, పద్మ, జయమ్మ, హారతి, రాజేశ్వరీతో పాటు పెద్ద ఎత్తున ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ క్రిష్ణా వేదికగా ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగే ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. సౌందర్యవంతమైన వస్త్రాలతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను గురువారం ఎగ్జిబిషన్ డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు.

ఆర్టీఏలో తుదిదశకు బదిలీల ప్రక్రియ

- ముగిసిన కౌన్సెలింగ్
- మరో రెండు రోజుల్లో స్థానచలనం
- ఏళ్లుగా కొనసాగుతున్న వారికి స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏలో బదిలీల ప్రక్రియ తుదిదశకు చేరింది. అన్ని ప్రభుత్వ విభాగాల్లో సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వారం, పది రోజులుగా వివిధ విభాగాల్లో బదిలీలపైన ఉన్నతాధికారులు కసరత్తు చేపట్టారు. నాలుగేళ్లు దాటిన వారికి ఈ బదిలీల్లో తప్పనిసరిగా స్థానచలనం కల్పించనున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, పరిపాలనా అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితర క్లరికల్ విభాగానికి చెందిన సిబ్బంది ఈసారి పెద్ద సంఖ్యలో బదిలీ కానున్నారు. రెండు రోజుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగుల బదిలీలపైన రవాణా కమిషనర్ నేతృత్వంలో జేటీసీలతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వారం, పది రోజులుగా బదిలీలపై కసరత్తు చేస్తోంది. మొదట ఉద్యోగుల నుంచి ఆప్షన్లను స్వీకరించారు. వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, యూనిట్ కేంద్రాల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల నుంచి బదిలీలపై ప్రాధాన్యతాక్రమంలో నాలుగు స్థానాలను ఎంపిక చేసుకొనే అవకాశం కల్పించారు. అలాగే వారు ఎంపిక చేసిన ఆప్షన్ల ఆధారంగా కౌన్సెలింగ్ కూడా నిర్వహించారు. దీంతో అన్ని దశలను దాటుకొని ప్రస్తుతం ఈ ప్రక్రియ తుదిదశకు చేరింది.

పదేళ్లుగా ఒకే చోట..

గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి సాధారణ బదిలీలు లేకపోవడంతో చాలామంది ఉద్యోగులు ఏళ్లతరబడి ఒకేచోట పని చేస్తున్నారు. కొందరు పదేళ్లుగా ఒకే కార్యాలయంలో ఒకే విధమైన విధులను నిర్వర్తిస్తుండగా, మరి కొందరు ఐదారు సంవత్సరాలుగా పని చేస్తున్నారు. దీంతో తమకు నచ్చని చోట పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు ఈ పదేళ్లలో ఎలాంటి బదిలీలు లేక తీవ్ర నిరాశ నిస్పృహలకు గురయ్యారు. ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా నచ్చిన ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అలాగే నిబంధనల మేరకు ఉద్యోగుల నుంచి ఆప్షన్లను స్వీకరించినప్పటికీ వాటికి ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందనే అంశంపై కూడా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

◆ ఒకవైపు అనేక సంవత్సరాలుగా ఎలాంటి బదిలీలకు నోచుకోకుండా పడిగాపులు కాస్తున్నవారు బదిలీలపై ఎన్నో ఆశలు పెట్టుకోగా, ఇప్పటి వరకు ఒకేచోట పనిచేస్తూ పాతుకుపోయిన వాళ్లు మాత్రం అక్కడి నుంచి కదిలేందుకు అయిష్టంగానే అంగీకరించడం గమనార్హం. ఇలా ఐదారేళ్ల నుంచి పదేళ్ల వరకు ఒకేచోట పని చేస్తున్న వారంతా ఇప్పుడు కూడా తమకు నచ్చిన స్థానాల కోసం పోటీ పడటం గమనార్హం.

◆ గ్రేటర్ హైదరాబాద్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న సుమారు వంద మందికి పైగా ఉద్యోగులు, మరో ప్రాంతీయ రవాణా అధికారి బదిలీ కానున్నారు. అలాగే ఇప్పటి వరకు బదిలీకాకుండా ఉండిపోయిన కొంతమంది మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు కూడా స్థానచలనం జరగనుంది.

గతంలో అన్నీ ఓడీలే..

గతంలో రవాణాశాఖలో ఆన్ డెప్యూటేషన్ బదిలీలే పెద్ద ఎత్తున జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిన ఈ ప్రక్రియ పైరవీలకు ప్రధాన కేంద్రంగా మారింది. చాలామంది ఎంవీఐలు, ఏఎంవీఐలు చెక్‌పోస్టుల్లో పోస్టింగ్ కోసం పెద్ద ఎత్తున పోటీపడ్డారు. ఈ క్రమంలో రూ.లక్షల్లో అక్రమాలు జరిగినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. మరోవైపు ప్రాంతీయ రవాణా అధికారులు, పరిపాలనా అధికారుల బదిలీలు సైతం ఆన్ డెప్యూటేషన్ పద్ధతిలోనే జరిగాయి. దీంతో సీనియార్టీ ప్రకారంగా నిజాయతీగా బదిలీ కావాల్సిన ఎంతో మందికి అన్యాయం జరిగింది. అదే సమయంలో రూ.లక్షలు వెచ్చించిన వారికి నచ్చిన పోస్టులు దక్కాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆన్ డెప్యూటేషన్ బదిలీలను రద్దు చేసింది. దీంతో చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న అధికారులంతా తమ స్థానాల్లోకి వచ్చేశారు. అనంతరం వివిధ ప్రాంతాలకు వారిని బదిలీ చేశారు. ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా అన్ని కేటగిరీల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

థ్యాంక్యూ సీఎం సార్..

రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



గట్టు పంచాయతీని రాజకీయ లబ్ధికి వాడుకోవడం సిగ్గుచేటు

- మెదక్ పార్లమెంట్ కంటెస్టెంట్ అభ్యర్థి నీలం మధు
- నిమ్స్‌లో రైతు కిష్టయ్యకు రూ.లక్ష ఆర్థిక సాయం



రైతు కిష్టయ్యను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ తదితరులు

లక్డీకాపూల్: ఇద్దరు రైతుల మధ్య గట్టు పంచాయతీని రాజకీయాల కోసం వాడుకోవడం సిగ్గుచేటని మెదక్ పార్లమెంట్ కంటెస్టెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గజ్వేల్‌కు చెందిన రైతు కిష్టయ్యను గురువారం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. భూమి పంచాయతీలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కిష్టయ్యకు మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యులను కోరారు. తక్షణ సహాయం కింద రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. చిన్న భూపంచాయతీని అదనుగా చేసుకొని మాజీ మంత్రి హరీష్‌రావు రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దమ్మక్కపల్లికి చెందిన రైతు కిష్టయ్యకు పక్కన రైతుతో గట్టు పంచాయతీ ఉండటంతో సర్వే నిర్వహించారని, అయితే పక్క రైతు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సర్వేలో తనకు అన్యాయం జరిగిందని కిష్టయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడటం బాధాకరం అన్నారు. ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం తగదన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అంక్ష రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు లింగారావు, నేతలు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సర్దార్ ఖాన్, సమీర్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధనకు చలో పార్లమెంట్



బీసీల చలో పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 6న చలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన గురువారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీల చలో పార్లమెంట్ పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావుతో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చేనెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష పార్టీల నేతలను, వివిధ పార్టీల ఎంపీలను కలిసి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. బీసీ బిల్లు సాధన కోసం తెలంగాణ ఉద్యమం తరహాలోనే బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలను బీసీ ఉద్యమంలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలను వీడి బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై తమ మొండి వైఖరి మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, నందగోపాల్, గొరిగె మల్లేష్, జయంతి, ఉదయ్, అంజి, సతీష్, జ్యోతి, సీతారత్నం, రఘుపతి, శివమ్మ, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రక్షణ, సదుపాయాలు కల్పించాలి

● హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: కౌలు రైతులకు కూడా అన్ని రకాల రక్షణ, సదుపాయాలు కల్పించాలని, మృతిచెందిన రైతు కుటుంబాలకు ఇస్తున్న పరిహారం పెంచి కౌలురైతులకు కూడా వర్తింపజేయాలని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రభుత్వానికి సూచించారు. ఆత్మహత్య పరిష్కారం కాదు, ఆలోచించి కష్టాలను అధిగమించాలి అనే నినాదంతో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఐదుగురు రైతు కుటుంబాలకు జస్టిస్ చంద్రకుమార్ చేతులమీదుగా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016లో ప్రారంభమైన రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఎంతో మంది రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తప్ప మరెవరూ కౌలు రైతులను గుర్తించేందుకు ముందుకు రాలేదని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం కౌలు రైతుల పట్ల ఎలా వ్యవహరించిందో.. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందన్నారు. జీఎల్.నర్సింహారావు, సోమిడి శ్రీనివాస్, పాశం యాదగిరి, పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, అంబు రాథోడ్, సూర్యప్రకాష్, దేవరకొండ నాగరాజు, ఏలేశ్వరం వెంకటేశ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ సీసా.. కళా పిపాస

స్క్రాప్ మందు సీసాలతో కళారూపాలు

కుందన్లు, బంక మట్టి, రంగులతో కళా ఖండాలు


కాదేదీ సృజనాత్మకతకు అనర్హం అన్నట్లు

ఫిట్ నెస్ ట్రైనర్ అను ప్రసాద్

ఆమెకు ఖాళీగా ఉండాలంటే అస్సలు ఇష్టం ఉండదు. చిన్నప్పటి నుంచి ఏదో ఒక కళాత్మక రూపాలు చేయడం అంటే చాలా ఆసక్తి.. బ్లేడులతో రథాలు చేయడం, 5 పైసల నాణేలతో పడవలు చేయడం అలవాటు. ఇక మందు సీసాలు ఖళీగా కనిపిస్తే చాలు కళా ఖండాలు చేస్తుంటారు. కుందన్లు, బంక మట్టి, రంగులు, అద్దాలతో సీసాలను అద్భుతమైన కళా ఖండాలుగా మలుస్తారు. ఇంటి డెకరేషన్ చేసకోవాలంంటే వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. కానీ ఆమె మాత్రం ఎంత బిజీగా ఉన్నా తన ఇంటిని తనకు నచ్చిన విధంగా డెకరేట్ చేసుకుంటారు. ఫిట్ నెస్ ట్రైనింగ్ ఆమె వృత్తి, కానీ ఆమె ప్రవృత్తి మాత్రం ఇలా కళాఖండాలు రూపొందించడమే.. అంటున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

ఆమె ఇంట్లోకి అడుగు పెడితే చాలు గుమ్మం నుంచి తోరణాల వరకూ అలంకరణలతో ఇంటిని అందంగా మలుచుకున్నారు. కప్ బోర్డుల నిండా ఆమె తయారు చేసిన కళాఖండాలు దర్శనం ఇస్తుంటాయి. గోడల నిండా ఆమె సొంతంగా తయారుచేసిన పెయింటింగ్స్, బుద్ధుడి ప్రతిమలతో కళాత్మకత ఉట్టిపడుతుంది. ఏ మూల చూసినా కూడా ఆమె చేసిన కళా ఖండాలతో అద్భుతమైన కళాత్మకత ఉట్టిపడుతుంది. కంట్రీక్లబ్ లో మెంబర్ షిప్ ఉండటంతో అక్కడి నుంచి ఖాళీ బాటిళ్లను సేకరిస్తుంటారు. ఒక్కో బాటిల్ ను ఒక్కో రూపంలో కళాత్మకంగా తీర్చిదిద్దుతారు.






కళతో డిప్రెషన్ దూరం..

ఈ రోజుల్లో చాలామంది పిల్లలు డిప్రెషన్ తో బాధపడుతున్నారు. ఖాళీ సమయాల్లో ఏదైనా కళాత్మకమైన పనులు చేస్తుంటే డిప్రెషన్ తగ్గుతుంది. పిచ్చి పిచ్చి ఆలోచనలు రాకుండా ఉంటాయి. అలాంటి సమయాల్లో సృజనాత్మకత ఎంతో ఊరటనిస్తుంది. నాకు చాలా సమయాల్లో మానసిక ప్రశాంతతను ఇచ్చింది. కొందరు జాబ్ చేసుకుంటూ అస్సలు సమయం లేదంటారు. కానీ ఏదో ఒక పని చేసుకుంటూ బిజీ అయిపోతే ఎలాంటి డిప్రెషన్స్ దరిచేరవు. - అను ప్రసాద్, ఫిట్ నెస్ ట్రైనర్

హైదరాబాద్‌తో పాటు బెంగుళూరు, చెన్నై, ఢిల్లీ, గోవా, కొచ్చి, అహ్మదాబాద్, కోల్‌కతా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్) 2024 సీజన్‌లో బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్ భాగం కానున్నారు. ఢిల్లీ నగర ఫ్రాంచైజీ స్పీడ్ డెమన్స్ ఢిల్లీ యజమానిగా అర్జున్ కపూర్ మోటార్‌స్పోర్ట్స్ రంగంలోకి ప్రవేశించారు. భారత దిగ్గజ క్రికెటర్ సౌరవ్ గంగూలీ ఈ మధ్యనే కోల్‌కతా జట్టు యజమానిగా మారగా, మోటార్ స్పోర్ట్స్ కార్లను విపరీతంగా ఇష్టపడే అర్జున్ కపూర్ రాకతో ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ క్రికెట్, సినీ గ్లామర్‌ను పెంచుకుంది. అయితే హైదరాబాద్ జట్టు యజమాని ఎవరనే విషయంలో ఇంకా మీమాంశ కొనసాగుతుంది. రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో రెండు ప్రధాన ఛాంపియన్‌షిప్‌లు ఉంటాయని ఆర్‌పీపీఎల్ చైర్మన్ అఖిలేష్ రెడ్డి తెలిపారు. ఒకటి ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్), రెండోది ఫార్ములా 4 ఇండియన్ ఛాంపియన్‌షిప్ (ఎఫ్4ఐసీ). ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ వరకూ ఈ రేసింగ్ కొనసాగనుందని పేర్కొన్నారు.

రేసింగ్‌లోకి అర్జున్ కపూర్..



మాదాపూర్: స్థానిక చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం కళాకారిణి చైతాలిమాజీ వేసిన చిత్రాలను డివైన్ ఆరా, ఇన్నర్ వాయిస్ పేరిట ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను కళాకారులతో కలసి తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ స్మితాసబర్వాల్ ప్రారంభించారు. చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో ప్రతి చిత్రం అద్భుతంగా ఉందని కొనియాడారు. 47 రకాల చిత్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు ఉంటుంది. ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు యంవి రమణారెడ్డి పాల్గొన్నారు.



డివైన్ ఆరా, ఇన్నర్ వాయిస్ చిత్రప్రదర్శన..



చప్పట్లతో ఎన్నో ఆరోగ్య లాభాలు

నగరవాసుల వ్యాయామంలో దైనందిన ప్రక్రియ

వాకర్స్ క్లబ్స్ తరహాలో క్లాపింగ్ క్లబ్స్

విభిన్న రకాల ప్రయోజనాలున్నట్టు అధ్యయనాల్లో వెల్లడి..

కనపడని దేవుడిని కీర్తిస్తూ భజన చేస్తే ఆనందం లభిస్తుంది. ఇతరుల టాలెంట్‌ను అభినందిస్తూ హర్షధ్వానాలు చేస్తే ఆహ్లాదం లభిస్తుంది. అంతేనా మన కోసం మనం చప్పట్లు కొడితే ఆరోగ్యం లభిస్తుంది.. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజమే.. రెండు చేతులూ కలిస్తే చప్పట్లు అని మనకు తెలుసు. ఆ చప్పట్లు మన దైనందిన జీవితానికి తోడైతే ఆరోగ్యానికి మెట్లు అని తేల్చి చెబుతున్నాయి పలు అధ్యయనాలు. ఈ క్రమంలోనే ఇప్పుడు నగరంలోని లాఫింగ్ క్లబ్స్, వాకర్స్ క్లబ్స్..తమ యాక్టివిటీస్‌లో భాగంగా తాత్కాలిక క్లాపింగ్ క్లబ్స్‌గా కూడా మారిపోతున్నాయి.

-సాక్షి, సిటీబ్యూరో

క్లాప్.. క్లాప్.. హుర్రే..

కళా ప్రదర్శనలో, బహిరంగ సభలో, సినిమా హాల్లో.. త్రమే కాదు బడి నుంచి గుడి వరకూ కాదేచోటూ కరతాళధ్వనులకు అనర్హం. సైకలాజికల్ అండ్ బిహేవియరల్ సైన్స్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం... అనేక రకాల శారీరక, మానసిక రుగ్మతలకు చప్పట్లు ఒక సులభమైన చికిత్సగా మారుతోంది. ఇప్పుడిప్పుడే దీన్ని గుర్తిస్తున్న నగరవాసులు డైలీ క్లాప్స్‌కి క్లాప్ కొడుతున్నారు. దీంతో ఈ మధ్య కాలంలో పార్కుల్లో ఉదయం/సాయంత్రం వేళల్లో ఒకేచోట చేరే వివిధ రకాల సమూహాల తప్పనిసరి వ్యాపకాల్లో ఇదొకటిగా మారింది. కొందరు నవ్వడంలో మునిగిపోతే మరికొందరు చప్పట్లు కొట్టడంలో బిజీగా ఉంటున్నారు.



చప్పట్లు.. లాభాలెన్నో రెట్లు..

మన శరీరం అనేది వ్యాపించి ఉన్న నరాలు, రక్త నాళాల కట్టలాంటిది అనేది తెల్సిందే. అంతేకాదు మనకు తెలిసిన అత్యంత క్లిష్టమైన నెట్‌వర్క్‌లో దేహం కూడా ఒకటి. దేహంలోని ప్రతి కణం మరొకదానితో ముడిపడి ఉంటుంది. రిమోట్‌గా లింక్ చేయబడినట్లు ఒక అవయవంపై పడే మంచి/చెడు ప్రభావం మరొకదానిపై ప్రభావం చూపుతుంది, అదే క్రమంలో అరచేతులు నిర్దిష్టంగా నరాల రక్తనాళాల చివర్లను కలిగి ఉంటాయి. చప్పట్లు కొట్టడం ద్వారా వాటిని ప్రేరేపించడం వల్ల మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థ దిగువ వీపు వంటి అవయవాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

'అరచేతుల్లో 30కు పైగా ఆక్యుప్రెషర్ పాయింట్లు ఉన్నాయి. అవి మనం చప్పట్లు కొట్టినప్పుడు యాక్టివేట్ అవుతాయి' అని సర్టిఫైడ్ కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ప్రాక్టీషనర్ సుకన్య బిస్వాస్ అంటున్నారు. వీపు, మెడ, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కడుపు మొదలైన వాటితో సహా వివిధ అవయవాలను ఈ పాయింట్లు కలుపుతాయి. దీంతో క్రమం తప్పకుండా చప్పట్లు కొట్టడం వల్ల వివిధ అవయవాలకు రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. మొత్తం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచి, రక్తపోటును నియంత్రిస్తుంది. అవయవాలను అనుసంధానించే నరాల చివర్ల పనితీరును మెరుగుపరచడం ద్వారా ఆస్తమా సంబంధిత సమస్యల పరిష్కారంలో కూడా చప్పట్లు సహాయపడతాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. చప్పట్లు కొట్టడం వెన్నునొప్పి, నడుము నొప్పుల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చు. డిప్రెషన్ ఆందోళన వంటి మానసిక అనారోగ్యానికి సులభమైన వ్యాయామ పరిష్కారం. మూత్రపిండాలు, అరచేతులు ఒకదానికొకటి చాలా దూరంలో ఉన్నాయనేది నిజమే, కానీ మూత్రపిండాలను ప్రభావితం చేసే శక్తి అరచేతులు చేసే చప్పుడుకు ఉంది.

వ్యాధుల చికిత్సలో ఉపయుక్తం

చేతిరాతకు చేయూత...

చప్పట్లు కొట్టడం అనే అలవాటు చిన్నారుల్లో మెదడు పనితీరును ప్రభావితం చేసి, మెరుగైన చేతిరాతకు దోహదం చేస్తుంది, ఏకాగ్రతను మెరుగుపరిచి తప్పులను తగ్గించగలుగుతుంది. తెల్ల రక్త కణాలను పెంపొందించి రోగనిరోధక శక్తి పెరిగి తరచూ ఇన్ఫెక్షన్ల బారిన పడడాన్ని నివారిస్తుంది. ఆర్థరైటిస్. సంబంధిత నొప్పులకు, మెరుగైన ఎముక ఆరోగ్యం కోసం రెగ్యులర్ చప్పట్లు సహకరిస్తాయని నిరూపితమైంది.

- మెరుగైన ఫలితాల కోసం, ఆవాల నూనె లేదా కొబ్బరి నూనె వంటి నూనెను అప్లై చేసిన తర్వాత చప్పట్లు కొట్టాలి.
- చప్పట్లు కొట్టడాన్ని రొటీన్ వ్యాయామంలో భాగంగా మార్చుకోవడం మంచిది.



కొన్ని సూచనలు..

- 52 ఏళ్ల బాలీవుడ్ నటి మైనే ప్యార్ కియా ఫేం భాగ్యశ్రీ ఇన్‌స్టాగామ్‌లోకి వెళ్లి మరీ చప్పట్లు కొట్టారు. అవును, మన అరచేతులను ఒకచోట చేర్చే సాధారణ చర్య ఒత్తిడిని నిర్వహించడంలో సహాయపడుతుంది అని ఆమె పేర్కొన్నారు.
- 'చప్పట్లు కొట్టడం, సానుకూల ఆరోగ్య ప్రయోజనాలతో కూడుకున్నది' అనే శీర్షికతో ఆమె ఒక సందేశాత్మక వీడియోను షేర్ చేశారు. 'ఒత్తిడి, ఆందోళన, రక్తపోటును తగ్గించడానికి ఇది ఒక సాధారణ పద్ధతి' అని పేర్కొన్నారు. పిల్లలకు, ఇది వారి జ్ఞాపకశక్తి, అభిజ్ఞా శక్తులను పెంచుతుంది' అని ఆమె చెప్పారు.

ఒక్క అనారోగ్య సమస్యా రాలేదు..

చప్పట్లు కొట్టడం మంచి ఆరోగ్యానికి ఏకైక పరిష్కారం అంటున్నారు 63 ఏళ్ల అరుణ్‌రిష్. గత 43 సంవత్సరాల్లో ఒకసారి కూడా తాను అనారోగ్యానికి గురవ్వలేదంటున్న ఆయన రోజూ 15 సెకన్ల పాటు చప్పట్లు కొట్టడం ద్వారానే ఈ ఘనతను సాధించగలిగా అంటారు. ఐఐఎంటీ కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. '15 సెకన్ల పాటు చప్పట్లు కొట్టడం అలాగే ప్రతిరోజూ పాదాలను రుద్దడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు' అని అన్నారు.



రోజూ 500 చప్పట్లు...



"మా లాఫింగ్, క్రైయింగ్ క్లబ్ రోజూ కాసేపు క్లాపింగ్ క్లబ్‌గా కూడా మారిపోతుంది. చప్పట్ల వల్ల ప్రయోజనాల గురించి అవగాహన వచ్చినప్పటి నుంచి మా వ్యాయామాల్లో చేర్చాం. నవ్వులు, నడకలతో పాటు రోజూ 500 చప్పట్లతో పరిసరాల్ని మారుమోగిస్తున్నాం. దీని వల్ల ఆరోగ్యంలో మరిన్ని మంచి మార్పులు వచ్చినట్టు సభ్యులు చెబుతున్నారు.

-కమలేష్, లాఫింగ్ క్లబ్ నిర్వాహకులు

మార్వలెస్ మైక్రో ఆర్ట్..



అరుదైన కళతో ఓ వ్యక్తి అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఎలాంటి శిక్షణా లేకుండానే పెన్సిల్ ఆర్ట్‌తో ఆరితేరిన ఆర్టిస్ట్‌లా పెన్సిల్‌పై బొమ్మలు చెక్కుతూ ట్యాలెంట్ ఎవడబ్బ సొత్తూ కాదని నిరూపించాడు. అతను గీసిన బొమ్మలు చూసిన వారందరూ ఔరా అంటున్నారు. తనకు తానే ఏకలవ్యుడి మాదిరిగా గురువు లేకుండానే పెన్సిల్ డ్రాయింగ్ నేర్చుకున్నాడు. మల్లాపూర్ డివిజన్ చాణక్యపురి కాలనీకి చెందిన గోసుల దుర్గా ప్రసాద్ ఇంజనీరింగ్ చదివినా, పోలీస్ ఉద్యోగం పొందాలనేది అతని లక్ష్యం. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తునే తన ట్యాలెంట్‌తో ఇలా నచ్చిన చిత్రాలను పెన్సిల్‌పై దించేస్తున్నాడు.

- మల్లాపూర్

పెన్సిల్‌పై బొమ్మలు గీస్తూ గుర్తింపు

కంటికి నచ్చిన బొమ్మలతో కుస్తీ..

అబ్బురపరుస్తున్న ఏకలవ్యుడు

అరుదైన మైక్రో ఆర్ట్‌లో ప్రవీణ్యం

ఔరా అనిపించుకుంటున్న దుర్గాప్రసాద్

స్నేహితురాలికి గిఫ్ట్ ఇవ్వడం కోసం ఈ ప్రయత్నం మొదలైంది. 2018లో బి.టెక్ చదువుతున్న సమయంలో తన స్నేహితురాలు రేష్మారెడ్డి బర్త్‌డేకి ఏదైనా అరుదైన గిఫ్ట్ ఇవ్వాలనుకున్నాడు. అప్పుడే తన మెదడుకు పదునుపెట్టాడు. ఏం ఇద్దామా అని ఆలోచిస్తుండగా అతనికి ఓ ఆలోచన తట్టింది. వారి స్నేహానికి గుర్తుగా పెన్సిల్‌పై ఆమె పేరును చెక్కి ఇవ్వాలనుకున్నాడు. శిక్షణ లేకుండానే తనకు తాను ఏకలవ్యుడి మాదిరిగా మైక్రో ఆర్ట్ నేర్చుకొని పెన్సిల్‌పై పేరును చెక్కి గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఆ తరువాత పెన్సిల్‌పై ఆర్ట్ మొదలు పెట్టాడు. 2018లో మొదలైన ఈ పెన్సిల్ మైక్రో ఆర్ట్ ప్రస్థానం నేటికీ కొనసాగిస్తూ అందరి మన్ననలూ పొందుతున్నాడు.



వందకుపైగా బొమ్మలు...

మదర్స్ డే, ఫాదర్స్ డే, ఫ్రెండ్ షిప్ డే, మహనీయుల జయంతి, వర్థంతి, పండుగలకు అనుగుణంగా, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే, అమరవీరుల దినోత్సవం, వినాయక చవితి, శివలింగం, విక్టరీ సింబల్, ఓటర్ దినోత్సవం, రాజకీయ నేతల పేర్లను, బుద్ధుడి ప్రతిమ, అమెజాన్ వంటివి పెన్సిల్‌పై మైక్రో ఆర్ట్‌గా చెక్కాను.

ప్రతి ఒక్కరిలోనూ ఒక ట్యాలెంట్..

ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ట్యాలెంట్ ఉంటుంది. కానీ అది నిరూపించుకోవడానికి కొంత సమయం పడుతుంది. నేనుకూడా పెన్సిల్‌పై మైక్రో ఆర్ట్ వేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. స్నేహితురాలి కోసం పెన్సిల్‌పై చెక్కడంతో నాలో ట్యాలెంట్ బయటపడింది. స్నేహితుల పుట్టిన రోజులు వచ్చినపుడు వారికి సర్‌ప్రైజ్‌గా పెన్సిల్‌పై ఏదైనా ఆర్ట్ వేసి ఇస్తుంటాను. అంతే కాకుండా డిజిటల్ ఆర్ట్ స్కేచ్‌తో వారి ఫొటో ప్రతిమను వేసి వారికి బహుమతిగా అందజేస్తా. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి పెన్సిల్‌పై పేరు చెక్కి అందజేశాను.





లైవ్ మ్యూజిక్ @ మెట్రో..

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ సంగీత స్వరాలతో పులకించింది. నెక్ట్స్ ట్రైన్ ఎప్పుడొస్తుందా అని ఆతృతగా చూసే నగరవాసులంతా లైవ్ మ్యూజిక్‌తో మైమరచిపోయారు. ఆహా వేదికగా తమ స్వరాలతో తెలుగు సంగీత ప్రియులను అలరిస్తున్న తెలుగు ఇండియన్ ఐడల్ 3 గాయకులంతా మెట్రో స్టేషన్‌లో గురువారం తమ పాటలతో అందరినీ అలరించారు. తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫారమ్ ఆహా, ఎల్ అండ్ టీ మెట్రో హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమం నగరవాసులను సంగీత సాగరంలో ముంచెత్తింది. తెలుగు ఇండియన్ ఐడల్ 3 స్టార్స్ కేశవ్ రామ్, రజనీ శ్రీ పూర్ణిమ, శ్రీ ధ్రుతి, స్కంద, అనిరుధ్‌లు రొమాంటిక్ మెలొడీ మొదలు ఎనర్జిటిక్ సాంగ్స్‌తో వీనులవిందు చేశారు. రజనీ శ్రీ పూర్ణిమ ప్రముఖ నటి సమంతా రూత్ ప్రభు వేషధారణలో అభిమానులను అలరించారు. ఇండియన్ ఐడల్‌లో ప్రత్యేకతను చాటుకున్న కేశవ్ రామ్‌తో సెల్ఫీలు దిగడానికి అభిమానులు పోటీ పడ్డారు. దాదాపు 2,3 గంటలు ప్రేక్షకులంతా నిలబడి ఉన్నామని మర్చిపోయి పాటలను ఆస్వాదించారు.

ఎంపీ మిథున్‌పై దాడి

పుంగనూరులో రోజంతా టీడీపీ గూండాల విధ్వంస కాండ

- రాజంపేట ఎంపీని కొట్టి చంపేందుకు పక్కా పథకం
- మారణాయుధాలు, రాళ్లతో పచ్చమూకల స్వైర విహారం



పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి లక్ష్యంగా పోలీసుల సమక్షంలో రాళ్లతో దాడి చేస్తున్న టీడీపీ గూండాలు (ఇన్‌సెట్‌లో) టీడీపీ మూకలు నిప్పుపెట్టడంతో తగలబడిపోతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప కారు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: నిన్న నరమేధం.. నేడు హత్యాయత్నం! అధికార మదంతో పచ్చమూకలు వరుసగా మహిళలపై అఘాయిత్యాలు, పూటకో అరాచకానికి తెగబడుతున్నాయి. వినుకొండలో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తను నరికి చంపిన టీడీపీ గూండాలు 12 గంటలు గడవక ముందే పుంగనూరులో మరో విధ్వంస కాండను సృష్టించారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన వారు, ఆస్తులు, పంటలను కోల్పోయిన బాధితులను పరామర్శించి భరోసా కల్పించేందుకు వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అంతమొందించే ప్రణాళికతో పచ్చముఠాలు గురువారం రోజంతా మారణాయుధాలతో తిష్ట వేసి దాడులకు దిగాయి.

నాలుగు గంటలు స్వైర విహారం..

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని హతమార్చడమే లక్ష్యంగా అసాంఘిక శక్తులు పుంగనూరులో తీవ్ర ఉద్రిక్తతలు రేకెత్తించాయి. గురువారం ఉదయం 8 గంటల సమయంలో మిథున్‌రెడ్డి పుంగనూరు ఎల్‌ఐసీ కాలనీలోని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమైన విషయం తెలుసుకున్న టీడీపీ మూకలు రెచ్చిపోయాయి. ఎంపీ మిథున్‌రెడ్డిని రాళ్లు, కర్రలతో కొట్టి చంపేందుకు మూకుమ్మడిగా దాడులకు తెగబడ్డాయి. టీడీపీ గూండాలను నిలువరించేందుకు యత్నించిన మాజీ ఎంపీ, దళిత నాయకుడు రెడ్డప్పపైనా టీడీపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. దుర్భాషలాడుతూ రెడ్డప్ప నివాసంలోకి చొరబడ్డారు. ప్రమాదాన్ని పసిగట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు తలుపులు మూసివేయడంతో బద్దలు కొట్టేందుకు యత్నించారు. రెడ్డప్ప నివాసంలోకి రాళ్లు రువ్వారు. ఇంటి ముందు ఉన్న పలు వాహనాలను ధ్వంసం చేసి రెడ్డప్ప వాహనానికి నిప్పు పెట్టి తగలబెట్టారు. నిలువరించేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనా దాడులు చేశారు. ఘటన గురించి తెలియడంతో అక్కడికి చేరుకున్న మీడియా ప్రతినిధులపైనా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. సుమారు నాలుగు గంటలపాటు సాగిన ఈ విధ్వంసంతో పుంగనూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

మూకుమ్మడిగా చంపాలన్నదే టార్గెట్!

టీడీపీ మూకలు ఉదయం నుంచి స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రాళ్లు, కర్రలు, ఇతర ఆయుధాలతో మాటు వేశాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ముగించి మిథున్‌రెడ్డి బయటకు వస్తున్నట్లు గుర్తించి ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. రాళ్లు రువ్వుతూ మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసాన్ని చుట్టుముట్టాయి. వారిని అడ్డుకునేందుకు యత్నించిన రెడ్డప్పపైనా దాడికి దిగాయి. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడగా 25 మందికిపైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు సాక్షి విలేకరులతోపాటు మరి కొందరు ఈ దాడుల్లో తీవ్రంగా గాయపడ్డారు.

గాల్లోకి కాల్పులు జరిపిన ఎంపీ గన్‌మన్

అనంతరం ఎంపీ, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన 15 వాహనాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేశారు. మరో 12 ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప వాహనానికి నిప్పుపెట్టి తగలబెట్టారు. రెడ్డప్ప నివాసం వద్ద పరిస్థితి అదుపు తప్పుతుండటంతో అల్లరి మూకల నుంచి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని రక్షించేందుకు గన్‌మన్ రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు.

అడుగడుగునా పోలీస్ వైఫల్యం

పుంగనూరులో జరిగిన విధ్వంస కాండలో అడుగడుగునా పోలీసుల నిర్లక్ష్యం కనిపించింది. పోలీసుల సమక్షంలోనే రాళ్లు రువ్వుతూ, కర్రలతో స్వైర విహారం చేస్తున్నా చూస్తుండిపోయారు. భారీగా టీడీపీ మూకలు మోహరించినా వెంటనే స్పందించాల్సిన ఉన్నతాధికారులు తీరిగ్గా కొంత మంది పోలీసులను పంపి చేతులు దులుపుకోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాబు ఆదేశాలతో హౌస్ అరెస్టు..

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి గత నెల 15న పుంగనూరులో పర్యటించాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పోలీసులు వారిద్దరినీ తిరుపతిలో హౌస్ అరెస్ట్ చేశారు. తాజాగా పార్టీ కార్యకర్తలను, బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ఎంపీ మిథున్‌రెడ్డిని ఏకంగా హతమార్చేందుకు పచ్చమూకలు పథకం వేశాయి.

బెదిరింపులకు భయపడం

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలే ఎజెండాగా పని చేస్తోంది. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పురిగొల్పడం దారుణం. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నియోజకవర్గంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు గతంలో ఎప్పుడూ చూడలేదు. అభివృద్ధి అంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లను కూల్చడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, పిల్లలు ఆడుకునే బ్యాడ్మింటన్ కోర్టును ధ్వంసం చేయడమా? ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు. చంద్రబాబు ఆదేశాలతో పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తు న్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని మరో బిహార్‌లా మార్చే యత్నం చేస్తున్నారు. ఇలాంటి దాడులకు భయపడే ప్రసక్తేలేదు. ప్రజలకు అండగా ఉంటాం. ప్రజల్లోనే ఉంటూ మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. తిరిగి ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుంది. హింసాత్మక ఘటనలు పునరావృతమైతే టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

ఏపీలో ఆటవిక పాలన

ప్రధాని మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ లేఖ

సాక్షి, అమరావతి: వివక్ష లేకుండా ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం వినియోగించాల్సిన అధికార యంత్రాంగాన్ని టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాజకీయమయం చేసిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి నివేదించారు. హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో రాజకీయమయం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా దాదాపు 27 మంది ఐఏఎస్‌లు, 24 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా చేశారంటే సీఎం చంద్రబాబు లక్ష్యాలు, ఉద్దేశాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ప్రధాని మోదీకి వైఎస్ జగన్ లేఖ రాశారు. ''కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల వ్యవధిలోనే ఏపీలో 31 మంది హత్యకు గురయ్యారు. 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయి. టీడీపీ నేతల వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 560 చోట్ల ప్రైవేట్ ఆస్తులు, 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. టీడీపీ నేతల అరాచకాలను భరించలేక దాదాపు 2,700 కుటుంబాలు గ్రామాలను విడిచి వెళ్లిపోయాయి. ఇవికాకుండా 1,050కి పైగా దౌర్జన్యాలు, దాడుల ఘటనలు జరిగాయి'' అని పేర్కొన్నారు. ఇవన్నీ యాధృచ్ఛికంగా జరిగినవి కాదని, వైఎస్సార్ సీపీని అణగదొక్కడమే లక్ష్యంగా ఒక పథకం ప్రకారం దుర్మార్గాలని స్పష్టం చేశారు. రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎవరూ ఉండకూడదన్న ఏకైక లక్ష్యంతో ఇవన్నీ చేస్తున్నారని.. ఆమేరకు ప్రభుత్వంలో ఉన్నవారు కింది స్థాయివరకూ అధికారులకు సంకేతాలు పంపారని తెలిపారు. ఒక మంత్రి రెడ్‌బుక్ పేరిట ఏకంగా హోర్డింగులు పెట్టి నేరుగా దాడులు చేయాలని శ్రేణులకు చెప్పకనే చెప్పారన్నారు. వాటిని అడ్డుకోవద్దని అధికారులకు సంకేతాలు ఇవ్వడంతో టీడీపీ గూండాలు ఎక్కడికక్కడ రెచ్చిపోయి దారుణాలకు పాల్పడుతున్నారని వివరించారు. మొత్తంగా చూస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయని, తక్షణం శాంతిస్థాపన జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జరిగిన ఘటనలపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో విచారణ జరపాలని విన్నవించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత 45 రోజులుగా సాగించిన దురాగతాలను నివేదించేందుకు వీలైన రోజు అపాయిమెంట్ ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. లేఖలో ప్రధానాంశాలు ఇవీ..

శాంతి భద్రతలు క్షీణించాయి..
వ్యవస్థలు కుప్పకూలాయి..

- ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. రాజ్యాంగ వ్యవస్థలు కూప్పకూలిపోయాయి. యంత్రాంగం నిస్తేజంగా మారిపోయింది. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు స్వైరవిహారం చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. అత్యంత అనాగరిక ఘటనలు జరుగుతున్నాయి. అమానవీయ, అమానుషంగా ఘటనలు జరుగుతున్నాయి.
- ఎన్నికల ఫలితాలు వెలువడింది మొదలు తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా వారి ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. అధికారాన్ని అండగా పెట్టుకుని యథేచ్ఛగా చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఇళ్లపై, నాయకుల ఇళ్లపై, వారి వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లను కూల్చివేశారు. రోడ్డుపక్కనే చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని పొట్ట పోసుకుంటున్న వారిపై ఉపాధిని దెబ్బకొట్టారు. రాజకీయ కారణాలతో వారి దుకాణాలను జేసీబీలతో కూల్చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు కోకొల్లలు.
- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ఆస్తులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటమే కాకుండా ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం చేకూర్చారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా గ్రామస్థాయిలోనే ప్రజలకు అత్యంత చేరువగా సేవలందిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్‌నూ విడిచిపెట్టలేదు. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థలను తెచ్చిందనే ఏకైక కారణంతో వాటిని ధ్వంసం చేశారు.
- అన్నిటినీ మించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. గత బుధవారం రోజు పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. అందరూ చూస్తుండగానే ఈ ఘటన జరిగింది. ఈ దారుణ హత్య రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఇలాంటివి పలు ఘటనలు జరిగాయి. అల్లరిమూకలు పట్టపగలే నడి రోడ్డుమీద కత్తులతో స్వైరవిహారం చేస్తూ మనుషుల ప్రాణాలు తీస్తున్న ఘటనలు సర్వ సాధారణం అయిపోయాయి.

ఎంపీకే రక్షణ లేని పరిస్థితి..

వైఎస్సార్‌సీపీ తరఫున పార్లమెంట్‌కు, శాసనసభకు ఎన్నికైన వారు, ఆయా స్థానాల్లో పోటీచేసిన అభ్యర్థులకు రక్షణ లేకుండా పోయింది. తాజాగా గురువారం చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసానికి వెళ్లిన మా పార్టీ లోక్‌సభపక్ష నాయకుడు, ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు హత్యాయత్నానికి పాల్పడ్డాయి. పోలీసుల సమక్షంలోనే ఈ దాడి జరిగింది. ఒక ఎంపీకి కూడా రక్షణ కల్పించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి వదిలేశారు..

- రాష్ట్రంలో ఎక్కడా ప్రజాస్వామ్య ప్రభుత్వ ఆనవాళ్లు కనిపించడంలేదు. రాజ్యాంగం, చట్టం లేదు. పోలీసు వ్యవస్థ పని చేయడం లేదు. ఈ 40–45 రోజులుగా రాష్ట్రాన్ని రెడ్‌బుక్ రాజ్యాంగానికి వదిలేశారు. గూండాలకు, ఉన్మాదులకు, మహిళలపై అఘాయిత్యాలు చేసేవారికి, చిన్నారులపై దారుణాలకు ఒడిగట్టేవారికి రాష్ట్రాన్ని అప్పగించేశారు.
- గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అంటే ఉత్తమ విద్య, నాణ్యమైన వైద్యం, రైతుకు భరోసా, అక్కచెల్లెమ్మలకు సాధికారిత, పటిష్ట లా అండ్ ఆర్డర్, సుస్థిర, సమగ్ర అభివృద్ధికి నిలయమని పేరు పొందితే ఇవాళ ఏపీ అంటే హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్షపూరిత దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయింది. రాష్ట్రంలో అరాచకాలు మినహా పరిపాలన కనిపించడం లేదు.

నేడు వినుకొండకు వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబానికి పరామర్శ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ శుక్రవారం పల్నాడు జిల్లా వినుకొండకు వెళ్లనున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి గుంటూరు, చిలకలూరిపేట, నర్సరావుపేట బైపాస్ మీదుగా ఆయన వినుకొండకు చేరుకుంటారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మధ్యాహ్నం తాడేపల్లికి చేరుకోనున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ కార్యకర్త జిలానీ బుధవారం రాత్రి వినుకొండలో నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన గురించి తెలియగానే బెంగళూరులో ఉన్న జగన్.. వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. హత్య ఘటన, వినుకొండలో పరిస్థితిని ఆరా తీశారు. స్థానిక పార్టీ నాయకులంతా వెంటనే రషీద్ కుటుంబ సభ్యులను కలవాలని..వారికి ధైర్యాన్నిచ్చి, తోడుగా నిలవాలని నిర్దేశించారు.

స్థానికుల స్పందన.. పోలీసుల చొరవతో..

జ్వరంతో బాధపడుతున్న చిన్నారి ఆస్పత్రికి తరలింపు



బాబుతో వాగు దాటుతున్న కానిస్టేబుల్ తిరుపతి

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ముత్యాలంపాడు శివారులోని పాలవాగుపై వంతెన నిర్మిస్తుండగా.. లోలెవల్ చప్టా తొలగించి డైవర్షన్ రోడ్డు వేశారు. అయితే, బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి వరద పారుతోంది. దీంతో ముత్యాలంపాడు, రాచన్నగూడెంతోపాటు మరో ఆరు ఆదివాసీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రజలంతా జలదిగ్బంధనంలో ఉండగా.. రాచన్నగూడేనికి చెందిన కుంజా నీలమ్మ 11 నెలల కొడుకు శ్రీహాస్ బుధవారం రాత్రి నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. బాలుడిని వైద్యం నిమిత్తం జగన్నాథపురం తీసుకెళ్లాలని గురువారం వచ్చిన నీలమ్మ రహదారి సౌకర్యం లేక చాలాసేపు వాగు ఒడ్డునే నిరీక్షించింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు స్పందించారు. అప్పటికప్పుడు జేసీబీ తెప్పించి మోరీలపై పెద్ద బండరాళ్లు పేర్చి, తాత్కాలికంగా దారి ఏర్పాటు చేశారు. ఆపై కానిస్టేబుల్ తిరుపతి, స్థానికులు తల్లీబిడ్డను సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేర్చి ఆస్పత్రికి తరలించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కృష్ణాకు నిలకడగా వరద ప్రవాహం

- ఆల్మట్టిలోకి 48,667, నారాయణపూర్‌లోకి 68,797 క్యూసెక్కుల నీరు
- జూరాలలో విద్యుదుత్పత్తి ద్వారా 30,013 క్యూసెక్కుల నీరు విడుదల
- శ్రీశైలం ఎడమ కేంద్రంలో 'తెలంగాణ' విద్యుదుత్పత్తి
- తుంగభద్ర డ్యామ్‌లోకి పెరిగిన వరద ఉధృతి

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది ప్రధానపాయలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. గురువారం కర్ణాటకలోని ఆల్మట్టి డ్యామ్‌లోకి 48,667 క్యూసెక్కుల నీరు చేరగా, గేట్ల ద్వారా 65,00 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 68,797 క్యూసెక్కుల నీరు చేరగా, దిగువకు 46,195 క్యూసెక్కుల నీటిని వది లారు. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తుండటంతో జూరాల ప్రాజెక్టులో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 30,013 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతోంది. ఈ జలాలు శుక్రవారానికి శ్రీశైలానికి చేరుకోనున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమకేంద్రంలో తెలంగాణ సర్కార్ విద్యుదుత్పత్తి కొనసాగిస్తోంది. విద్యుదుత్పత్తి చేస్తూ 7,064 క్యూసెక్కులను దిగువకు తరలిస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులో నీటినిల్వ 32.37 టీఎంసీలకు చేరింది. శ్రీశైలం నుంచి విద్యుదుత్పత్తి ద్వారా నాగార్జున సాగర్ ప్రాజెక్టులోకి 23,851 క్యూసెక్కులు రావడంతో నీటినిల్వ 123.34 టీఎంసీలకు చేరింది.

- ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్ర బేసిన్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,12,221 క్యూసెక్కుల నీరు రాగా, ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 50.82 టీఎంసీలకు చేరింది. శుక్రవారం తుంగభద్ర డ్యామ్‌లోకి లక్షా ముప్పయి వేల క్యూసెక్కుల కంటే ఎక్కువ ప్రవాహం వస్తుందని సీడబ్ల్యూసీ అంచనా వేసింది.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పెద్ద వాగు వరద పరిస్థితిపై ఆమె గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట పెద్దవాగుకు పెద్దఎత్తున వరద రావడం వల్ల గేట్లు ఎత్తడంతో దిగువ భాగంలోని గ్రామాల రైతులు వరద నీటిలో చిక్కుకున్న సంఘటనపై ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సహాయ పునరావాస చర్యలను సమీక్షించారు. డీజీపీ జితేందర్, విపత్తుల నిర్వహణశాఖ డీజీ, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ్జలు కూడా పాల్గొన్నారు.

గోదావరి పరీవాహకంలో భారీ వర్షాలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మల్లారం గుండ్రాత్‌పల్లి రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

- కాళేశ్వరం వద్ద 5.900 మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం
- ఉప్పొంగిన వాగులు..పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

సాక్షినెట్‌వర్క్: గోదావరి పరీవాహక ప్రాంతాలకు వరద పోటెత్తుతోంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది.

- మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద ఎగువ మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నదితో వరద క్రమక్రమంగా పెరుగుతోంది. 5.900మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో మేడిగడ్డ బరాజ్‌లోని 85గేట్లు ఎత్తి 60వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అన్నారం వద్ద మానేరు, పెద్దవాగుల నుంచి వరద రాగా, బరాజ్‌లోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా బరాజ్‌ల్లో ఎన్‌డీఎస్‌ఏ సూచించిన జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిలిచాయి. డ్రిల్లింగ్ పనులు కూడా నిలిపివేసినట్లు తెలిసింది. కాటారం నుంచి మహాముత్తారం వెళ్లే ప్రధాన రహదారిలోని బొర్రవాగు కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. గంగారం వద్ద గల వాగు, ఒడిపిలవంచ వద్ద గల చిన్న వాగు, మల్లారం–గుండ్రాత్‌పల్లి రహదారిపై గల వాగు రోడ్డుపై నుండి ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలకు అంతరాయం కలిగింది.
- ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జంపన్నవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.
- కన్నాయిగూడెం మండలం ఐలాపుర్, సర్వాయి గ్రామాలు చుట్టూ వాగులు పొంగి పొర్లుతుండడంతో మండలకేంద్రానికి, గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. తుపాకులగూడెంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్కసాగర్ బ్యారేజీ జలకళను సంతరించుకుంది. బ్యారేజీలోకి గురువారం 2,52,400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. బ్యారేజీకి 59 గేట్లు ఉండగా అందులో 52 గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశమున్నట్టు వాతావరణశాఖ వివరించింది. దక్షిణ బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది సమీపంలోని ఉత్తర బంగాళాఖాతం పరిసరాల వరకు విస్తరించి ఉన్నట్టు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. దీని ప్రభావంతో శుక్ర, శనివారాల్లో ఉత్తర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు ప్రకటించారు. ప్రధానంగా ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు, అత్యంత భారీవర్షాలు కూడా నమోదు కావొచ్చని సూచించింది. ఈ మేరకు నాలుగు జిల్లాలకు రెడ్‌అలర్ట్ జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని సూచిస్తూ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

ప్రస్తుతానికి సాధారణమే...

రాష్ట్రంలో నైరుతి సీజన్‌లో వర్షాలు ఇప్పటి వరకు సాధారణ స్థితిలోనే నమోదయ్యాయి. ఈ సీజన్‌లో గురువారం నాటికి 25.14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 28.55 సెంటీమీటర్లు నమోదైంది. మెదక్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా... జోగులాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మిగతా జిల్లాల్లో మాత్రం సాధారణ స్థితిలోనే గణాంకాలున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 1 సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. భద్రాద్రికొత్తగూడెంజిల్లా అశ్వారావుపేటలో అత్యధికంగా 11.3సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దమ్మపేట మండలం అంకంపాలెంలో 8.98 సెంటీమీటర్లు, మహదేవ్‌పూర్ మండలం పెద్దంపేటలో 8.15 సెంటీమీటర్లు, వెంకటాపూర్ మండలం అలుబాకలో 8.0 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

పిడుగుపాటుకు అన్నదమ్ముల మృతి

తల్లిదండ్రుల కళ్లెదుటే తనువు చాలించిన కుమారులు



పిడుగుపాటుతో మృతిచెందిన చందు, సిద్ధూ

దమ్మపేట: తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లిన ఇద్దరు పిల్లలు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జమేదార్‌బంజరలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొర్రా మల్లేష్ – నాగమణి దంపతులు తమ ఇద్దరు కుమారులు బొర్రా చందు(14), బొర్రా సిద్ధూ(11)తో కలిసి ఉదయమే పొలానికి వెళ్లారు. భార్యాభర్తలు పొలంలో పని చేస్తుండగా ఇద్దరు పిల్లలు పక్కనే ఆడుకుంటున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పిల్లలు ఉన్న ప్రదేశానికి సమీపంలోనే పిడుగు పడింది. ఆ తీవ్రతతో షాక్‌కు గురై అన్నదమ్ములిద్దరూ కిందపడి పోయారు. తల్లిదండ్రులు పరుగెత్తుతూ వచ్చేసరికే ఇద్దరూ మృతిచెందారు. తమకున్న ఇద్దరు సంతానం ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

పొలం పనులకు వెళ్లి..
వరదలో చిక్కుకుని..

పెద్దవాగుకు వరద పోటెత్తడంతో చిక్కుకుపోయిన 28 మంది.. హెలికాప్టర్లలో సురక్షిత ప్రాంతానికి..



హెలికాప్టర్ సాయంతో ఒకరిని రక్షిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



వాగులో చిక్కుకున్న వారిని కాపాడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని అభినందిస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం /అశ్వారావుపేటరూరల్: ఒక్కసారిగా పెద్దవాగుకు వరద పోటెత్తింది. దీంతో ఆ వరద ఉధృతిలో 28 మంది చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు రెండు హెలికాప్టర్లు రంగంలోకి 25 మందిని సురక్షిత ప్రాంతానికి చేర్చగా, మరో ముగ్గురిని స్థానికులు కాపాడారు.

వాన తగ్గిందని...

భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవెల్లి దగ్గర పెద్దవాగుపై మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉంది. ప్రాజెక్టులోకి వరద వచ్చే క్యాచ్‌మెంట్ ఏరియాలో కొంత ఏపీలోని బుట్టాయిగూడెం మండల పరిధిలో ఉంది. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో వాగులో ప్రవాహం పెరిగింది. మరోవైపు అశ్వారావుపేట మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. మధ్యాహ్నం 12:30 గంటలకు వాన కొంత తగ్గుముఖం పట్టడంతో స్థానికులు పొలాలకు వెళ్లారు. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో పెద్దవాగుకు అకస్మాత్తుగా వరద పెరిగి ముందుగా ఒడ్డు వెంట ఉన్న పొలాలను చుట్టుముట్టింది. దీంతో వరదలో చిక్కుకున్న వారు ప్రాణాలు కాపాడుకునేందుకు చెరువుకట్టకు దగ్గరలో ఉన్న ఎత్తయిన ప్రదేశం వైపు వెళ్లారు. ఆ తర్వాత క్రమంగా వరద నీటిమట్టం పెరుగుతూ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికి బాధితుల మోకాళ్లలోతు వరకు వచ్చాయి. క్రమంగా గట్టు దాటుకొని పొలాలను ముంచెత్తింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యానికి మించి వరద రావడంతో ముందుగా ప్రాజెక్టు ఎగువ భాగం ముంపునకు గురైంది. దీంతో వెంటనే ప్రాజెక్టుకు ఉన్న మూడు గేట్లు తెరిచేందుకు ప్రయత్నించగా అందులో ఒకటి తెరుచుకోలేదు. బాధితులు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా, వరద పరిస్థితిని తెలుసుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ యంత్రాంగాన్ని సహాయ కార్యక్రమాల కోసం అప్రమత్తం చేశారు.

అటు అనుకుంటే ఇటు..: ఏపీలోని వేలేరుపాడు మండలం అల్లూరినగర్ దగ్గర వరద నీటిలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ఉన్న ఐదుగురిని కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం రంగంలోకి దిగి నేవీ హెలికాప్టర్‌ను పంపింది. అయితే హెలికాప్టర్ రావడం ఆలస్యం కావడంతో గ్రామస్తులు ఆ కారులో ఉన్న ఐదుగురిని కాపాడారు. దీంతో నేవీ హెలికాప్టర్ సంఘటనా స్థలానికి రాకుండా ఏలూరులో ఆగిపోయింది. అయితే అదే సమయంలో పెద్దవాగు ప్రాజెక్టు ఎగువన నారాయణపురంలో 28 మంది వరదలో చిక్కుకుపోయిన విషయం వెలుగుచూసింది. దీంతో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అక్కడి అధికారులతో మాట్లాడి హెలికాప్టర్‌ను ఇటు పంపించారు.

జాయింట్ ఆపరేషన్: ఏలూరు నుంచి హెలికాప్టర్ ఘటనా స్థలికి 6:15 గంటలకు వచ్చింది. వెలుతురు సరిగ్గా లేదు. సహాయ కార్యక్రమాలు ఏమేరకు జరుగుతాయో అనే సందేహం నెలకొంది. నేవీ హెలికాప్టర్ ముందుగా ప్రభావిత ప్రాంతంలో చక్కర్లు కొట్టి బాధితులు ఉన్న లొకేషన్‌ను గుర్తించింది. ఆ తర్వాత 20 నిమిషాలకు తెలంగాణకు చెందిన హెలికాప్టర్ ఘటనా స్థలికి చేరుకుంది. 6:45 గంటలకు అసలైన రెస్క్యూ ఆపరేషన్ మొదలైంది. నేవీ హెలికాప్టర్ దారి చూపిస్తూ లొకేషన్ దగ్గరికి తీసుకెళ్లి బాధితులు ఉన్న చోటుపై లైట్ వేసింది. రెండో హెలికాప్టర్ ఆ స్థలానికి చేరుకుని బాధితులకు రోప్ అందించింది. విడతల వారీగా బాధితులను బయటకు తీసుకురావడంతో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైంది.

వైకుంఠధామంలో ల్యాండింగ్..

బాధితులు మధ్యాహ్నం 3 గంటలకు వరద నీటిలో చిక్కుకున్నారు. గంటగంటకూ వరద నీరు పెరుగుతూ మోకాళ్ల లోతుకు వచ్చింది. బాధితుల్లో మహేశ్ అనే యువకుడి దగ్గరే ఫోన్ ఉంది. దీంతో ప్రాణభయంతో అందరూ ఆ ఫోన్ నుంచే కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తమ ప్రాణాలు దక్కవేమోనంటూ బోరున విలపించారు. మూడు గంటలు గడిచినా రెస్క్యూ ఆపరేషన్ మొదలు కాకపోవడం, మరోవైపు చీకటి పడుతుండటంతో పైప్రాణాలు పైనే పోయాయని భావించారు. అయితే ఏడు గంటల సమయంలో వరద నీటి నుంచి వారిని కాపాడిన హెలికాప్టర్ ల్యాండింగ్‌కు సరైన స్థలం లేక నారాయణపురం గ్రామంలో ఉన్న వైకుంఠధామం (స్మశానం)లో వారిని దించింది. ప్రాణాపాయం నుంచి బయటపడిన వారికి వైకుంఠధామం తొలి ఆశ్రయం ఇచ్చింది.

పెద్దవాగుకు గండి

రైట్ కెనాల్ తూము దగ్గర 40 మీటర్ల వద్ద....

తెలంగాణలో రెండు, ఏపీలో ఏడు గ్రామాలు మునక!

ముందుగానే గ్రామాలు ఖాళీ చేసిన ప్రజలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏపీ, తెలంగాణవాసులను గడగడలాడించిన పెద్దవాగుకు ప్రాజెక్టుకు గండిపడింది. రెండు రాష్ట్రాల పరిధి పెద్దవాగు క్యాచ్‌మెంట్ ఏరియాలో సుమారు 16 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో గురు వారం ఉదయం నుంచి వాగుకు వరద పోటెత్తింది. ఈ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 40,500 క్యూసెక్కులు కాగా మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 70 వేల క్యూసెక్కులు, సాయంత్రం 5గంటలకల్లా 90 వేల క్యూసెక్కుల వరద చేరింది. దీంతో మధ్యాహ్నం నుంచే ప్రాజెక్టుకు ఎగపోటు మొదలైంది. సాయంత్రం 5–30 గంటలకు గేట్లు, మట్టికట్ట మీద నుంచి నీరు ప్రవహించడం మొద లైంది. రాత్రి 7.30గంటల సమయంలో 32 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. అయితే ఉధృతి తగ్గకపోవడంతో రాత్రి 8 గంటల సమయంలో రైట్ కెనాల్ తూము దగ్గర 40 మీటర్ల మేరకు గండి పడగా, అక్కడి నుంచి కొంత దూరంలో మరో 20 మీటర్ల మేరకు గండి పడింది. మొత్తంగా 150 మీటర్ల మేరకు మట్టి కట్ట బలహీనపడిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

నీట మునిగిన గ్రామాలు: పెద్దవాగు దిగువన తెలంగాణలో గుమ్మడవెల్లి, కొత్తూరు గ్రామాలు ఉన్నాయి. గురువారం సాయంత్రం వరద ఉధృతి పెరిగిన వెంటనే ఈ గ్రామాల్లో ఉన్న ప్రజలు అధికారులు హుటాహుటిన ఖాళీ చేయించారు. గండి పడిన తర్వాత వచ్చిన వరద నలభై ఇళ్లను ముంచెత్తింది. పశువులు ఇతర ఆస్తి నష్టం వివరాలు తెల్లవారితే కానీ తెలిసే అవకాశం లేదు. ఏపీలోని వేలేరుపాడు మండలం మేడిపల్లి, రామవరం, గుండ్లవాయి, రెడ్డిగూడెంకాలనీ, మద్దిగట్ల, పూచిరాల గ్రామాల్లోనూ వరద ప్రభావానికి లోనయ్యాయి.

'సాక్షి' చొరవతో సురక్షిత ప్రాంతానికి...

- వరదలో చిక్కుకున్న ఏపీ, తెలంగాణవాసులు



వరదలో చిక్కుకున్న వైద్య సిబ్బంది, ప్రజలు

ఏలూరు (మెట్రో): 'సాక్షి' చొరవతో పెద్దవాగులో చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందినవారు సురక్షితంగా బయటపడ్డారు. ఏపీలోని వేలేరుపాడు మండలంలోని కొయిదా ఆస్పత్రికి పలువురు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గురువారమూ పలువురు వైద్య సిబ్బంది, ప్రజలు కొయిదాకు బయల్దేరారు. వారు పెద్దవాగు బ్రిడ్జి పైకి చేరుకున్న సమయంలోనే వాగులోకి ఒక్కసారిగా వరద రావడంతో గేట్లు ఎత్తేశారు. దీంతో భారీగా వరద నీరు బ్రిడ్జిమీదుగా ప్రవహించింది. మరోపక్క గోదావరి వరద కూడా పెరగడంతో నది బ్యాక్ వాటర్ కూడా మరోపక్క నుంచి బ్రిడ్జిని చుట్టుముట్టింది. దీంతో కొయిరా ఆస్పత్రి సిబ్బంది వరద నీటి మధ్యలో చిక్కుకుపోయారు. స్థానికులు ఈ విషయాన్ని 'సాక్షి' మీడియాకు తెలిపారు. తక్షణమే స్పందించిన 'సాక్షి' సిబ్బంది జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణికి సమాచారం అందించారు. కలెక్టర్ వెంటనే స్థానిక ఏపీ, తెలంగాణ అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వెంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులతో మాట్లాడి, నౌకాదళం హెలికాప్టర్‌ను రప్పించారు. నౌకాదళం సిబ్బంది సాయంత్రం నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రమించి అందరిని సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు. 'సాక్షి' సిబ్బంది, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చొరవను బాధితులు, స్థానికులు ప్రశంసించారు.

గాంధీ, ఉస్మానియా సూపరింటెండెంట్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో భాగంగా పలువురు సీనియర్లను వేరే చోటకు బదిలీ చేస్తూ గురువారం నిర్ణయం తీసుకుంది. గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజారావును యాదాద్రి భువనగిరి టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, మాజీ డీఎంఈ రమేశ్‌రెడ్డిని యాదాద్రి భువనగిరి మెడికల్ కాలేజీ ప్రిన్సి పల్‌గా బదిలీ చేశారు. ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేందర్‌ను మహేశ్వరం టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా, మాజీ డీఎంఈ త్రివేణిని మహేశ్వరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా, నిజామాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిరాను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మోహన్‌దాస్‌ను నర్సంపేట్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బదిలీ చేశారు.

గాంధీకి రాజకుమారి: నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజ కుమారిని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను నియమించాల్సి ఉంది. నగరంలోని మిగిలిన హాస్పిటళ్లలో ఏళ్లుగా పాతుకుపోయిన వారిని కూడా ఒకట్రెండు రోజుల్లో బదిలీ చేయనున్నట్టు వైద్య విద్యా సంచాలకుల విభాగం అధికారులు తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల ట్రాన్స్‌ఫర్లకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం మొదలైంది. ఈ నెల 20వ తేదీ నాటికి కౌన్సెలింగ్ ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు.

'మహీంద్ర'లో కొత్త కోర్సు



న్యూఢిల్లీ/హైదరాబాద్: మహీంద్ర యూనివర్సిటీ డిజైన్ ఆఫ్ ఇన్నోవేషన్ పేరుతో బ్యాచిలర్ డిగ్రీని ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానుంది. ఇటలీలోని టోరినో నగరంలోని పినిన్‌ఫారినా డిజైన్ అకాడమీ, షినోయ్ ఇన్నోవేషన్ స్టూడియో ఐడీసీ ఐఐటీబీ భాగస్వామ్యంతో ఈ కోర్సును అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కొత్తగా నిర్మితమవుతున్న సరికొత్త భారత నిర్మాణ దశలో లక్ష్యాలను సాధించేందుకు కొత్త సాంకేతిక పద్ధతులను అనుసరించడంతోపాటుగా వాటికి అవసరమైన సాంకేతిక నైపుణ్య పద్ధతులను విద్యార్థులకు అందించేలా ఈ కోర్సును రూపొందించినట్లు మహీంద్ర యూనివర్సిటీ వీసీ డాక్టర్ యాజులు మేడూరి తెలిపారు.

విద్యార్థుల మానసిక వికాసానికి 'గైడ్‌కాస్ట్'

సాక్షి, హైదరాబాద్: నలభై అయిదేళ్ల సుదీర్ఘ విద్యాప్రస్థానంలో లక్షలాది మంది విద్యార్థుల కలలను సాకారం చేసిన నారాయణ విద్యాసంస్థలు.. ఇప్పుడు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాయని ఆ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎలా నడుచుకోవాలి? వారి మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడాలి? అనే అంశాలపై నిపుణులతో చర్చించి అవసరమైన సలహాలు, సూచనలతో.. యూట్యూబ్ వేదికగా మొదటి సీజన్‌లో మొదటి ఎపిసోడ్‌ను 'గైడ్‌కాస్ట్' పేరుతో విడుదల చేసినట్టు వెల్లడించారు. ఇందులో విద్యార్థుల మానసిక స్థితి, దానిపై ప్రభావం చూపే అంశాలను లోతుగా చర్చించారని తెలిపారు.

హైదరాబాద్–వాడి మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్–వాడి మధ్య ఈ నెల 20 నుంచి 22 వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లన్నీ సాధారణ అన్‌రిజర్వ్‌డ్ రైళ్లు. మొదటి రైలు ఈ నెల 20వ తేదీ ఉదయం 10.05 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 3.30కు వాడి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు సాయంత్రం 4.20కు బయల్దేరి రాత్రి 9.20కి నాంపల్లికి చేరుకుంటుంది. మరో రైలు 22వ తేదీన ఉదయం 5 గంటలకు బయల్దేరి 10.05 గంటలకు వాడికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 11.05 గంటలకు వాడి నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటలకు నాంపల్లికి చేరుకుంటుంది.



- డిజిటల్ చెల్లింపులు నిరాకరిస్తే బ్లాక్‌లిస్టులో ఫాస్ట్‌ట్యాగ్
- ఫాస్ట్‌ట్యాగ్ వినియోగంపై ఎన్‌హెచ్ఏఐ మార్గదర్శకాలు
- జారీ చేసే బ్యాంకులు, సంస్థలకూ పెనాల్టీ విధింపు

'డబుల్' పడిపోద్ది

ఫాస్ట్‌ట్యాగ్ సరిగ్గా అతికించకపోతే రెట్టింపు రుసుము

సాక్షి, హైదరాబాద్: వాహనాలపై ఫాస్ట్‌ట్యాగ్‌ను ఎలా పడితే అలా అతికిస్తామంటే ఇకపై కుదరదు. జాతీయ రహదారుల అధికార సంస్థ నిబంధనల ప్రకారం ఫాస్ట్‌ట్యాగ్ అతికించక పోతే .. చెల్లించాల్సిన మొత్తానికి రెట్టింపు రుసుము చెల్లించాల్సి వస్తుంది. టోల్‌ప్లాజా వద్ద ఫాస్ట్‌ట్యాగ్‌తో చెల్లించేందుకు నిరాకరించి.. నగదు రూపంలో చెల్లిస్తామని మొండికేస్తే ఏకంగా బ్లాక్‌లిస్టులో పడిపోతారు. ఇటీవల జాతీయ రహదారుల అధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) దీనికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. టోల్ వసూలుకు సంబంధించి భారత జాతీయ రహదారుల నియంత్రణ సంస్థ (ఐహెచ్ఎంసీఎల్)కు పలు సూచనలు చేసింది.

ఎందుకంటే ?

పలువురు ఫాస్ట్‌ట్యాగ్‌ను తమ వాహనాలకు సరిగ్గా అతికించట్లేదని, నిర్దేశిత ప్రాంతాల్లో అతికించకపోవడంతో స్కానింగ్ జాప్యమై చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని ఎన్‌హెచ్ఏఐ గుర్తించింది. కొందరైతే ఫాస్ట్‌ట్యాగ్‌లను వాహనాలకు అతికించకుండా చేతిలో పట్టుకుని స్కాన్ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇక కారు ముందు అద్దానికి లోపలి నుంచి అతికించాలని ఎన్‌హెచ్ఏఐ చెబుతోంది. దానికి విరుద్ధంగా ఫాస్ట్‌ట్యాగ్‌ను ప్రదర్శించే వారిని నియంత్రించేందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. పైగా, లోపలి నుంచి కాకుండా బయటి నుంచి ఫాస్ట్‌ట్యాగ్‌లను అతికిస్తే ఎవరైనా ట్యాంపర్ చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా తొలగించడం కానీ తస్కరించి వేరే వారి వాహనాలకు అతికించుకునే వీలు కల్పించినట్టు అవుతుంది.

బ్యాంకులకు, ఏజెంట్లకు సూచనలు..

ఫాస్ట్‌ట్యాగ్ వినియోగంలో వినియోగదారులతో పాటు వాటిని జారీచేసే బ్యాంకులు, ఏజెంట్లకు కూడా ఎన్‌హెచ్ఏఐ పలు సూచనలు చేసింది. ఫాస్ట్‌ట్యాగ్‌ను జారీ చేయడంతో పాటు వాటిని సరిగ్గా అతికించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలా చేయకపోతే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

మూడు గంటల్లో చర్యలు..

వాహనాలపై ఫాస్ట్ ట్యాగ్ సరిగ్గా లేదని గమనిస్తే టోల్ ఆపరేటర్లు వెంటనే సదరు బ్యాంకు లేదా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలని సూచించింది. సరైన ఆధారాలు, ఫొటోలతో ఫిర్యాదు చేయాలని పేర్కొంది. ఇలా ఫిర్యాదు అందిన మూడు గంటల్లో సదరు ఫాస్ట్‌ట్యాగ్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని బ్యాంకులను ఆదేశించింది. సెలవు దినాలు, ఆదివారాల్లో మాత్రం నాలుగు గంటల్లోపు బ్లాక్‌లిస్టు చేయాలని పేర్కొంది. టోల్ గేట్ల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఈ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించింది.

వెల్‌డన్.. టీజీ నార్కోటిక్స్ బ్యూరో

పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టివేతపై అభినందించిన ఎన్‌సీబీ డైరెక్టర్

సాక్షి, హైదరాబాద్: డ్రగ్ పెడ్లర్లను, గంజాయి గ్యాంగులను పరుగులుపెట్టిస్తున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ)కి జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. డ్రగ్స్ కేసుల నమోదు, గంజాయి, ఇతర డ్రగ్స్ పట్టివేత.. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను ధ్వంసం చేయడంలో చురుగ్గా పనిచేస్తున్నారంటూ తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులను కేంద్ర హోంశాఖ అధికారులు ప్రశంసించారు. నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమ అమలు, డ్రగ్స్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు అవగాహన కార్యక్రమాల ఏర్పాటుపై జాతీయ స్థాయిలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన అన్ని రాష్ట్రాల డీజీపీలు, హోంశాఖ ముఖ్యకార్యదర్శులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోల ఉన్నతాధికారులతో గురువారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ డీజీపీ జితేందర్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవి గుప్తా, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్


సందీప్ శాండిల్య

బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో జోనల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా డ్రగ్స్ ముఠాల కట్టడి, డ్రగ్స్ బారిన పడకుండా యువతను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్, ఇతర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 6 నెలలుగా తెలంగాణలో డ్రగ్స్ కట్టడికి తీసుకున్న చర్యలను వివరించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసుల నమోదులో తెలంగాణ ముందు ఉండడంపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో డైరెక్టర్ సత్యనారాయణ్‌ప్రధాన్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా ప్రశంసించినట్టు టీజీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య 'సాక్షి'కి తెలిపారు. గత ఆరు నెలల్లో 48 టన్నుల డ్రగ్స్‌ను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తికి మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రదానం రేపు

తెనాలి


జస్టిస్ రాధారాణి

గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయిని, సేవామూర్తి మొవ్వా విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రదానోత్సవం ఆమె వర్ధంతి రోజైన ఈ నెల 20న తెనాలిలో జరగనుంది. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకు స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సభకు సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించనున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ గురిజాల రాధారాణికి ఈ అవార్డు ప్రదానం చేసి, సత్కరించనున్నారు. అనంతరం జస్టిస్ రాధారాణి 'విద్యార్థుల భవిష్యత్ సవాళ్లు'పై మొవ్వా విజయలక్ష్మి స్మారకోపన్యాసం చేయనున్నారు.గత మార్చిలో పదో తరగతి పరీక్షల్లో 550కుపైగా మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికను కూడా ఇదే వేదికపై ఇవ్వనున్నట్లు సత్యనారాయణ వెల్లడించారు. ఈ సార్మక అవార్డును 2022లో సీనియర్ ఐపీఎస్ అధికారి కేజీవీ సరితకు, 2023లో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు ప్రదానం చేసినట్లు గుర్తు చేశారు.

ట్రోలింగ్‌లపై చర్యలు తీసుకోండి

- కొన్ని యూట్యూబ్ చానళ్లలో మహిళా నటులను కించపరిచేలా వ్యవహరిస్తున్నారు

డీజీపీకి ఫిర్యాదు చేసిన సినీ నటులు రాజీవ్ కనకాల, శివ బాలాజీ
ట్రోలర్లపై నిఘా ఉంచుతామని హామీనిచ్చిన డీజీపీ

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌లు, వ్యక్తిత్వ హననానికి అడ్డుకట్ట వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను పలువురు సినిమా నటులు కోరారు. ఈ మేరకు సినీ నటులు శివకృష్ణ, శివబాలాజీ, రాజీవ్ కనకాల తదితరులు గురువారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం డీజీపీ కార్యాలయం సమీపంలో వారు మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్‌కు గురవుతున్న వారిలో ఎక్కువగా మహిళా ఆర్టిస్టులు ఉంటున్నారని, వారి వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చేలా కొందరు కామెంట్లు పెడుతున్నారని నటుడు శివకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శివబాలాజీ మాట్లాడుతూ... సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఘోరంగా మారిందని, ఇటీవల తండ్రీ కూతుళ్లపై హనుమంతు చేసిన అనుచిత వ్యాఖ్యలు శోచనీయమన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ...ట్రోల్స్ అనేవి నవ్వుకునేలా ఉండాలి కానీ, ఏడిపించేలా ఉండకూడదన్నారు. ఇప్పటివరకు 25 యూ ట్యూబ్ చానళ్లను బ్యాన్ చేయించామని, మరో 200 యూ ట్యూబ్ ఛానళ్లపై డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేసినట్టు వారు పేర్కొన్నారు. దీనికి డీజీపీ స్పందిస్తూ.. ట్రోలర్లపై నిఘా ఉంచుతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కోలుకుంటున్న నారాయణమూర్తి

- కంగారుపడాల్సిన అవసరం లేదు.. ఆరోగ్యంగానే ఉన్నారు: నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్


నారాయణమూర్తిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జూపూడి, సంగీత దర్శకుడు మోహన్

లక్డీకాపూల్: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు ఆర్.నారాయణమూర్తి కోలుకుంటున్నారని నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆరోగ్యం పట్ల కంగారు పడాల్సిన అవసరం లేదని ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. మరికొన్ని వైద్య పరీక్షలు చేయాల్సి ఉందని శుక్రవారం ఆయనను డిశ్చార్జ్ చేసే అవకాశాలున్నాయని చెప్పారు.

పలువురు ప్రముఖుల పరామర్శ

నిమ్స్‌లో గురువారం నారాయణ మూర్తిని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు,మాజీ ఎమ్మెల్సీ, ఏపీ సామాజిక న్యాయ మాజీ సలహాదారులు జూపూడి ప్రభాకరరావు, సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్, సినీ గాయకుడు అర్జున్‌లు పరామర్శించారు.

రూ.60 కోట్ల మోసం!

- ప్రీలాంచ్ పేరుతో ముందస్తుగా డబ్బు వసూలు
- కొల్లూరులో అపార్ట్‌మెంట్లు, విల్లాలు నిర్మిస్తున్నామంటూ వల
- జీఎస్‌ఆర్ ఎండీ శ్రీనివాసరావు అరెస్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో మరో ప్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ ధరకే అపార్ట్‌మెంట్లు, విల్లాలు అందిస్తామంటూ వల వేసి అమాయకుల నుంచి రూ.60 కోట్లు వసూలు చేసిన జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ ఎండీ శ్రీనివాసరావును సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించింది. వివరాలు.. గుంటూరుకు చెందిన గుంటుపల్లి శ్రీనివాసరావు, చదలవాడ శ్రీనివాసరావు, వేమవరపు సత్యశిల్పలతో కలిసి రెండేళ్ల క్రితం జీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్ పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థను ప్రారంభించారు. కొల్లూరులో విల్లాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నామని అందమైన బ్రోచర్లు ముద్రించారు. సామాజిక మాధ్యమాలలో తెగ ప్రచారం చేశారు. ప్రీలాంచ్ స్కీమ్‌లో తక్కువ ధరకే విల్లాలు, అపార్ట్‌మెంట్లు అందిస్తామని సామాన్యులను ఆకర్షించారు. సుమారు 32 మంది బాధితుల నుంచి రూ.కోట్లలో వసూలు చేశారు. కస్టమర్లు కొంత అమౌంట్ జమ చేశాక.. బాధితులతో అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రాజెక్ట్‌ను మూడేళ్లలో పూర్తి చేస్తామని లేకపోతే మొత్తం డబ్బును 24 శాతం వడ్డీతో తిరిగి చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కాలేదు. ఇదేంటని కస్టమర్లు ప్రతినిధులను సంప్రదించగా.. సంబంధిత భూమి న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకుందని, కొంత కాలం నిరీక్షించాలని కాలయాపన చేశారు. అయినా ఎంతకీ ప్రాజెక్ట్ పనులు మొదలు కాలేదు, కట్టిన డబ్బు కూడా వెనక్కి ఇవ్వలేదు. దీంతో బోరబండకు చెందిన కార్తీక్ మోటమర్రి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాక్ష్యాధారాలతో నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేశారు. ఇప్పటికే జీఎస్‌ఆర్ గ్రూప్‌పై హైదరాబాద్ సీసీఎస్‌లోనూ చీటింగ్ కేసు నమోదైంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 19-7-2024

వంటిల్లు



చిటుక్కు పుటుక్కు రుచులు

చిటుకు పుటుకుమని వొలిచి తినే పల్లీలు వంటగదిలో మరింత రుచిగల పదార్థాలవుతాయి. అవి ఇవే...

పల్లీ పకోడీ



కావలసినవి: వేరు శనగపప్పు – పావు కిలో (పచ్చివి); శనగపిండి – 2 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– టేబుల్ స్పూన్; మొక్కజొన్న పిండి (కార్న్‌ఫ్లోర్)– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; చాట్ మసాలా పొడి– టీ స్పూన్; ఇంగువ – పావు టీ స్పూన్; నిమ్మరసం – టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; నీరు – పావు లీటరు (అవసరాన్ని బట్టి వేయాలి); నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● వేరుశనగపప్పును మెత్తటి వస్త్రంలో వేసి తుడవాలి. ఆ తర్వాత వాటిని ఒక పాత్రలో వేయాలి. అందులో శనగపిండి, బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మిరప్పొడి, చాట్ మసాలా, ఇంగువ, ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు నిమ్మరసం వేసి మరోసారి సమంగా కలపాలి. ఇప్పుడు కొద్ది కొద్దిగా నీటిని వేస్తూ పిండి వేరుశనగపప్పుకు పట్టేటట్లు మిశ్రమాన్ని తడి పొడిగా కలుపుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేయాలి. మరగడం మొదలైన తర్వాత మంట తగ్గించి వేరుశనగపప్పుల మిశ్రమాన్ని చేత్తో తీసుకుని వేళ్లను కదుపుతూ గింజలు విడివిడిగా పడేటట్లు జాగ్రత్తగా నూనెలో వదలాలి. నూనెలో కాలుతున్నప్పుడు చిల్లుల గరిటెతో కలియబెడుతూ లోపల గింజలో పచ్చిదనం పోయి దోరగా వేగే వరకు కాలనిచ్చి తీయాలి. ఇలా మొత్తం పప్పులను వేయించి ఒక పాత్రలో వేయాలి ● ఇప్పుడు అదే నూనెలో కరివేపాకులు వేసి చిటపటలాడిన తర్వాత తీసి పకోడీ మీద వేసి కలపాలి. ఈ పల్లీ పకోడీ మరీ వేడి ఉన్నప్పుడు తింటే రుచి తెలియదు. వేడి తగ్గిన తరవాత తినాలి. చల్లారిన తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే వారం రోజులు తాజాగా ఉంటాయి.

పీ నట్ చాట్



కావలసినవి: వేరు శనగపప్పు – కప్పు (వేయించినవి); ఉల్లిపాయ – 1 (తరగాలి); టొమాటో – 1 (తరిగి గింజలు తొలగించాలి); కొత్తిమీర తరుగు – పావు కప్పు; నిమ్మరసం – టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; చాట్ మసాలా– టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; నూనె– 2 టీ స్పూన్‌లు.

తయారీ: ● బాణలిలో నూనె వేడి చేసి స్టవ్ ఆపేయాలి. నూనెలో మిరప్పొడి, చాట్ మసాలా, వేరు శనగపప్పు వేసి కలపాలి. పప్పు వేడెక్కిన తర్వాత ఒక పాత్రలోకి తీసుకుని ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, కొత్తిమీర వేయాలి. చివరగా నిమ్మరసం చల్లి, ఉప్పు కలపాలి. ఇది అన్ని వయసుల వారికీ మంచి ఆహారం.



* జ్యువెలరీ

పచ్చని వేడుక

ఫ్యాషన్



వివాహ వేడుకలో పచ్చల హారాలు ధరించిన నీతా అంబానీ, ఈషా అంబానీ

వేడుకలలో పచ్చల హారాలు ధరించడం ఇప్పుడు బాగా ట్రెండ్‌లో ఉందని చాటడానికి ఇటీవల అంబానీ ఇంట జరిగిన పెళ్లి వేడుకనే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. నీతా అంబానీ సుమారు 500 కోట్ల ఖరీదైన విక్టోరియా పచ్చల హారం ధరించి అందరి దృష్టిని ఆకర్షించడమే కాదు, కాస్తంత అసూయనూ కలిగించింది. వధూవరుల నుంచి వివాహ వేడుకకు వచ్చిన తారలు ఐశ్వర్యరాయ్, అలియా భట్, ప్రియాంక చోప్రా ... వంటి అతిథులు కూడా పచ్చల హారాల్లో మెరిసిపోయారు. దీంతో'పచ్చ' అత్యంత విలాసవంతమైన రత్నంగా వేడుకలకు కళను తీసుకు వస్తూనే ఉంటుంది. ఎమరాల్డ్‌గా పిలిచే ఈ రత్నం ఎంత పెద్దగా ఉంటే ధర కూడా అంత ఎక్కువగా ఉంటుంది.

> పచ్చలను మొదటిసారిగా ఈజిప్టులో క్రీ.పూ. 330 ల కాలంలో తవ్వకాలలో గుర్తించినట్టు తెలుస్తోంది. ప్రపంచంలోని అత్యంత విలువైన రత్నాలలో పచ్చలు అగ్రస్థానంలో ఉన్నాయి.

ఇన్‌స్పైరింగ్ జ్యువెలరీ



సెలబ్రిటీలు ధరించిన లాంటి ఆభరణాలను అంతకన్నా చాలా తక్కువ ధరలో మార్కెట్లోకి డిజైనర్లు తీసుకువస్తున్నారు. అందుకని, ఒరిజనల్ పచ్చలతో ఉన్న హారాలను సామాన్యులు ధరించడం అసాధ్యం అని వెనకడుగు వేయనక్కర్లేదు. వాటి స్ఫూర్తితో జ్యువెలరీ రంగంలో ఇమిటేషన్ రత్నాలు పుట్టుకు వచ్చాయి. నాణ్యతను బట్టి ధరలలో మార్పులు ఉంటాయి. కోట్ల విలువైన రత్నాలను పోలి ఉండేవి వేలల్లో లభిస్తున్నాయి. వీటితో డైమండ్స్, కుందన్స్ కాంబినేషన్స్‌తో ఇతర ఇమిటేషన్ జ్యువెలరీ రూపుదిద్దుకుంటోంది.

రిచ్‌గా... దర్పంగా!

పచ్చల వరసల హారాలు కూడా వేడుకలలో దర్పాన్ని, హుందాతనాన్ని, రిచ్‌నెస్‌ను చూపుతుంటాయి. ఎరుపు, క్రీమ్, తెలుపు దుస్తుల మీద మరింత సొబగును తెచ్చే పచ్చల హారాలు వేడుకల్లో ప్రధానంగా ఆకట్టుకుంటాయి. ఇక ఆభరణాల జాబితాలో 'పచ్చ'ల హారం ఒకటి తప్పక చేర్చాల్సిందే, మహారాణి కళతో వెలిగిపోవాల్సిందే అనే ఆలోచన రాకుండా ఉండదు.

ఫ్యాషన్ - ఆర్ట్

ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్ అద్భుతమైన కలయికతో రూపుదిద్దుకున్న వెడ్డింగ్ లెహంగా డ్రెస్ ఇది. అనంత్ అంబానీతో రాధికా మర్చంట్ వివాహం కోసం ఆర్టిస్ట్ జయశ్రీ బర్మన్ డిజైనర్ ద్వయం అబు జానీ సందీప్ ఖోస్లాతో కలిసి ఈ చిత్రకళ లెహంగాను రూపొందించారు.

జయశ్రీ బర్మన్ ఢిల్లీలోని తన స్టూడియోలో'ఒక నెల మొత్తం ఈ లెహంగా ఫ్యాబ్రిక్‌పై పెయింటింగ్ చేయడానికి వెచ్చించింది.'అనంత్–రాధికల కలయికకు ప్రతీకగా ఖగోళ మానవ బొమ్మలు, జంతుజాలం, ముఖ్యంగా ఏనుగులపై అనంత్‌కు ఉన్న ప్రేమను చూపేలా ఈ సృజనాత్మక కళ రూపుదిద్దుకుంది' అని వివరించే బర్మన్ రోజుకు 15–16 గంటల సమయాన్ని ఈ ఆర్ట్‌వర్క్‌కు కేటాయించినట్టుగా వివరిస్తోంది.

కోల్‌కతాలో జన్మించిన జయశ్రీ బర్మన్ ఇండియన్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. పెయింటింగ్‌లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, ప్యారిస్‌లో ప్రింట్ మేకింగ్ కోర్సు చేసిన బర్మన్ తన పెయింటింగ్ ద్వారా పౌరాణిక కథలను కళ్లకు కడతారు. ఆర్టిస్ట్‌గానే కాదు, రచయిత్రిగానూ జాతీయ అవార్డులు అందుకున్న ఘనత బర్మన్‌ది.



జయశ్రీ బర్మన్



జయశ్రీ బర్మన్ చిత్రించిన లెహంగాను వివాహ వేడుకలో ధరించిన రాధికా మర్చంట్



↑ భద్రాచలం టెంపుల్ పెయింట్ వేస్తూ...



గుడిని గుడికి కానుకగా ఇస్తే ఎంత బాగుంటుంది? తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నామోజు లావణ్య దేశంలోని ఆలయాలకు వెళ్లి అక్కడి ఆధ్యాత్మికతను, గుడి ప్రాంగణాన్ని, ఆలయ గోపురాలను లైవ్ పెయింటింగ్ చేసి ఆ చిత్రాలను గుడికే బహుమానంగా ఇస్తోంది. దీని వల్ల గుడి రూపం చిత్రకళలో నిలుస్తోంది. అలాగే గుడికి వచ్చే భక్తులకు ఆలయ సౌందర్యాన్ని తెలియచేస్తుంది.

ఆలయ చిత్రం

'ప్రతి ముఖ్యమైన గుడిలో నా చిత్రం ఉండాలి. అలాగే మరుగున పడిన గుడి నా చిత్రకళ ద్వారా కాస్తయినా ప్రచారం పొందాలని ఆలయ చిత్రాలను లైవ్ పెయింటింగ్ ద్వారా నిక్షిప్తం చేస్తున్నాను. ఇందుకు వస్తున్న ఆదరణ ఆనందం కలిగిస్తోంది' అంది పాతికేళ్ల నామోజు లావణ్య. 'ఇందుకు నా పెయింటింగ్స్ అమ్మకాల వల్ల వచ్చే డబ్బునే ఉపయోగిస్తున్నాను ఇటీవల భద్రాచల ఆలయంలోని సీతారాముల వారి మూర్తులు, ఆలయం లైవ్ పెయింటింగ్ చేసి దేవస్థానానికి అందజేశాను' అందామె. ఒకరకంగా ఇది ఆధ్యాత్మిక చిత్రకళా సాధన అని కూడా అనుకోవచ్చు.

మన సంస్కృతి కోసం

'మాది యాదాద్రి భువనగిరి. కామర్స్‌తో డిగ్రీ పూర్తి చేశాను. పోటీ పరీక్షలకు హాజరై, ఉద్యోగం తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాను. కానీ నా ఇష్టం మొత్తం పెయింటింగ్స్ మీదే ఉంది. దీంతో ఏడాది నుంచి పెయింటింగ్‌నే నా వృత్తిగా మార్చుకున్నాను. స్కూల్ ఏజ్ నుంచి నోట్ బుక్స్‌లో పెయింటింగ్స్ వేస్తుండేదాన్ని. పాశ్చాత్య సంస్కృతి పెరుగుతున్న ఈ కాలంలో సోషల్‌మీడియా ద్వారా మన సంస్కృతిని, మంచిని కూడా పరిచయం చేయవచ్చు అనిపించి సంవత్సరం నుంచి ఆలయ శిల్పాన్ని, హైందవ సంస్కృతిని నా ఆర్ట్ ద్వారా చూపుతున్నాను'.



మెదక్ జిల్లాలో మరివడ దగ్గరలో రాక్ స్టోన్స్‌పై వేసిన పెయింటింగ్స్

రాక్ స్టోన్స్ పై జంతువులు



'మెదక్ జిల్లా మరపడ దగ్గర ఒక వెంచర్ వాళ్లు ఆర్ట్‌కు సంబంధించిన విషయం మాట్లాడటానికి పిలిస్తే నేను, మా అంకుల్ శ్రీనివాస్ వెళ్లాం. అక్కడ ఒక గ్రామ దేవత టెంపుల్ చుట్టూ ఉన్న పెద్ద పెద్ద రాళ్లను చూశాక వాటిని ఆకారాలుగా చూపవచ్చనిపించింది. మొత్తం 42 రకాల పెద్ద పెద్ద రాక్ స్టోన్స్ ఉన్నాయి. వాటిని ఏనుగులు, ఆవులు, కోతులు, తాబేలు, కొలనుగా రంగులద్ది మార్చాను. మొన్నటి మే నెల ఎండలో వేసిన పెయింటింగ్స్. అక్కడికి వచ్చినవాళ్లు 'ఆడపిల్ల అంత పెద్ద రాళ్లు ఎక్కి ఏం పెయింటింగ్స్ వేస్తుంది' అన్నారు. కానీ అవి పూర్తయ్యాక చాలా సంతోషించారు' అంది లావణ్య.

వెడ్డింగ్ లైవ్ ఆర్ట్

'వివాహవేడుక జరుగుతుండగా ఆ సన్నివేశం, సందర్భం చూడటానికి చాలా బాగుంటుంది. లైవ్ ఆర్టిస్ట్‌ను అని తెలియడంతో గత పెళ్లిళ్ల సీజన్‌లో వివాహం జరుగుతుండగా ఆ సీన్ మొత్తం పెయింటింగ్ చేసే అవకాశం వచ్చింది. చాలా ఆనందంగా ఆ కార్యక్రమాన్ని కళ్లకు కట్టినట్టుగా చిత్రించి, ఇచ్చాను. కాలేజీ రోజుల్లోనే తొమ్మిది నెలల పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. యువతకు మోటివేషనల్ స్పీచ్‌లు ఇస్తుంటాను. షీ టీమ్ వారు 'షీ ఫర్ హర్' అవార్డు ఇచ్చారు. నాన్న సురేందర్ కరోనా సమయంలో చనిపోయారు. అమ్మ గృహిణి. తమ్ముడు శివప్రసాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్ చేస్తున్నాడు. గ్రామీణ నేపథ్యం గల కుటుంబమే మాది. నా కళకు సపోర్ట్ చేసేవారుంటే మరెన్నో విజయాలు అందుకోవచ్చు' అంటూ తెలిపింది ఈ హార్టిస్ట్.

– నిర్మలారెడ్డి



● డిస్మార్ఫియా

అందంగా లేనా? అస్సలేం బాలేనా?

ప్రసిద్ధ దర్శకుడు కరణ్ జోహార్ తాను 'డిస్మార్ఫియా డిజార్డర్'తో బాధ పడుతున్నానని తెలిపాడు. శరీరంలోని ఏదో ఒక అవయవం పట్ల వ్యక్తిలో తీవ్రమైన అసంతృప్తి ఉండి అది సరిగా లేదని పదే పదే బాధపడటమే ఈ డిజార్డర్. యువతీ యువకుల్లో టీనేజీ కాలంలో ఇది పొడుకుంటే ముస్ముందు వారు సామాజిక జీవితంలో ఇబ్బందిపడాల్సి ఉంటుంది. తగిన కౌన్సెలింగ్‌తో దీని నుంచి బయటపడొచ్చు.

ఒక సైకియాట్రిస్ట్ దగ్గరకు ఒక టీనేజ్ అమ్మాయి వచ్చింది. ఆ అమ్మాయి చూడటానికి అందరూ భావించేటట్టుగా 'అందం'గా ఉంది. చర్మం రంగు, రూపం, హైట్ అన్నీ బాగున్నాయి. కాని ఆ అమ్మాయికి 'నా ముక్కు బాగా లేదు' అని సందేహం, అనుమానం, అదే నిజం అనిపించే అబ్సెషన్. ఆ ముక్కును ఎలా అందంగా చేయించాలి అనేదే ఆమె సమస్య. 'కాదు నీ ముక్కు చక్కగా ఉంది. నువ్వు అనుకున్నంత లోపం ఏ మాత్రం లేదు' అని వీరికి చెప్తే ఒక నిమిషం తెరిపిన పడతారు. మరో నిమిషంలోనే ఆ అనుమానం పెనుభూతంలా ముందుకొస్తుంది. ఈ రుగ్మతను 'బాడీ డిస్మార్ఫియా డిజార్డర్' అంటారు. ఇది అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్‌లో ఒక కోవ కిందకు వస్తుంది. ఇది ఉన్నట్టుగా చాలామందికి తెలియదు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో దర్శకుడు కరణ్ జోహార్ దీని గురించి మాట్లాడి తాను ఆ డిజార్డర్‌తో బాధపడుతున్నట్టు చెప్పాడు. 'అందుకే నేను లూజ్ బట్టలు ధరిస్తాను' అని తెలిపాడు.

మైఖేల్ జాక్సన్ కూడా

డిస్మార్ఫియా డిజార్డర్‌తో బాధపడిన వాళ్లలో మైఖేల్ జాక్సన్ ఒకడు. అతనికి తన ముక్కు నచ్చలేదు. దాని వల్ల లెక్కకు మించి ప్లాస్టిక్ సర్జరీలు చేసి చివరకు ప్లాస్టిక్ ముక్కు అంటించాల్సి వచ్చింది. మగవారికి తమ జుట్టు, కళ్లు, భుజాలు, పురుషాంగం, పిరుదులు... వీటిలో ఏదో ఒకటి అస్సలు బాగలేదనే భావన బాల్యంలోనో టీనేజీలోనో స్థిరపడిపోతుంది. ఆడవాళ్లకు తమ కళ్లు, ముక్కు, పెదవులు, ఒంటి రంగు... వీటిలో ఏదో ఒక అవయవం గురించి అసంతృప్తి ఏర్పడుతుంది. నిజానికి లోకంలో ఎవరూ చెక్కినట్టుగా ఉండరు. ప్రతి ఒక్కరూ ఎలా ఉన్నా తమదైన రూపంతో బాగానే ఉంటారు. అయితే డిస్మార్ఫియా డిజార్డర్‌లో చూడటానికి మెరుగ్గా ఉన్నా, అంతపెద్ద లోపం ఏదీ లేకపోయినా వారి మైండ్ 'నీ ఫలానా అంగం ఏం బాగ లేదు బాగలేదు' అని చెప్తూ ఉంటుంది.

మిర్రర్ చెకింగ్

ఈ డిజార్డర్‌తో బాధపడేవాళ్లు తమకు లోపం ఉందని భావిస్తూ బట్టలతో, ఆభరణాలతో దానిని కవర్ చేసుకుంటున్నామని అనుకుంటూనే పదే పదే అద్దంలో చూసుకుంటూ ఉంటారు. లేదా ఎదుటివారిని 'బాగున్నానా బాగలేనా?' అని అడుగుతూ విసిగిస్తూ ఉంటారు. 'బాగున్నావ్' అన్నా నమ్మరు. ప్లాస్టిక్ సర్జరీ, కాస్మటిక్ సర్జరీలు చేయించుకున్నా వీరికి సంతృప్తి కలగదు. ఎందుకు? సమస్య మైండ్‌లో ఉంది కాబట్టి. ఈ సమస్య ఉన్నవారు కాలక్రమంలో నలుగురినీ కలవని స్థితికి చేరుకుంటారు.

కౌన్సెలింగ్

డిస్మార్ఫియా డిజార్డర్‌తో బాధ పడేవారు ముందు చేయవలసిన పని తమ యథాతథ రూపాన్ని యాక్సెప్ట్ చేయడం. 'నేను నా రూపాన్ని సంపూర్ణంగా అంగీకరిస్తున్నాను' అని పదే పదే చెప్పుకుంటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. లేదా సైకియాట్రిస్ట్‌లను కలిస్తే వారు కౌన్సెలింగ్‌తో సమస్యను దూరం చేస్తారు. లేదా మరీ పదే పదే అందుకు సంబంధించి నెగెటివ్ థాట్స్ వస్తుంటే మందులతో చికిత్స చేస్తారు. ప్రకృతిలో ప్రతి ప్రాణి భిన్నమైన రూపాలతో ఉంటారని తెలుసుకుంటే శారీరక లోపాలకు సంబంధించిన ఇలాంటి రుగ్మతలు దరి చేరవు.



కరణ్ జోహార్

హెల్త్ ఫ్యాక్ట్

మోకాళ్ల నొప్పుల నివారణ ఇలా



ఆర్థరైటిస్ కారణంగా మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు తాము వాకింగ్ చేస్తే తమ మోకాళ్లు మరింతగా అరిగిపోతాయని అపోహపడుతుంటారు. ఇది వాస్తవం కాదు. నిజానికి మోకాళ్ల కదలికలు ఎంత ఎక్కువగా ఉంటే అక్కడ అంత బాగా రక్తప్రసరణ అవుతుంటుంది. దాంతో కీళ్లకు పోషకాలు బాగా అందడమే కాకుండా కండరాలూ, ఎముకలు బాగా బలపడతాయి. ఆర్థరైటిస్‌తో బాధపడేవారే కాకుండా, మధ్యవయసుకు వచ్చిన ఆరోగ్యవంతులందరూ వెంటనే వాకింగ్ మొదలుపెట్టడం మంచిది. సైక్లింగ్ వల్ల మోకాళ్లు మరింత అరుగుతాయనుకుంటారు కానీ ఒంటి బరువు పడకపోవడంతో సైక్లింగ్ కూడా మంచిదే. శరీరం బరువు మోకాళ్ల మీదా, తమ కాళ్ల మీద పడదు కాబట్టి స్విమ్మింగ్ కూడా మంచి ఎక్సర్‌సైజ్. పైగా స్విమ్మింగ్‌లో కేవలం మోకాళ్లకే కాకుండా ఒంటికంతటికీ మంచి వ్యాయామం సమకూరుతుంది.


● మేజారి మల్లికార్జున

యువర్స్

● టెక్... టాక్



యూట్యూబ్ వీడియోలలో కాప్షన్స్ కోసం...

యూట్యూబ్ వీడియోలలో మాన్యువల్ ట్రాన్‌స్క్రిప్షన్స్‌ను కాప్షన్స్‌గా యాడ్ చేయడానికి... ● యూట్యూబ్ స్టూడియోలో సైన్ కావాలి ● కాప్షన్ యాడ్ చేయాలనుకున్న వీడియోపై క్లిక్ చేయాలి ● సబ్‌టైటిల్స్ ట్యాబ్–క్లిక్ ● యాడ్ బటన్–ట్యాప్ ● కాప్షన్ లాంగ్వేజ్‌ను సెలెక్ట్ చేసుకోవాలి ● ట్రాన్‌స్క్రిప్ట్ ఫైల్ అప్‌లోడ్ చేయాలా, కాప్షన్‌లను నేరుగా ఎడిటర్‌లో టైప్ చేయాలా అనేది ఎంచుకోవాలి ● ట్రాన్‌స్క్రిప్ట్ ఫైల్‌ను అప్‌లోడింగ్ చేసుకోవాలనుకుంటే 'చూజ్ ఫైల్' బటన్‌పై నొక్కాలి ● కాప్షన్‌లను యాడ్ చేసిన తరువాత 'సేవ్' బటన్ నొక్కాలి.

● యువ శక్తి

'డోంట్ లిమిట్ యువర్ ఛాలెంజెస్. ఛాలెంజ్ యువర్ లిమిట్స్' అనే మాట ఉంది. ఖాజాపాషా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ తన కల నెరవేర్చుకున్నాడు. బాడీ బిల్డింగ్ పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో నలభై పతకాలు గెలుచుకున్నాడు.

– తాండ్ర కృష్ణగోవింద్, సాక్షి, కొత్తగూడెం

ధైర్యం తోడై ఉంటే... నీదే విజయం..!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణం నుంచి ఎంతో మంది వెయిట్ లిఫ్టర్లుగా రాణించారు. ఇలాంటి వారిలో మహ్మద్ హుసేన్ ఒకరు. జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటి పైకి వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. దీంతో కెరీర్ కోసం కన్న కలలను పక్కన పెట్టి ఇల్లెందులో ఫ్రూట్ వెండర్‌గా స్థిరపడిపోయాడు. అయితే ఇంట్లో వెయిట్ లిఫ్టర్‌గా హుస్సేన్ చేసే కసరత్తులు అతని కొడుకు ఖాజాపాషాకు ఆసక్తి కలిగించేవి. తండ్రి వెయిట్ లిఫ్టింగ్ చేస్తుంటే అది చూసి డంబెల్స్ ఎత్తడం ఖాజాపాషాకు అలవాటుగా మారింది.

తండ్రి స్ఫూర్తితో... తండ్రి స్ఫూర్తితో ఖాజాపాషా టీనేజ్ నుంచే బాడీ బిల్డింగ్ వైపు అడుగు వేశాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతూ 2012లో కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. ప్రొఫెషనల్ కోచ్ లేకుండానే ఈ విజయం సాధించడం ఖాజాపాషాలో మరింత ఉత్సాహాన్ని నింపింది.

నేషనల్ టైటిల్ కోసం... పద్నాలుగేళ్ల కిందట జూనియర్ విభాగంలో తృటిలో చేజారిన నేషనల్ ఛాంపియన్ టైటిల్‌ను ఇప్పుడు సీనియర్ విభాగంలో సాధించేందుకు ఖాజా శ్రమిస్తున్నాడు. 2025 ఫిబ్రవరిలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం అవుతున్నాడు. తన జిమ్‌పై వచ్చే ఆదాయంతో డైట్‌ను మెయింటైన్ చేస్తూ, కోచ్‌ల సహకారం తీసుకుంటున్నాడు. అతడి కల నెరవేరాలని ఆశిద్దాం.

కలల బాటలో....
బాడీ బిల్డింగ్ అంటే జిమ్‌కు వెళ్లి వర్కవుట్లు చేయడం ఒక్కటే కాదు. అందుకు తగ్గ డైట్ అవసరం. కనీసం నెలకు రూ.60 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇల్లెందు వంటి ఓ మోస్తరు పట్టణంలో పండ్ల దుకాణంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబానికి ఇది తలకు మించిన భారమే. బాడీ బిల్డర్‌గా తనకు వచ్చిన గుర్తింపుతో కలల గమ్యానికి దారులు పరచుకునేందుకు ఇల్లెందును వీడి కరీంనగర్, వరంగల్ నగరాలకు ఖాజాపాషా మకాం మార్చాడు. కరీంనగర్, వరంగల్‌లలో వివిధ జిమ్‌లలో కోచ్‌గా పని చేస్తూ వచ్చిన డబ్బుతో బాడీ బిల్డింగ్ పోటీలకు హాజరయ్యేవాడు. అలా మిస్టర్ కరీంనగర్ - 2018, మిస్టర్ వరంగల్ - 2023 టైటిల్స్ అతడి ఖాతాలో చేరాయి. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నలభై వరకు మెడల్స్ సాధించాడు.

● ఏఐ ఏరియా



జెమిని డబుల్ చెక్ రెస్పాన్స్ ఫీచర్

ఏఐ జనరేట్ చేసిన కంటెంట్ ఇప్పుడు సర్వసాధారణం అయింది. దాని ప్రామాణికత నిర్ధారించుకోవడం కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని గూగుల్ జెమినీ ఏఐ చాట్‌బాట్ సహాయంతో 'డబుల్ చెకింగ్' ఫీచర్‌ని తీసుకువచ్చింది. ఏఐ జనరేట్ చేసిన కంటెంట్ ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి జెమిని ఏఐ యూజర్‌లు ఇప్పుడు గూగుల్ సెర్చ్‌ను ఉపయోగించవచ్చు.

● గేమింగ్

ఆ ప్రపంచంలోకి అడుగు పెట్టాలంటే...



యాక్షన్–అడ్వెంచర్ వీడియో గేమ్ 'డంజెన్స్ ఆఫ్ హింటర్‌బర్గ్' విడుదల అయింది. ఈ గేమ్‌లో ప్రధాన పాత్ర లుయిసా. ప్లేయర్స్ ప్లే చేసే పాత్ర కూడా. రకరకాల పజిల్స్‌నే ఛేదించుకుంటూ ప్లేయర్ ముందుకు వెళ్లాల్సి ఉంటుంది.

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ సిరీస్ ఎస్ **ఇంజిన్:** యూనిటీ **జానర్స్:** రోల్‌ప్లేయింగ్ వీడియోగేమ్, అడ్వెంచర్ గేమ్, ఫైటింగ్ గేమ్.

● యంగ్ టాలెంట్

గిన్నిస్ వీరుడు

ఒక రికార్డు సాధిస్తే ప్రశంసలు...
ఆ రికార్డు గిన్నిస్ రికార్డ్ అయితే పురస్కారాలు...
అలాంటి గిన్నిస్ రికార్డులు మూడు అందుకుంటే...
రికార్డులకే రికార్డు... రికార్డ్ బ్రేక్.
ఈ రికార్డుల బ్రేక్ వీరుడు మన తెలుగు కుర్రాడు.
పేరు మేజారి మల్లికార్జున... ఊరు నడిగడ్డ.

– దేశిరెడ్డి గిరీశ్, సాక్షి, చిత్తూరు

నడిగడ్డ ఊరు ఎక్కడుందా అని గూగుల్ చేస్తే కనిపిస్తుందని ఆ ఊరి వాళ్లు అనుకోలేదు. ప్రపంచ రికార్డుల జాబితాలో తమ ఊరి పేరు నమోదవుతుందని ఊహలో కూడా అనుకోలేదు. ఆంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లా, సదుం మండలంలో ఉంది నడిగడ్డ అనే చిన్న గ్రామం. ఆ ఊరిలో సామాన్య రైతు కుటుంబం మల్లికార్జునది. అమ్మ రాజమ్మ, నాన్న చిన్న మల్లయ్య వ్యవసాయం చేస్తారు. ఈ నేపథ్యం నుంచి ఎదిగిన కుర్రాడు మల్లికార్జున. ఇప్పటి వరకు మూడు గిన్నిస్ రికార్డులను సాధించాడు. ఆ వివరాలు అతడి మాటల్లోనే...

ఆరోజు నుంచి...

నేను పుట్టపర్తి శ్రీసత్యసాయి యూనివర్సిటీలో బీఏ, ఎంఏ ఎకనమిక్స్ చేసి 2020లో ఎకనమిక్స్‌లో పీహెచ్‌డీ చేశాను. యోగా మీద ఆసక్తి కొద్దీ భీమిలిలో యోగాలో పీజీ డిప్లమో చేశాను. నా దృష్టి రికార్డుల మీదకు మళ్లడానికి కారణం మా అమ్మ. ఆమె చదువుకోలేదు, కానీ ఓ సందర్భంలో మా ఇంటి దగ్గరలో ఉన్న వారితో మాట్లాడుతూ 'నువ్వు కష్టసాధ్యమైన పని చేస్తే గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిస్తా' అనడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. నిరక్షరాస్యులు కూడా గిన్నిస్ రికార్డు గురించి మాట్లాడగలుగుతున్నారంటే అవి ఎంతటి ప్రాచుర్యంలోకి వచ్చాయో కదా అనిపించింది. అప్పటి నుంచి ఎవరెవరి పేరుతో ఏమేమి రికార్డులున్నాయని శోధించాను. ఆ తర్వాత నేను కూడా రికార్డు సాధించడం దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టాను.

– మేజారి మల్లికార్జున



తొలి రికార్డు యోగాలో...
నా రికార్డుల పరంపర 2022, ఫిబ్రవరిలో మొదలైంది. మొదటి రికార్డు యోగాలో. అష్టవక్రాసనంలో నాలుగు నిమిషాల పాటు ఉన్నాను. విశాఖపట్నం, భీమిలిలోని యోగాశ్రమంలో ఇద్దరు నిపుణుల పర్యవేక్షణలో జరిగింది. ఆ వీడియో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాను. అష్టవక్రాసనంలో ఎక్కువ సేపు ఉన్న వ్యక్తిగా రికార్డు నమోదైంది.

కాలింగ్ కోడ్ రెండవ రికార్డ్...
రెండవ రికార్డు 2023, జనవరిలో. ఒక్క నిమిషంలో 56 దేశాల కాలింగ్ కోడ్‌లు గుర్తించడం ద్వారా ఆ రికార్డు సాధించాను. బెంగళూరు నుంచి వచ్చిన నిపుణులు పరిశీలించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మూడవ రికార్డు టైపింగ్‌లో. ఒకటి నుంచి యాభై వరకు అంకెలను వేగంగా టైప్ చేయడం టార్గెట్. నాకంటే ముందు ఈ రికార్డును 2015లో హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి సాధించారు. నేను 2023లో 13.66 సెకన్ల సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేసి ఆయన 14.88 సెకన్ల సమయంలో సాధించిన రికార్డును బ్రేక్ చేయగలిగాను.

మరో రికార్డు దిశగా...
.నా తొలి రెండు రికార్డులను ఇటీవల మరో ఇద్దరు బ్రేక్ చేశారు. నేను మరో రికార్డు కోసం సాధన చేస్తున్నాను. ఇక వృత్తి పరంగా 'ధీర ఎడ్యుకేర్' పేరుతో ఓ స్టార్టప్ ప్రారంభించాను. వ్యక్తిత్వ వికాసం, కెరియర్ గైడెన్స్, యోగ సాధనలో శిక్షణనిస్తున్నాను.

● మ్యూజిక్ వరల్డ్



లిసా సరిగమ

ఆహా అనిపించే అద్భుత గాత్రం ఆమె సొంతం. 'సజా' సింగిల్‌తో తాజాగా మరోసారి సంగీతప్రియులు 'వావ్' అనుకునేలా చేసింది లిసా. చికాగో నుంచి మొదలైన సంగీత ప్రయాణంలో ఎంతోమంది నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంది. తనను తాను మెరుగుపరుచుకుంది. 'పాట ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు ఆమె చెప్పే జవాబు...'కృత్రిమంగా ఉండకూడదు. అది మన వ్యక్తిగత అనుభవాల నుంచి నడిచొచ్చినట్లుగా ఉండాలి. ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉన్న శ్రోతలైనా మమేకమయ్యేలా ఉండాలి' రకరకాల ఫీలింగ్స్‌ను సంగీతంలోకి అనువదించడం అనేది కళ. ఆ కళలో పట్టు సాధించింది లిసా. నాన్–ఫిల్మ్ మ్యూజిక్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లేవారే ఎక్కువ. లిసా మాత్రం బాలీవుడ్ నుంచి నాన్–ఫిల్మ్ మ్యూజిక్‌లోకి అడుగు పెట్టింది. 'ఇదొక స్వీయ అన్వేషణ ప్రయాణం' అంటుంది. 'నేను నా సంగీతం మాత్రమే' అని తనకు తాను పరిధులను విధించుకోవడం లేదు లిసా. 'అడ్డంకులను అధిగమిస్తాను. ప్రయాణానికి అడ్డుపడే నిబంధనలను సవాలు చేస్తాను. నాన్–ఫిల్మ్ ఫిమేల్ ఆర్టిస్ట్‌లు ప్రపంచ వేదికపై మెరవడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను' అంటుంది లిసా మిశ్రా.

English Idioms

సెకండ్ టు నన్

ఒక వ్యక్తి ప్రతిభ, ఒక ప్రాడక్ట్‌లోని వైవిధ్యం... మొదలైనవాటికి సంబంధించి గొప్పగా చెప్పేటప్పుడు వాడే మాట...సెకండ్ టు నన్. **ఉదా:** 1.ఇన్ పెర్‌ఫార్మెన్స్ ఆర్ట్స్, హర్ టాలెంట్ అండ్ వెర్సటాలిటీ ఆర్ సెకండ్ టు నన్ 2.అవర్ ల్యాబ్స్ ఇన్నోవేటివ్ సోల్యూషన్స్ అండ్ డిస్కవరీస్ ఆర్ సెకండ్ టు నన్. సెట్టింగ్ ఏ న్యూ ఇండస్ట్రీ స్టాండర్డ్.

ఎక్స్‌క్యూజ్ మై ఫ్రెంచ్

అభ్యంతరకరమైన, అసభ్యకరమైన భాషను ఉపయోగించినందుకు క్షమాపణ చేప్పే సందర్భంలో ఉపయోగించే మాట... ఎక్స్‌క్యూజ్ మై ఫ్రెంచ్. **ఉదా:** ఎక్స్‌క్యూజ్ మై ఫ్రెంచ్, బట్ దట్ మూవీ వాజ్ అబ్‌సొల్యూట్లీ క్రాప్.

సినిమా

సరికొత్త రికార్డు


● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న విడుదలైంది. కాగా 'బుక్ మై షో'లో అత్యధిక టికెట్లు బుక్ అయిన ఇండియన్ సినిమాగా 'కల్కి 2898 ఏడీ' సరికొత్త రికార్డు సృష్టించినట్లు మేకర్స్ పేర్కొన్నారు. ''12.15 మిలియన్+టిక్కెట్ సేల్స్ (దాదాపు కోటీ 20 లక్షలు)తో 'బుక్ మై షో'లో హయ్యస్ట్ సేల్స్ మూవీగా 'కల్కి 2898 ఏడీ' నిలిచింది. షారుక్ ఖాన్ నటించిన 'జవాన్' సినిమా 12.01 మిలియన్ల టిక్కెట్ సేల్స్ రికార్డును సాధించింది. 'కల్కి 2898 ఏడీ' విడుదలైన కేవలం 20 రోజుల్లోనే 'జవాన్' రికార్డును దాటింది. వీకెండ్‌తో పాటు వీక్ డేస్‌లోనూ మా సినిమా వసూళ్లు చాలా స్టడీగా ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



రెడీ... సెట్... గో


● అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రం తాజా షెడ్యూల్ షూటింగ్‌కి రెడీ సెట్ గో అంటున్నారు మేకర్స్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'పుష్ప: ది రైజ్' (2021) వంటి బ్లాక్‌బస్టర్ మూవీకి సీక్వెల్‌గా సేమ్ కాంబినేషన్‌లో 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. షెడ్యూల్ ప్రకారం చిత్రీకరణ పూర్తి అయ్యుంటే ఆగస్టు 15న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. అయితే షూటింగ్ సకాలంలో పూర్తి కాకపోవడం.. క్వాలిటీ విషయంలో చిత్రయూనిట్ రాజీ పడకపోవడంతో ఈ మూవీని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక తాజా షెడ్యూల్ విషయానికి వస్తే.. ఈ నెల 22 లేదా 25న ప్రారంభం అవుతుందట. ఈ నెల 28 నుంచి అల్లు అర్జున్ కూడా చిత్రీకరణలో పాల్గొంటారని సమాచారం. శరవేగంగా చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి, డిసెంబరు 6నే సినిమాని విడుదల చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారని భోగట్టా.

డిసెంబరులో కన్నప్ప


● విష్ణు మంచు

విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతీ ముకుందన్ వంటి వారు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాని డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గురువారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు విష్ణు. అయితే విడుదల తేదీ ఎప్పుడన్నది మాత్రం స్పష్టం చేయలేదు. శివ భక్తుడైన కన్నప్ప కథతో 'కన్నప్ప' రూపొందుతోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ సినిమా విడుదల కానున్న సంగతి తెలిసిందే.

ఓటీటీ – ఇది చూడొచ్చు


ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ఫ్రీలాన్స్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



యాక్షన్ సినిమా అంటే పూర్తిగా యాక్షనే కాదు కామెడీతో కూడిన యాక్షన్ చిత్రాలు ఇదివరలో మనం చాలానే చూశాం. అదే కోవలో విడుదలైన హాలీవుడ్ చిత్రం 'ఫ్రీలాన్స్' ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. జాన్ సెనా వంటి సీరియస్ యాక్షన్ కథానాయకుడు నటించిన చిత్రం ఈ 'ఫ్రీలాన్స్'. ఈ చిత్రకథలో కథానాయకుడు ఒకప్పుడు ఆర్మీలో పని చేసి ఓ వ్యక్తి చేసిన తప్పిదానికి ఆర్మీ నుండి అనుకోకుండా సస్పెండ్ అవుతాడు. కొంతకాలం తరువాత తన స్నేహితుడి ద్వారా అతనికి ప్రైవేట్ ఆర్మీలో పని చేసే అవకాశం లభిస్తుంది. ఆ ప్రైవేట్ ఆర్మీ మొదటి ఆపరేషన్ ఓ మహిళా జర్నలిస్టుకి బాడీగార్డ్‌గా వ్యవహరించడం. ఆ జర్నలిస్టు ఓ దేశాధిపతిని ఇంటర్వ్యూ చేయడానికి వెళ్ళే తరుణంలో కథానాయకుడిని బాడీగార్డ్‌గా తీసుకువెళుతుంది. అక్కడ ఆ దేశాధిపతి మీద దాడి జరుగుతుంది. ఆ దాడిని కథానాయకుడు ఎలా ఎదుర్కొన్నాడు? జర్నలిస్ట్‌ను ఎలా రక్షించాడు? అనేది ఓటీటీ తెర మీద చూడాల్సిందే. ఈ కథ కాన్సెప్ట్ సీరియస్ అయినా స్క్రీన్‌ప్లే మాత్రం హాస్యభరితంగా ఉంటుంది. పియర్ మొరెల్ దర్శకత్వంలో రూపొందిన ఈ 'ఫ్రీలాన్స్' వీకెండ్ వ్యూవర్స్‌కు మస్ట్ వాచ్ అని చెప్పొచ్చు.

– ఇంటూరి హరికృష్ణ

దీపావళికి రాకీ


● విశ్వక్ సేన్

దీపావళికి థియేటర్స్‌కు వస్తున్నాడు మెకానిక్ రాకీ. విశ్వక్ సేన్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న యాక్షన్ చిత్రం ఇది. ఈ చిత్రాన్ని అక్టోబరు 31న దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్లుగా గురువారం ప్రకటించి, విశ్వక్ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు మేకర్స్. కామెడీ, యాక్షన్ అంశాల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్ స్వరకర్త.

హం పరమేశ్వరం...


● అశ్విన్ బాబు

'రం రం ఈశ్వరం... హం పరమేశ్వరం... యం యం కింకరం... వం గంగాధరం...' అంటూ మొదలవుతుంది 'రం రం ఈశ్వరం' పాట. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ జంటగా నటించిన 'శివం భజే' సినిమాలోనిది ఈ పాట. ఆధ్యాత్మిక అంశాల మేళవింపుతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీని అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించారు. ఈ చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రం రం ఈశ్వరం' పాట లిరికల్ వీడియోను సంగీత దర్శకుడు తమన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. సంగీత దర్శకుడు వికాస్ బడిస సారథ్యంలో పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటను సాయిచరణ్ పాడారు. ''మా సినిమా చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి'' అన్నారు మహేశ్వర్ రెడ్డి.

ఆస్పత్రిలో జాన్వీ కపూర్

హీరోయిన్ జాన్వీ కపూర్ అస్వస్థతకు గురయ్యారు. కల్తీ ఆహారం తినడం వల్ల జాన్వీ అనారోగ్యానికి గురయ్యారని, దీంతో ముంబైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరారని, రెండు రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జ్ అవుతారని జాన్వీ తండ్రి–నిర్మాత బోనీ కపూర్ వెల్లడించినట్లుగా బాలీవుడ్ మీడియా చెబుతోంది. అయితే ముందుగా జాన్వీ కపూర్ ఆస్పత్రిపాలయ్యారని వార్తలు రావడంతో ఆమె అభిమానులు షాక్ అయ్యారు. స్వల్ప అస్వస్థత మాత్రమే అని బోనీ కపూర్ పేర్కొనడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక తెలుగులో ఎన్టీఆర్ 'దేవర', రామ్‌చరణ్ 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్), హిందీలో వరుణ్ ధావన్‌తో 'సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి' చిత్రాలతో బిజీగా ఉన్నారు జాన్వీ. అలాగే ఈ బ్యూటీ నటించిన హిందీ చిత్రం 'ఉలజ్' ఆగస్టులో విడుదలకు రెడీ అవుతోంది.

సింగరో సింగ


● శ్రీవిష్ణు

'రాజ రాజ చోర' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రీతూ వర్మ, మీరా జాస్మిన్, దక్షా నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలో సింగరేణి అలియాస్ సింగ పాత్రలో శ్రీవిష్ణు నటిస్తున్నట్లుగా వెల్లడించి, 'సింగరో సింగ' అనే పాట లిరికల్ వీడియోను కూడా విడుదల చేశారు. 'సింగరో సింగ.. అబ్బో సింగరో సింగ...' అంటూ మొదలై, 'పక్కక్ జరుగుర్రి... దండల్ గుచ్చుర్రీ... దండాలు గిండాలు పెట్టుర్రి... ఆస్తందు సింగ... సింగరో సింగ..' అంటూ సాగే ఈ పాటకు వివేక్ సాగర్ స్వరాలందించగా నిక్లేష్ సుంకోజీ సాహిత్యం అందించారు. బాబా సెహగల్–వైకోమ్ విజయలక్ష్మి పాడారు.

ముందుగానే ఆపరేషన్ రావణ్


● రక్షిత్

రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను తొలుత ఆగస్టు 2న విడుదల చేయాలనుకున్నారు. అయితే వారం రోజులు ముందుగానే అంటే ఈ నెల 26న విడుదల చేయనున్నట్లుగా గురువారం చిత్రయూనిట్ ప్రకటించింది. వెంకట సత్య దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మించారు.

పల్లెటూరిలో ఉరుకు


● తేజస్

'హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను అలరించిన తేజస్ కంచర్ల హీరోగా నటించిన తాజా సినిమా 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికి ఫైడ్' అన్నది ట్యాగ్ లైన్. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించారు. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం 'ఉరుకు పటేల'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	627	81,343
నిఫ్టీ ▲	188	24,801

విదేశీ సూచీలు (బొరి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,917	▽ 80
డోజోన్స్	40,936	▽ 262
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,205	△ 17
డాక్స్	18,355	▽ 83
షాంఘై	2,977	△ 14
నికాయ్	40,126	▽ 971

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	73,979
బంగారం (99.5 స్వచ్ఛత)	73,683
వెండి (కిలో)	91,555

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.18	84.20
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.22	109.81
€	యూరో	ఎస్‌బీఐ	89.94	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.38	53.53
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.72	57.67
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.87	23.66
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.46

81,000 దాటిన సెన్సెక్స్

- 24,800కి నిఫ్టీ
- 4వ రోజూ రికార్డుల ర్యాలీ



ముంబై: దేశీయ స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ నాలుగోరోజూ కొనసాగింది. అధిక వెయిటేజీ టీసీఎస్(3%), ఇన్ఫోసిస్(2%), రిలయన్స్(1%), ఐసీఐసీఐ బ్యాంక్(1%) చొప్పున రాణించి సూచీల రికార్డు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు సెప్టెంబర్ నుంచి ప్రారంభం కావచ్చొనే అంచనాలూ సానుకూల ప్రభావం చూపాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 627 పాయింట్ల లాభంతో 81,343 వద్ద ముగిసింది. నిఫ్టీ 188 పాయింట్లు పెరిగి 24,801 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు సూచీలకు సరికొత్త రికార్డులు కావడం విశేషం. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా బలహీనంగా ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి మార్కెట్ లాభాల బాట పట్టింది. ఒక దశలో సెన్సెక్స్ 806 పాయింట్లు బలపడి 81,523 వద్ద, నిఫ్టీ 225 పాయింట్లు ఎగసి 24,838 వద్ద జీవిత కాల గరిష్టాలు నమోదు చేశాయి.

- ఐటీ కంపెనీలు ప్రకటిస్తున్న జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మెప్పిస్తున్నాయి. సెప్టెంబర్‌లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు ఈ రంగ షేర్లకు మరింత డిమాండ్ పెంచాయి. ఎల్‌టీఐఎం 3.50%, టీసీఎస్ 3%, విప్రో 2.50%, ఇన్ఫోసిస్, పెర్సిస్టెంట్, కోఫోర్జ్, టెక్ మహీంద్రా 2% రాణించాయి. ఎంఫసీస్‌లు ఒకశాతం లాభపడ్డాయి.

రూపాయి రికార్డ్ కనిష్టం @ 83.63

దేశీ కరెన్సీ డాలరుతో మారకంలో చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 5 పైసలు నీరసించి 83.63 వద్ద ముగిసింది. రూపాయి 83.57 వద్ద ప్రారంభమై ఇంట్రాడేలో 83.66 వరకూ క్షీణించింది.

ఇన్ఫోసిస్.. గుడ్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 6,368 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 5,945 కోట్లు ఆర్జించింది. అయితే త్రైమాసిక(క్యూ4)వారీగా చూస్తే నికర లాభం రూ. 7,969 కోట్ల నుంచి 20 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయం 3.6 శాతం మెరుగుపడి రూ. 39,315 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 37,933 కోట్ల టర్నోవర్ సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని ప్రోత్సాహకరంగా ప్రారంభించినట్లు ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. మెరుగైన మార్జిన్లు, భారీ డీల్స్, రికార్డ్ నగదు ఆర్జనను సాధించినట్లు తెలియజేశారు.

ఈ షేరు బీఎస్‌ఈలో 2% ఎగసి రూ. 1,759 వద్ద ముగిసింది.

- క్యూ1లో నికర లాభం రూ. 6,368 కోట్లు
- ఆదాయ అంచనాపెంపు
- 15,000–20,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్
- కంపెనీ చరిత్రలోనే రికార్డ్ ఫ్రీ క్యాష్ ఫ్లో



మీడియాతో సీఈఓ సలీల్ పరేఖ్, సీఎఫ్‌వో జయేష్ ఎస్

3-4 శాతం వృద్ధి

తాజా త్రైమాసికంలో ఇన్ఫోసిస్ నిర్వహణ లాభ మార్జిన్లు 0.3 శాతం బలపడి 21.1 శాతంగా నమోదయ్యాయి. పూర్తి ఏడాదికి 20–22 శాతం మార్జిన్లు సాధించగలమని అంచనా వేస్తోంది. పూర్తి ఏడాదికి ఆదాయంలో నిలకడైన కరెన్సీ ప్రాతిపదికన 3–4 శాతం వృద్ధిని సాధించగలమని కంపెనీ తాజాగా అంచనా వేసింది. గతంలో విడుదల చేసిన 1–3 శాతం వృద్ధి అంచనాల (గైడెన్స్)ను ఎగువముఖంగా సవరించింది.

ఇతర విశేషాలు

- క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 9,155 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో సాధించింది. ఇది 59 శాతం వృద్ధి.
- ఈ ఏడాది సాధించగల వృద్ధి ఆధారంగా 15,000 నుంచి 20,000మంది వరకూ ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించే వీలున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో జయేష్ ఎస్. తెలియజేశారు.
- క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 4.1 బిలియన్ డాలర్ల విలువైన 34 భారీ డీల్స్‌ను కుదుర్చుకుంది. ఇవి 78 శాతం అధికంకాగా.. వీటిలో కొత్త కాంట్రాక్టుల వాటా 58 శాతం.
- ఉద్యోగుల సంఖ్య 6 శాతం తగ్గి 3,15,332కు పరిమితమైంది. గతేడాది క్యూ1లో మొత్తం సిబ్బంది సంఖ్య 3,36,294కాగా.. జనవరి–మార్చి(క్యూ4)లో 3,17,240గా నమోదైంది.
- స్వచ్ఛంద ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 12.7 శాతంగా నమోదైంది. గత క్యూ1లో ఇది 17.3 శాతంకాగా.. క్యూ4లో 12.6 శాతంగా నమోదైంది.

ముద్రా రుణాల పరిమితి రెట్టింపు చేయాలి

రుణ హామీ కవరేజీనీ పెంచాలి • ఎంఎస్‌ఎంఈల వినతి



రాబోయే బడ్జెట్‌లో ముద్రా యోజన కింద ఇచ్చే రుణాల పరిమితిని రెట్టింపు చేయాలని, రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచాలని చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈ) కేంద్రాన్ని కోరుతున్నాయి. అలాగే అన్‌సెక్యూర్డ్ రుణాలకు రుణ హామీ కవరేజీని రూ. 2 కోట్ల నుంచి రూ. 5 కోట్లకు పెంచాలని ఆశిస్తున్నాయి. అటు అంతర్జాతీయంగా తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి తగు మద్దతు కూడా కల్పించాలని కోరుకుంటున్నాయి. ఎంఎస్‌ఎంఈల వృద్ధికి ఊతమిచ్చేలా ప్రభుత్వం తన ఎజెండాను కొనసాగించే అవకాశం ఉందని బడ్జెట్‌పై నెలకొన్న అంచనాలను అర్క ఫిన్‌క్యాప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నవీన్ సైనీ తెలిపారు. ముద్రా రుణాల పరిమితిని పెంచడం తదితర అంశాలతో ఎంఎస్‌ఎంఈలకు మరిన్ని ఆర్థిక వనరులు అందుబాటులోకి రాగలవని, వాటి ఎదుగుదలతో పాటు ఎకానమీ వృద్ధికి కూడా దోహదపడగలవని వివరించారు.

రియల్టీ ఆశలు..

బడ్జెట్‌పై రియల్ ఎస్టేట్ రంగానికి చాలా ఆశలు ఉన్నట్లు క్రిసుమి కార్పొరేషన్ ఎండీ మోహిత్ జైన్ తెలిపారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లు రికార్డు స్థాయికి చేరడంలో వేతన జీవులు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో గృహ రుణాలపై చెల్లించే అసలు, వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితిని పెంచాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. గత కొన్నాళ్లుగా ప్రాపర్టీల విలువ భారీగా పెరిగినందున గృహ రుణ వడ్డీపై పన్ను రిబేటును ప్రస్తుతమున్న రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. మరోవైపు స్టార్టప్‌ల కోసం పన్నుల విధానాన్ని సరళతరం చేస్తే అంకుర సంస్థలకు ఊరట లభించగలదని సీఆర్ఐబీ సహ వ్యవస్థాపకుడు సన్నీ గర్గ్ తెలిపారు. ఏంజెల్ ట్యాక్స్‌ను తొలగించడం లేదా క్రమబద్ధీకరించడమో చేస్తే దేశీయంగా నిధుల లభ్యత మెరుగుపడుతుందని, ప్రారంభ దశలోని అంకుర సంస్థలకు ఫండింగ్‌పరమైన వెసులుబాటు లభించగలదని పేర్కొన్నారు.



– సాక్షి, బిజినెస్ డెస్క్



వజీర్‌ఎక్స్‌లో విత్‌డ్రాయల్స్ నిలిపివేత

230 మిలియన్ డాలర్ల కరెన్సీ అనుమానాస్పద లావాదేవీలు

న్యూఢిల్లీ: క్రిప్టో ఎక్స్ఛేంజ్ వజీర్‌ఎక్స్‌కి చెందిన మల్టీసిగ్ వాలెట్ల నుంచి 230 మిలియన్ డాలర్ల విలువ చేసే కరెన్సీ అనుమానాస్పద రీతిలో బదిలీ కావడం కలకలం రేపింది. దీనితో ఈ ఉదంతంపై విచారణ జరుపుతున్నట్లు సంస్థ తెలిపింది. క్రిప్టో, రూపాయి మారక విత్‌డ్రాయల్స్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపింది. రెండు లేదా అంతకు మించి ప్రైవేట్ 'కీ'స్ అవసరమయ్యే పటిష్టమైన మల్టీసిగ్ వాలెట్ల నుంచి 230 మిలియన్ డాలర్ల క్రిప్టో కరెన్సీ అనుమానాస్పదంగా బదిలీ విషయాన్ని సంస్థ ధృవీకరించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులో 102 మిలియన్ డాలర్ల విలువ చేసే షిబా ఇను, 52.5 మిలియన్ డాలర్ల ఎథీరియం, 11.24 మిలియన్ డాలర్ల మ్యాటిక్, 7.6 మిలియన్ డాలర్ల పెపె కాయిన్, 135 మిలియన్ డాలర్ల టెథర్, 3.5 మిలియన్ డాలర్ల గాలా క్రిప్టో కరెన్సీలు ఉన్నట్లు సమాచారం.

భారత్‌లో రూ. 500 కోట్ల పెట్టుబడులు : తోషిబా గ్రూప్

న్యూఢిల్లీ: భారత్‌లో కార్యకలాపాల విస్తరణపై 10 బిలియన్ జపాన్ యెన్‌లు (సుమారు రూ. 500 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తోషిబా గ్రూప్ వెల్లడించింది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ సామర్థ్యాన్ని 1.5 రెట్లు పెంచుకునేందుకు తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) ఈ నిధులను వెచ్చించనున్నట్లు వివరించింది. 2024–2026 ఆర్థిక సంవత్సరాల మధ్య ఈ మేరకు ఇన్వెస్ట్ చేయనున్నట్లు టీటీడీఐ చైర్‌పర్సన్ హిరోషి ఫురుటా తెలిపారు. భారత్‌లో తయారీ, భారత్ నుంచి ఎగుమతుల నినాదానికి అనుగుణంగా చేసే ఈ పెట్టుబడులతో నిర్వహణ సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపర్చుకోనున్నట్లు వివరించారు. భారత మార్కెట్లో ట్రాన్స్‌ఫార్మర్ల డిమాండ్‌ను తీర్చడానికి, ఎగుమతులను పెంచుకోవడానికి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల విస్తరణ తోడ్పడగలదని హిరోషి పేర్కొన్నారు.



అరబిందో ఫార్మా రూ.750 కోట్ల షేర్ల బైబ్యాక్

ఒక్కో షేరు ధర రూ. 1,460

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా తాజాగా రూ. 750 కోట్ల వరకు విలువ చేసే షేర్లను బైబ్యాక్ చేయనుంది. ఇందుకోసం షేరు ఒక్కింటికి రూ. 1,460 ధరను నిర్ణయించింది. దీనికి సంబంధించిన 51,36,986 షేర్ల కొనుగోలు ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు కంపెనీ వెల్లడించింది. బైబ్యాక్ స్కీము కోసం జూలై 30ని రికార్డు తేదీగా నిర్ణయించినట్లు వివరించింది. జూన్ 30 ఆఖరు నాటి గణాంకాల ప్రకారం కంపెనీలో ప్రమోటర్లకు 51.8%, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లకు (ఎఫ్ఐఐ) 16.73%, మ్యూచువల్ ఫండ్స్‌కు 19.17 శాతం వాటాలు ఉన్నాయి.

ఎన్ఎస్ఈలో అరబిందో ఫార్మా షేరు రెండున్నర శాతం క్షీణించి రూ. 1,338 వద్ద క్లోజయ్యింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మెప్పించిన కరూర్ వైశ్యా బ్యాంక్ | ఇళ్లకు పటిష్ట డిమాండ్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-7-2024	
విశాఖ	575–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

సాక్షి స్పోర్ట్స్



టాప్ సీడ్ జోడీని ఓడించిన అనిరుధ్-అర్జున్ ద్వయం

హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్ మ్యాచ్‌లో అనిరుధ్-అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6-3, 3-6, 10-7తో టాప్ సీడ్, 28వ ర్యాంక్ జోడీ లామోన్స్ -విత్రో (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రస్తుతం అనిరుధ్ 128వ ర్యాంక్‌లో, అర్జున్ 111వ ర్యాంక్‌లో ఉన్నారు.

పోప్ సెంచరీ: ఇంగ్లండ్ 416 ఆలౌట్

వెస్టిండీస్‌తో గురువారం నాటింగ్‌హామ్‌లో మొదలైన రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 88.3 ఓవర్లలో 416 పరుగులకు ఆలౌటైంది. ఓలీ పోప్ (121; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేశాడు. డకెట్ (71; 14 ఫోర్లు), స్టోక్స్ (69; 8 ఫోర్లు) రాణించారు. ఇంగ్లండ్ 4.2 ఓవర్లలో 50 పరుగులు చేసి టెస్టుల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన జట్టుగా తమ పేరిటే ఉన్న రికార్డును బద్దలు కొట్టింది. 1994లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో ఇంగ్లండ్ 4.3 ఓవర్లలో 50 పరుగులు సాధించింది.

భారత టి20 జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్

- శుబ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీ
- వన్డే సిరీస్ ఆడనున్న రోహిత్, కోహ్లి
- శ్రీలంకతో పోరుకు భారత జట్ల ప్రకటన



న్యూఢిల్లీ: భారత టి20 జట్టు రెగ్యులర్ కెప్టెన్‌గా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ నియమితుడయ్యాడు. ఈ నెలలో శ్రీలంక గడ్డపై జరిగే టి20 సిరీస్ నుంచి టీమిండియా పూర్తి స్థాయి జట్టులోకి బరిలోకి దిగనుంది. ఈ ఫార్మాట్ నుంచి సీనియర్లు రోహిత్, కోహ్లి, జడేజాల రిటైర్ కావడంతో 2026 టి20 వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బృందాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శ్రీలంకతో జరిగే టి20, వన్డే సిరీస్ కోసం జట్లను ప్రకటించింది. ఆశ్చర్యకరంగా వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టుకు టి20 వైస్ కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యాను ఆ బాధ్యతల నుంచి తప్పించి కొత్త వైస్ కెప్టెన్‌గా గిల్‌ను నియమించారు. ఫిట్‌నెస్ సమస్యలతో పాటు పని భారం తగ్గించే క్రమంలో అన్ని మ్యాచ్‌లకు ఆడే అవకాశం లేకపోవడంతో పాండ్యా కు కాకుండా గిల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

శ్రేయస్ పునరాగమనం...

శ్రీలంకతో వన్డే సిరీస్ ఆడేందుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఆసక్తిని ప్రదర్శించారు. దాంతో రోహిత్ నేతృత్వంలోనే జట్టు వన్డే సిరీస్ బరిలోకి దిగనుంది. గిల్‌కు వన్డేల్లోనూ వైస్ కెప్టెన్సీ బాధ్యతలు దక్కడం విశేషం. బుమ్రాకు వన్డే సిరీస్ నుంచి కూడా విశ్రాంతి దక్కింది. టి20 కెప్టెన్ సూర్యకుమార్, పాండ్యా, జడేజా కూడా వన్డే జట్టులో లేరు. బీసీసీఐ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయస్ అయ్యర్ తిరిగి భారత జట్టులోకి రావడం విశేషం కాగా... ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ సమయంలో గాయపడిన కేఎల్ రాహుల్ పునరాగమనం చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో రాణించినందుకు పరాగ్‌కు వన్డేల్లోనూ తొలిసారి అవకాశం రాగా, హర్షిత్ రాణాకూ పిలుపు లభించింది. ఈ టూర్‌లో భాగంగా భారత్, శ్రీలంక మధ్య జూలై 27, 28, 30 తేదీల్లో టి20లు...ఆగస్టు 2, 4, 7 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

భారత టి20 జట్టు: సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), జైస్వాల్, రింకూ సింగ్, పరాగ్, పంత్, సామ్సన్, పాండ్యా, దూబే, అక్షర్, సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ఖలీల్, సిరాజ్. **భారత వన్డే జట్టు:** రోహిత్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), కోహ్లి, శ్రేయస్, పరాగ్, పంత్, రాహుల్, హర్షిత్, దూబే, అక్షర్, సుందర్, కుల్దీప్, అర్ష్‌దీప్, ఖలీల్, సిరాజ్.



వినేశ్ ఫొగాట్

PARIS 2024

మరో 7 రోజుల్లో...

'పట్టు' కొనసాగించాలి

ఒలింపిక్స్‌లో నిలకడగా భారత రెజ్లర్ల ప్రదర్శన | 2008 నుంచి పతకాలతో తిరిగి వస్తున్న కుస్తీ వీరులు

ఆశలు రేకెత్తిస్తున్న భారత మహిళా రెజ్లర్లు | అంతిమ్, వినేశ్‌లపై భారీ అంచనాలు

ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో వ్యక్తిగత క్రీడాంశాల్లో భారత్‌కు అత్యధిక పతకాలు అందించిన క్రీడ రెజ్లింగ్. ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో భారత్‌కు ఏడు పతకాలు లభించాయి. 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో ఖాషాబా జాధవ్ కాంస్య పతకాన్ని అందించాడు. ఆ తర్వాత 56 ఏళ్లపాటు ఒలింపిక్స్ నుంచి మన కుస్తీ వీరులు రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. 2008లో సుశీల్ కుమార్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కాంస్య పతకాన్ని సాధించాడు. సుశీల్ పతకంతో అంతర్జాతీయ స్థాయిలో భారత రెజ్లింగ్ ముఖచిత్రం మారిపోయింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సుశీల్ మరోసారి పట్టు సడలించకుండా పోరాడి రజత పతకాన్ని సొంతం చేసుకోగా... యోగేశ్వర్ దత్ కాంస్య పతకం గెలిచాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో మహిళా రెజ్లర్ సాక్షి మలిక్ కాంస్య పతకంతో ప్రతిష్టను పెంచింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో రవి కుమార్ దహియా రజత పతకంతో, బజరంగ్ పూనియా కాంస్య పతకంతో మెరిశారు. గత నాలుగు ఒలింపిక్స్ క్రీడల నుంచి వరుసగా పతకాలు తెస్తున్న భారత రెజ్లర్లు ఇదే ఆనవాయితీని పారిస్ లోనూ కొనసాగించాలని పట్టుదలతో ఉన్నారు. భారత్ నుంచి పారిస్ గేమ్స్‌లో ఆరుగురు రెజ్లర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో అమన్ సెహ్రావత్ (57 కేజీలు)... మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అన్షు మలిక్ (57 కేజీలు), నిషా దహియా (68 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు) బరిలోకి దిగనున్నారు. రెజ్లింగ్ పోటీలు ఆగస్టు 5 నుంచి 11 వరకు జరుగుతాయి.

రవి దహియాను ఓడించి...

గత టోక్యో ఒలింపిక్స్‌లో పురుషుల విభాగంలో భారత్ నుంచి ముగ్గురు రెజ్లర్లు రవికుమార్, బజరంగ్, దీపక్ పూనియా పోటీపడ్డారు. అయితే ఈసారి ఈ ముగ్గురూ పారిస్ బెర్త్‌లు దక్కించుకోలేకపోయారు. పారిస్ గేమ్స్ క్వాలిఫయింగ్ టోర్నీల కోసం భారత రెజ్లింగ్ జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో రవి, బజరంగ్ ఓడిపోగా... దీపక్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో గట్టెక్కలేకపోయాడు. జాతీయ ట్రయల్స్‌లో టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత రవి దహియాను ఓడించిన అమన్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ప్రస్తుత ఆసియా చాంపియన్ అయిన 21 ఏళ్ల అమన్ పారిస్ నుంచి పతకంతో రావాలంటే పక్కా ప్రణాళికలతో, భిన్నమైన వ్యూహాలతో సిద్ధంకావాలి.

సుశీల్, యోగేశ్వర్ సరసన...

మహిళల విభాగంలో అందరి దృష్టి వినేశ్ ఫొగాట్ పైనే ఉండనుంది. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో తడబడ్డ వినేశ్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. తద్వారా సుశీల్, యోగేశ్వర్ దత్ తర్వాత వరుసగా మూడు ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్న తొలి మహిళా రెజ్లర్‌గా, ఓవరాల్‌గా మూడో భారతీయ రెజ్లర్‌గా వినేశ్ గుర్తింపు పొందనుంది. అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న వినేశ్ ఖాతాలో కేవలం ఒలింపిక్ పతకం మాత్రమే లోటుగా ఉంది. జూనియర్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన అంతిమ్ పంఘాల్ ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను దక్కించుకుంది. హరియాణాకు చెందిన 19 ఏళ్ల అంతిమ్ గత ఏడాది ఆసియా క్రీడల తర్వాత మరే టోర్నీలోనూ ఆడలేదు. అయినప్పటికీ అనుకూలమైన 'డ్రా' లభించడంతో అంతిమ్ కీలక బౌట్‌లలో రాణిస్తే తప్పకుండా ఒలింపిక్ పతకంతో తిరిగి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒలింపిక్స్ మినహా మిగతా పెద్ద ఈవెంట్స్‌లో పతకాలు నెగ్గిన అన్షు మలిక్ రెండోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనుంది. టోక్యో ఒలింపిక్స్‌లో చేసిన తప్పిదాలు పునరావృతం చేయకుంటే అన్షు మలిక్ పారిస్‌లో సంచలన ఫలితాలు నమోదు చేసే చాన్స్ ఉంది. తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనున్న నిషా దహియా, రీతిక హుడాలకు చివరి సెకన్లలో పాయింట్లు కోల్పోయే బలహీనత ఉంది. తీవ్రమైన పోటీతత్వం ఉండే ఒలింపిక్స్‌లో వారు ఈ బలహీనతను అధిగమిస్తే అద్భుతం చేసే అవకాశముంది.

–సాక్షి క్రీడా విభాగం



అమన్ | అంతిమ్ పంఘాల్ | నిషా దహియా | అన్షు మలిక్ | రీతిక హుడా

'అవును... మేం విడిపోయాం'

హార్దిక్ పాండ్యా విడాకుల ప్రకటన



న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కీలక విషయాన్ని వెల్లడించాడు. తన భార్య నటాషా స్టన్‌కోవిచ్‌తో వివాహ బంధం ముగిసినట్లు అతను అధికారికంగా ప్రకటించాడు. తామిద్దరం పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు పాండ్యా పేర్కొన్నాడు. వీరిద్దరికి 2020లో వివాహం కాగా...అగస్త్య అనే నాలుగేళ్ల కొడుకు ఉన్నాడు. సెర్బియాకు చెందిన స్టన్‌కోవిచ్ మోడలింగ్, సినిమాల్లో నటిస్తూ ముంబైలో స్థిరపడిన సమయంలో పాండ్యాతో పరిచయం ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. గత కొంత కాలంగా పాండ్యా, స్టన్‌కోవిచ్ మధ్య విభేదాల గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఇద్దరూ దీనిపై ఎప్పుడూ స్పందించలేదు. మరోవైపు విడాకుల తర్వాత కూడా కొడుకుతో మాత్రం తల్లిదండ్రులుగా తమ ఇద్దరి బంధం కొనసాగుతుందని, అతని కోసం అన్ని బాధ్యతలు తీసుకుంటామని పాండ్యా స్పష్టం చేశాడు.

ఆసియా కప్ ట్రోఫీతో నేపాల్, థాయ్‌లాండ్, పాకిస్తాన్, భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏఈ, మలేసియా జట్ల కెప్టెన్లు



భారత్ X పాకిస్తాన్

- నేడు ఆసియా కప్ పోరులో మహిళా జట్ల 'ఢీ'
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

దంబుల్లా: మహిళల ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఘనమైన రికార్డు ఉంది. వన్డే ఫార్మాట్‌లో నాలుగు సార్లు టోర్నీ జరగ్గా... ప్రతీ సారి విజేతగా భారత్ నిలిచింది. టి20 ఫార్మాట్‌లో నాలుగు సార్లు టోర్నీ నిర్వహిస్తే ఒక్కసారి మినహా మూడు సార్లు భారతే చాంపియన్. ఒక్క 2018లో మాత్రమే ఫైనల్లో భారత్‌ను ఓడించి బంగ్లాదేశ్ ట్రోఫీ అందుకుంది. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత జట్టు మరోసారి ఫేవరెట్ ఆసియా కప్ టి20 టోర్నీలో బరిలోకి దిగుతోంది. నేటి నుంచి జరిగే ఈ పోరులో పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో పాటు అసోసియేట్ టీమ్‌లు యూఏఈ, నేపాల్, థాయ్‌లాండ్, మలేసియా కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాయి. ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశ అనంతరం టాప్–2 టీమ్‌లు సెమీస్ చేరతాయి. ఈ నెల 28న ఫైనల్ నిర్వహిస్తారు. శుక్రవారం భారత్ తమ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను ఎదుర్కొంటోంది. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 14 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 11 గెలిచి, 3 మాత్రమే ఓడింది. టోర్నీలో భాగంగా ఈ నెల 21 యూఏఈతో, 23న నేపాల్‌తో భారత్ తలపడుతుంది. ఫామ్‌లో ఉన్న హర్మన్ బృందం ఇటీవల సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టి20 సిరీస్‌ను 1–1తో సమంగా ముగించగా... అంతకుముందు బంగ్లాదేశ్‌ను 5–0తో చిత్తు చేసింది.

క్లుప్తంగా...

కవిత కస్టడీ పొడిగింపు

ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతించిన ట్రయల్ కోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ దాఖలు చేసిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని ట్రయల్ కోర్టు మరోసారి పొడిగించింది. కస్టడీ ముగియడంతో గురువారం రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు జడ్జి కావేరి బవేజా ముందు అధికారులు వర్చువల్ విధానంలో కవితను హాజరుపరిచారు. కవిత కస్టడీని ఈ నెల 22 వరకూ పొడిగిస్తున్నట్లు జడ్జి పేర్కొన్నారు. అయితే, ఇటీవల తీహార్ జైల్లో అస్వస్థతకు గురైన కవితకు దీన్‌దయాళ్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించామని మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి అనుమతి ఇవ్వాలని కవిత తరఫు న్యాయవాదులు కోరారు. దీనికి నిరాకరించిన జడ్జి ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు, చికిత్సకు అనుమతించారు. రెండు రోజుల్లో కవితను ఎయిమ్స్‌కు తీసుకెళ్లాలని, అనంతరం నివేదిక సమర్పించాలని జైలు అధికారులను ఆదేశించారు.

ఆగస్టు 1 నుంచి అభినయ బహుభాషా నాటకోత్సవం

ఎన్నికల కమిషనర్ పార్థసారథి



సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 1 నుంచి 3 వరకు రవీంద్ర భారతిలో 18వ జాతీయ బహుభాషా నాటకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్, అభినయ థియేటర్ ట్రస్ట్ ప్రధాన సలహాదారు సి.పార్థసారథి తెలిపారు. నాటకోత్సవాన్ని రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గురువారం అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్-2024 పోస్టర్‌ను పార్థసారథి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభినయ 70వ నాటకోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, అభినయ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ థియేటర్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా తెలుగు, కన్నడ, నాగ, మణిపురి, మరాఠీ నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. రోజూ మొత్తం ఆరు నాటకాలతో పాటు ప్రారంభ కార్యక్రమంగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ట్రస్టీ క్రోసూరి సుబ్బారావు పాల్గొన్నారు.

23 నుంచి అసెంబ్లీ భేటీ

- 24 నుంచి శాసనమండలి సమావేశాలు
- 25న ఉభయ సభల ముందుకు వార్షిక బడ్జెట్?
- ఈసారి కేసీఆర్ హాజరవుతారంటున్న బీఆర్ఎస్ వర్గాలు




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ మూడో విడత సమావేశాలు ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. శాసనమండలి సమావేశాలు మరుసటి రోజు 24న ఉదయం 10 గంటలకు మొదలవుతాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ తరఫున అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 23న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు మొదటి వారం వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. తొలిరోజు సభ.. దివంగత ఎమ్మెల్యే లాస్య నందితతో పాటు ఇటీవలి కాలంలో మరణించిన పలువురు మాజీ ఎమ్మెల్యేల మరణంపై సంతాపం ప్రకటించిన తర్వాత వాయిదా పడుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణించిన విషయం తెలిసిందే. ఈ నెల 24న శాసనసభ, శాసనమండలి వేర్వేరుగా సమావేశమై సాధారణ బిజినెస్‌ను చేపట్టే అవకాశం ఉంది. అలాగే 25న ఉభయ సభల్లో రాష్ట్ర వార్షిక (2024–25) బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. 26న అసెంబ్లీ సమావేశాలకు విరామం ప్రకటించి 27న బడ్జెట్ ప్రసంగంపై చర్చ చేపడతారు. బోనాల పండుగ నేపథ్యంలో 28, 29 తేదీల్లో సభకు మరోసారి విరామం ప్రకటించి తిరిగి ఈ నెల 30 నుంచి సమావేశాలు కొనసాగించే అవకాశముంది. అయితే సభ ఎజెండా, ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై ఈ నెల 23న స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ భేటీలో నిర్ణయిస్తారు.

గత ఏడాది డిసెంబర్‌లో తొలిసారి

రాష్ట్రంలో గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. కాగా తొలి విడత అసెంబ్లీ సమావేశాలు డిసెంబర్ 9 నుంచి 21వ తేదీ వరకు 6 రోజుల పాటు జరిగాయి. ఇక రెండో విడత ఫిబ్రవరి 9 నుంచి 17వ తేదీ నడుమ 8 రోజుల పాటు జరిగాయి. తొలి విడత సమావేశాల్లో నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక, ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం తదితర అంశాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించింది. ఫిబ్రవరిలో జరిగిన రెండో విడత సమావేశాల్లో 2024- 25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడంతో పాటు సాగునీటి వనరులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది.

అనర్హత కోసం బీఆర్ఎస్ పట్టు!

పార్టీ మారిన శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ అసెంబ్లీ వేదికగా పట్టుబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ మూడో శాసనసభ ఇప్పటివరకు రెండు విడతల్లో సమావేశం కాగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ భేటీకి దూరంగా ఉన్నారు. అయితే వచ్చే బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ త్వరలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యే అవకాశముంది. బీఆర్ఎస్ తరఫున గెలుపొందిన 10 మంది ఎమ్మెల్యేలు ఈసారి సమావేశాల సందర్భంగా అధికార పార్టీతో జట్టు కట్టడం ఆసక్తికరంగా మారనుంది.



'గడి'.. జల సవ్వడి

ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల పరిధి మహితాపురం గ్రామ సమీపంలోని గడి చెరువు జలపాతం కనువిందు చేస్తోంది. ఈ జలపాతం అందాలు తిలకించేందుకు గురువారం వివిధ ప్రాంతాలనుంచి పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. జలపాతం గుండంలో సేదదీరారు.
– వెంకటాపురం (కె)

టీపీసీబీలో ఈసారైనా వారు కదులుతారా?

- నేడో, రేపో జరిగే బదిలీలపై ఆందోళన
- జీహెచ్‌ఎంసీని ఒకే స్టేషన్‌గా పరిగణిస్తారా...!
- ఏళ్ల తరబడి ఇక్కడిక్కడే అటూఇటూ తిరుగుతున్న ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ)లో దీర్ఘకాలికంగా పాతుకుపోయిన వారికి ఈసారైనా స్థానచలనం ఉంటుందా? లేదా ? అన్న ఆందోళనలో కొందరు ఉద్యోగులు ఉన్నారు. సనత్‌నగర్‌లో పీసీబీ హెడ్‌ఆఫీస్, రామచంద్రాపురం, వరంగల్‌లో జోనల్ ల్యాబ్‌లు ఉండగా, పది రీజినల్ ఆఫీసులు ఉన్నాయి. ఈ పదిలో కూడా నాలుగు రీజినల్ ఆఫీసులు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఆర్‌సీపురం) జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. పీసీబీ పరిధిలోని పైస్థాయి సైంటిస్ట్ పోస్టులు, ఇంజనీరింగ్ అధికారులు, స్టాఫ్ మొదలుకొని కిందిస్థాయి ఉద్యోగుల దాకా కొందరు 17 నుంచి 23 ఏళ్ల దాకా ఇక్కడే పనిచేస్తూ.. మళ్లీ ఇక్కడిక్కడే పోస్టింగులు తెచ్చుకుంటున్నారనే విమర్శలున్నాయి. పీసీబీ హెడ్‌ఆఫీస్‌లో ఓ పైస్థాయి అధికారి 23 ఏళ్లుగా, సెంట్రల్ లాబ్‌లో కొందరు 17 ఏళ్లుగా, హైదరాబాద్ రీజినల్ ఆఫీస్‌లో 9 ఏళ్లుగా ఓ అధికారి,. ఇంకా కొందరు సీనియర్ ఇంజనీర్లు, సైంటిఫిక్ స్టాఫ్ కొన్నేళ్లుగా (3,4 ఏళ్లకు మించే) కొనసాగుతున్నారని చెబుతున్నారు. హైదరాబాద్‌కు బయట వివిధ జిల్లాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి జీహెచ్‌ఎంసీ పరిధిలో పనిచేసే అవకాశం రావడం లేదని పలువురు ఉద్యోగులు, అధికారులు వాపోతున్నారు. శుక్ర, శనివారాల్లోనే ఈ బదిలీల ప్రక్రియ ముగిసే అవకాశముంది. ప్రభుత్వం తాజాగా ఈ నెల 12న జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగా జీహెచ్‌ఎంసీ ఏరియాను ఒక స్టేషన్‌గానే పరిగణించి ట్రాన్స్‌ఫర్ చేస్తారా లేక కేవలం మొక్కుబడిగా పైపైన చేసి మళ్లీ దీర్ఘకాలంగా కొనసాగుతున్న వారినే అక్కడక్కడే పోస్టింగ్‌లు ఇస్తారా ? లేకపోతే వారికి ఈసారి ట్రాన్స్‌ఫర్లు ఉంటాయా లేదా సందేహాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. గురువారమే అంతర్గతంగా అందిన సమాచారం మేరకు..వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా కేవలం కిందిస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు,మూడు ఆప్షన్లు మాత్రమే ఇచ్చి బదిలీలు చేపట్టనున్నట్టు తెలుస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. కొందరు సైంటిస్టులు, ఇతర పైపోస్టుల్లో వారిని మాత్రం కదిలించే అవకాశాలు ఉన్నట్టు కనిపించడం లేదంటున్నారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలో 40 శాతం మించరాదనే నిబంధనను ఉపయోగించుకొని 'లాంగ్‌స్టాండింగ్'గా కొనసాగుతున్న సైంటిస్టులు, ఇతర అధికారులు మళ్లీ జీహెచ్‌ఎంసీలోనే పోస్టింగ్‌లు తెచ్చుకుంటారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వంశపారంపర్య అర్చకత్వాన్ని పునరుద్ధరించాలి

- ప్రభుత్వానికి టీపీఎం కన్వీనర్ రంగరాజన్ వినతి
- ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన కన్వీనర్

సాక్షి, హైదరాబాద్: పురాతన దేవాలయాల్లో వంశపారంపర్య ఆర్చక విధానాన్ని పునరుద్ధరించాలని ఆలయాల పరిరక్షణ ఉద్యమ (టీపీఎం) కన్వీనర్, చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు ఎంవీ రంగరాజన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని పురాతన ఆలయాలైన భద్రాద్రి, వేములవాడ, బాసర తదితర ఆలయాల్లో వంశపారంపర్య ఆర్చకత్వాన్ని కొనసాగించాలన్నారు. వంశపారంపర్య అర్చకుల కుటుంబాలను రక్షించడంతో పాటు ఆచారాలను పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు. వంశపారంపర్య అర్చకుల ఆచార వ్యవహారాలను ప్రభుత్వం నిలిపివేస్తే చాలా దేవాలయాలు మూతపడతాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్ ప్రభుత్వం 2007లో ఒక చట్టం ద్వారా వారి సేవలను పునరుద్ధరించిందని గుర్తు చేశారు. కానీ ప్రత్యేక రాష్ట్రంలో ఈ సవరణ చట్టం అమలు కావడం లేదని, ఏపీలో వేలాది అర్చక కుటుంబాలకు వారసత్వ ప్రక్రియను ప్రారంభించినారు.

అమ్మను సాకకుంటే ఆస్తిని తిరిగిచ్చేయండి

నర్సమ్మ కుమారులకు కౌన్సెలింగ్..



గార్ల తహసీల్దార్ కార్యాలయంలో కుమారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్, ఎస్సై

సాక్షి ఎఫెక్ట్

గార్ల: ఆస్తిని తీసుకుని తల్లిని వదిలేసిన కుమారులకు తహసీల్దార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిని సాకాలని ఆదేశించారు. లేదంటే ఆమె పంచి ఇచ్చిన యావదాస్తిని తిరిగి తల్లికి చెందేటట్లుగా చేస్తామని కుమారులను హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా గార్లలోని జెండాబజారుకు చెందిన గాడెపల్లి నర్సమ్మను తన కుమారులు ఆస్తిని తీసుకుని సాకకుండా రోడ్డుపై వదిలేశారు. ఆమె దీనపరిస్థితిపై రెండు రోజుల క్రితం సాక్షి ప్రధాన సంచికలో 'ఆస్తి పంచకముందు అమ్మ.. పంచాక ఇదేమి ఖర్మ' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆమె కుమారులను తహసీల్దార్ కె. రవీందర్, ఎస్ఐ ఎస్.జీనత్‌కుమార్ గురువారం తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అవసరమైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌన్సెలింగ్‌లో కుల పెద్దలు కూడా పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.